ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

16 కడప


ఆదివారం 6 ఆగస్టు 2017


సుధీర్ (ఫైల్)

ఇడుపులపాయ విద్యార్థి... గేట్ ఫస్ట్ ర్యాంకర్
ముంబయిలో అనుమానాస్పద మృతి

ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో చదువుకుని గేట్‌లో జాతీయస్థాయిలో మొదటిర్యాంకు సాధించిన నెల్లూరుకు చెందిన సుధీర్ (23) ముంబయిలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్టు సమాచారం అందింది. బీపీసీఎల్‌లో ఉద్యోగం చేస్తున్న ఈయన తన గదిలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్టు సమాచారం.

3 లో

శాటిలైట్ సిటీకి


త్వరలో మోక్షం

కడప నగరం శివారులో సువిశాల స్థలంలో నిర్మించిన శాటిలైట్ సిటీలోని అసంపూర్తి గృహాలకు మోక్షం లభించనుంది. రెండు, మూడు రోజుల్లో హౌసింగ్ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసేందుకు వెళ్లనున్నారు. అనంతరం అసంపూర్తి గృహాల నిర్మాణాల వ్యయం, మౌలిక వసతులకు సంబంధించి ప్రతిపాదనలు రూపొందించేందుకు సమాయత్తమవుతున్నారు. ఎయిర్‌పోర్టు సమీపంలో ఏర్పాటు చేసిన శాటిలైట్‌సిటీలో ఒక్కో ఇంటిని రూ.1.31 లక్షలకు గతంలో ప్రభుత్వం విక్రయించింది. అయితే ఇప్పటి వరకు 1500 ఇళ్లకు గాను 302 కుటుంబాలు మాత్రమే నివాసం వుంటున్నాయి. మరో 2880 ఇళ్లు అసంపూర్తిగా వున్నాయి. వీటిపై అధికారులు దృష్టి సారించారు.

- రెండు, మూడు రోజుల్లో అధికారుల పరిశీలన
- అసంపూర్తి నిర్మాణంలోని గృహాలపై కసరత్తు
- ప్రతిపాదనలకు సమాయత్తం

6 లో



పాములతో జరభద్రం

- రైతన్నలకు జాగ్రత్తలు తప్పనిసరి
- నాటు వైద్యం వీడాలి
- ఆందోళనకు గురికావద్దంటున్న వైద్యులు


మధ్యపేజీలలో

గండి అంజన్నకు
శ్రావణశోభ

వేలాదిగా దర్శించుకున్న భక్తులు


గండిక్షేత్రంలోని వీరాంజనేయస్వామి మూలవిరాట్

16 లో



చిక్కులు తొలగిన
చుక్కల భూములు

చుక్కల భూములకు (డాటెడ్ ల్యాండ్సు) రాష్ట్ర ప్రభుత్వం మోక్షం చూపింది. రెవెన్యూ శాఖలో
ఉన్న ఆర్‌ఎస్‌ఆర్ పుస్తకంలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యకు పరిష్కారాన్ని చూపుతూ
ప్రభుత్వం జీవో 298ని విడుదలచేసింది. దీంతో రెవెన్యూలోని ఆర్‌ఎస్‌ఆర్ పుస్తకంలో చుక్కలు
తీసివేసి ఆయా భూములను ఇప్పటికే సాగుచేస్తున్నరైతుల పేర్లు పొందుపరుస్తారు.

6 లో

- ఏళ్ల తరబడి పెండింగ్‌లోని సమస్య
- పరిష్కారం చూపిన ప్రభుత్వం
- రైతుల్లో ఆనందం

బియ్యానికే పరిమితమైన

చౌక దుకాణాలు

● దశలవారీగా నిత్యావసర వస్తువులకు మంగళం

● లబోదిబోమంటున్న పేద ప్రజలు



బియ్యం వేయించుకుంటున్న మహిళ

రాజుపాళెం : రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు బియ్యం, నిత్యావసర వస్తువులు అందించేందుకు గ్రామాల్లో చౌక దుకాణాలను ఏర్పాటు చేశారు. గతంలో బియ్యం, చెక్కర, గోధుమలు, పామాయిల్, కందిబేడలు అందించేవారు. అయితే పామాయిల్, కందిబేడలు, గోధుమలకు ఇప్పటికే మంగళం పాడటంతోపాటు రెండు నెలల నుంచి కిరోసిన్ కూడా అందించడంలేదు. ఇప్పుడు మాత్రం చక్కెర కూడా ఇవ్వడంలేదని ప్రజలు వాపోతున్నారు. పేదలకు అందించే వస్తువులపైన ఇలా నిబంధనలు పెడితే తమ పరిస్థితి ఏమిటని ప్రజలు బెబ్బేలు చెందుతున్నారు. బియ్యం కిలో రూ.1, చక్కెర కేజీ రూ.13.50 పైసలు, కిరోసిన్ రూ.19 ఉండేది. నేడు చౌక దుకాణాల్లో కేవలం బియ్యానికే పరిమితం చేసి నిత్యావసర వస్తువులు తొలగించడంతో పేద ప్రజలకు భారంగా మారాయి. మార్కెట్లో చక్కెర రూ.42, పామాయిల్ రూ.60, కిరోసిన్ రూ.60 ధర పలుకుతుండడంతో ప్రజలకు భారంగా మారిందని తెలిపారు. మండలంలో 23 చౌక దుకాణాలకుగాను, అన్నపూర్ణ కార్డులు 7, అంత్యోదయ కార్డులు 690, తెల్లరేషన్‌కార్డులు 9466, మొత్తం 10,166 కార్డుల లబ్ధిదారులు ఈ నిత్యావసర వస్తువులు కోల్పోవాల్సి వచ్చింది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి గతంలో కొనసాగించిన విధంగా నిత్యావసర వస్తువులతోపాటు అన్నింటిని సక్రమంగా పంపిణీ చేసేలా చేయాలని వారు కోరుతున్నారు.

బియ్యం ఇస్తే ఎలా..


తెల్ల కార్డు తీసుకుని షాపుకువెళ్తే కేవలం బియ్యం ఇస్తే ఎలాగని నిత్యావసర వస్తువులను తొలగిస్తే బయట మార్కెట్‌లో కొని ఎలా బ్రతకాలన్నారు. అసలే కరవు పరిస్థితులు ఉండడంతో పనులు లేక సంసారం పూట గడిచేందుకే ఇబ్బంది పడుతుంటే పేద ప్రజలకు ఇచ్చే నిత్యావసర వస్తువులు తొలగిస్తే ఎలాగని వాపోయారు.



\- తిమ్మ లక్షుమ్మ

చౌక దుకాణాలంటే పేద ప్రజల దుకాణాలు

చౌక దుకాణాలంటే పేద ప్రజల దుకాణాలు అనేవారని, ప్రస్తుతం ఏమీ అందించడంలేదని వాపోయారు. కిరోసిన్, చక్కెర, నూనె, కందిపప్పు ఇలా ప్రతి వస్తువు అధిక రేట్లతో కొనడం ఎలాగని రూ.185లకే 9 వస్తువులు అని చెప్పిన ప్రభుత్వం ఇలా చేస్తే పేదలు బ్రతికేదెలాగని తెలిపారు.



\- మద్దిలేటి

స్వాతంత్ర దినోత్సవం విజయవంతానికి కృషి

● ప్రణాళిక బద్ధంగా జరగాలి ● ప్రొటోకాల్ తప్పక పాటించాలి : కలెక్టర్ బాబూరావునాయుడు





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాబూరావునాయుడు, పాల్గొన్న అధికారులు

కడప, కోటిరెడ్డిసర్కిల్ : ఈ నెల 15 జిల్లా కేంద్రమైన కడపలో నిర్వహించనున్న 71వ స్వాతంత్ర్యదినోత్సవం విజయవంతానికి అధికారులు కృషి చేయాలని కలెక్టర్ బాబూరావునాయుడు సూచించారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని వీసీ హాలులో నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ కార్యక్రమాల నిర్వహణ ప్రణాళిక బద్దంగా ఉండాలన్నా రు. ఇందులో ఎలాంటి పొరబాట్లకు చోటివ్వరాదన్నారు. జిల్లా అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ఆస్తుల పంపిణీకి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా శాఖల ప్రగతి శకటాలను ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా ఆహ్వాన పత్రికలు అందించేటపుడు ప్రోటోకాల్‌ను తప్పక పాటించి ఏ ఒక్కరిని మరువవద్దన్నారు. పేరేట్ గ్రౌండ్‌లో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కు జిల్లా విద్యాశాఖ, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ బాధ్యతలు తీసుకోవాలని సూచించారు. మైదానంలో వైట్ వాష్, పెయింటింగ్ తదితర పనులను రోడ్లు భవనాల శాఖ అధికారు లు చర్యలు తీసుకోవాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలన్నా రు. పేరేడ్ మైదానంలో మార్చ్‌ఫాస్టు జెండా ఆవిష్కరణ తదితరాలు పోలీసుశాఖ అధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. అత్యధిక సంఖ్యలో ఎస్‌హెచ్‌జీ బృందాలు పాల్గొనేలా మెప్మా, డీఆర్‌డీఏ శాఖలు చూసుకోవాలన్నారు. మంచిగా పనిచేసిన అధికారులకు, సిబ్బందికి ప్రశంశాపత్రాలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారిని ఆదేశించారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణలో పీఏ సిస్టంను అంతరాయం లేకుం డా చూడాలన్నారు. మంచి వ్యాఖ్యతను కూడ ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టర్ బంగ్లాలో కూడ అట్ హోం కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశాంచారు. ఈ సమావేశంలో జేసీ శ్వేత తెవతీయ, జేసీ-2 శివారెడ్డి, డీఆర్వో నరసింహారావు, ప్రత్యేక కలెక్టర్ నాగేశ్వరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాలలను సంరక్షించే బాధ్యత

తల్లితండ్రులదే

శివప్రసాద్‌రెడ్డి, ఐసీపీఎస్ జిల్లా అధికారి



కడప, అర్బన్ :

బాలలలను సంరక్షించే బాధ్యత ముందు తల్లిదండ్రులదని ఆ తర్వాతనే ఇతరులదని ఇంటిగ్రేటెడ్ చైల్డ్ ప్రొటెక్షన్ స్కీమ్ జిల్లా అధికారి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆంధ్రజ్యోతి నిర్వహించిన ఇంటర్వ్యూలో పలు విషయాలు తెలిపారు.

ప్రశ్న : బాలలను తల్లిదండ్రులు ఎలా సంరక్షించాలి ?

జవాబు : బాలలపై తల్లిదండ్రులు దృష్టి సారించి వుండాలి. పిల్లలు ఏం చేస్తున్నారు. ఎలా మెలుగుతున్నారు గమనిస్తుండాలి. అప్పుడు పిల్లలను రక్షించుకోగలరు.

ప్రశ్న : మీరు ఏ బాలలను సంరక్షిస్తుంటారు ?

జవాబు : అనాథలను, తల్లిదండ్రులు వదిలి వేసిన పిల్లలను మానవ అక్రమ రవాణాకు గురైన పిల్లలను గుర్తించి పరిరక్షిస్తాం. అంటే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించి వారి చదవు, వసతి సౌకర్యాలు కల్పిస్తాం.

ప్రశ్న : మానవ అక్రమ రవాణా అరికట్టాలంటే ఏమి చేయాలి ?

జవాబు : ఎక్కువగా బాలికలు, యువతులు, వితంతువులు, ఒంటరి మహిళలు ఎక్కువగా అక్రమ రవాణాకు గురవుతున్నారు. అరికట్టాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలి. అవగాహన సదస్సులు నిర్వహించి అప్రమత్తం చేయాలి. మోసగాళ్ళ గురించి పూర్తిగా వివరించాలి. లేనిపోని ఆశలకు గురికాకుండా జాగ్రత్త పర్చాలి.

ప్రశ్న : మీ విధులు ?

జవాబు : మానవ అక్రమ రవాణా, భ్రూణహత్యలు, బాల్యవివాహాలను నిరోధించడానికి అందరిలో అవగాహనక కల్పించడం లాంటివి.

ప్రశ్న : ఇంకా ?

జవాబు : బాలల హక్కులు, చట్టాల గురించి వివరించడం, ఎక్కడైనా బాలలు వేధింపులకు గురవుతుంటే, బిచ్చం మొత్తుతుంటే వారికి సరైన న్యాయం కల్పించడం లాంటివి.

ప్రశ్న : మీరు ఎవరెవరి సహకారం తీసుకుంటారు ?

జవాబు : అంగన్‌వాడీ కార్యకర్త, సీడీపీవోలు, ఏఎన్‌ఎంలు, డ్వాక్రా మహిళలు మండలాధికారులు, తహసీల్దారులు, గ్రామ సేవకులు, పోలీసులు, సంఘ సేవకుల సహకారం తీసుకుంటాము.

వీరభద్రాలయంలో

ఘనంగా శనిత్రయోదశి పూజలు



శనిత్రయోదశి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

రాయచోటిటౌన్: పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో శనివారం శనిత్రయోదశి సందర్భంగా తెల్లవారుజాము నుంచి శనీశ్వరునితో పాటు నవగ్రహాలకు తైలాభిషేకాలు, నవగ్రహ శాంతి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో మంజుల ఆధ్వర్యంలో అర్చకులు మల్లికార్జునస్వామి శనీత్రయోదశి పూజల విశిష్టతల గురించి భక్తులకు తెలియజేశారు. అనంతరం భక్తులు శనీశ్వరునితో పాటు నవగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో చదివిన

గేట్ ఫస్ట్ ర్యాంకర్ సుధీర్ మృతి

● అనుమానాస్పదంగా ముంబైలో ఘటన.. ● సుధీర్ స్వస్థలం నెల్లూరు
● ఐఏఎస్ కల నెరవేరకుండానే..

వేంపల్లె: టెన్త్‌లో టాపర్‌గా నిలిచాడు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో సీటు దక్కించుకుని మెకానికల్ ఇంజనీర్‌గా 9 గ్రేడ్‌పాయింట్లకు పైగా మార్కులతో ప్రతిభ కనబరిచి పూర్తి చేశాడు. ఆలిండియా గేట్ పరీక్షలో మొదటి ర్యాంకు సాధించాడు. కేంద్ర ప్రభుత్వ సంస్థ భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌లో పనిచేస్తున్న కొవ్వూరు సుధీర్ (23) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ముంబైలోని తన గదిలో ఆత్మహత్య చేసుకున్నట్లు ఇక్కడి ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీకి సమాచారం అందింది. ఐఏఎస్ కావాలనుకున్న తన కల నెరవేరకుండానే అనంతలోకాలకు వెళ్లిపోయాడు. వివరాలిలా ఉన్నాయి.

నెల్లూరు జిల్లా సుందరయ్యనగర్, జాషువా కాలనీ వాసులు సుధాకర్, గౌరి దంపతులకు ఇద్దరు కుమారులు సుధీర్, విజయ్‌కుమార్. ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పిల్లలను చదివించేవారు సుధాకర్. 10లో 10/10 జీపీఏ సాధించిన సుధీర్ ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో 2010లో సీటు దక్కించుకున్నాడు. ఆరేళ్లు చదివి మెకానికల్ ఇంజనీరింగ్‌లో 9గ్రేడ్ పాయింట్లు సాధించి ఉత్తీర్ణత పొందాడు. 2016లో గేట్ పరీక్ష రాసి 3 వేల ర్యాంకు రాగా రెండో ప్రయత్నం 2017లో మరింత కష్టపడి చదివి ఆలిండియా స్థాయిలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి గేట్ మొదటి ర్యాంకు సాధించాడు. ఆ సందర్భంలో



ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో సుధీర్‌కు మెమెంటోను అందిస్తున్న డైరెక్టర్ భగవన్నారాయణ (ఫైల్)

ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీకి వచ్చిన సుధీర్‌ను డైరెక్టర్లు భగవన్నారాయణ, విశ్వనాథ రెడ్డి, ఇతర అధ్యాపక బృందం సత్కరించారు.

ముంబైలో బీపీసీఎల్ ఉద్యోగం చేస్తూ

ఆలిండియా గేట్ పరీక్షలో మొదటి ర్యాంకు సాధించిన కొవ్వూరు సుధీర్‌కు కేంద్ర ప్రభుత్వ సంస్థ బీపీసీఎల్‌లో ఇటీవల ఉద్యోగం లభించింది. నెలన్నర క్రితం ముంబైలో బీపీసీఎల్ కంపెనీలో జాయిన్ అయినట్లు తెలిసింది. ఆ ఉద్యోగంపై సంతృప్తి లేదని తరచూ తన స్నేహితులతో చెబుతున్నట్లు తెలిసింది. కుటుంబ పరిస్థితుల కారణంగా ఉద్యోగంలో కొనసాగుతూ అకస్మాత్తుగా శుక్రవారం తన గదిలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడని నెల్లూరులోని కుటుంబ సభ్యులకు, ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీకి సమాచారం అందింది.

ఐఏఎస్ కల నెరవేరకుండానే

ఐఏఎస్ సాధించి ప్రజలకు సేవచేయడమే లక్ష్యమని ఆలిండియా గేట్ పరీక్షలో మొదటి ర్యాంకు సాధించిన సందర్భంలో కొవ్వూరు సుధీర్ చెప్పారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో అధ్యాపకులు సన్మానించిన సమయంలో ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్, అధ్యాపకులకు తన అనుభవాలను తెలియజేశారు. ఆ సమయంలో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఐఏఎస్ అవుతానని ధీమాగా చెప్పారు. అందుకు తగ్గట్లుగానే సివిల్స్‌కు సంబంధించి ప్రిలిమ్స్ పరీక్ష కూడా రాసినట్లు తెలుస్తోంది. ఐఏఎస్ సాధించాలన్న లక్ష్యం సాధించకుండానే మృతి చెందాడు. కాగా ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో చదువుతున్న సమయంలో ప్రతి పరీక్షలోనూ విశేష ప్రతిభ కనబరిచేవాడు. ఆయన అందరితో కలిసి తిరిగేవాడని, సహచర విద్యార్థులకు ఎలాంటి సందేహం ఉన్నా సంతోషంగా చెప్పేవాడని చదువు చెప్పిన మెకానికల్ విభాగానికి చెందిన అధ్యాపకులు తెలిపారు. కోరుకున్న ఉద్యోగం, సాధించే ప్రతిభ ఉన్న సుధీర్‌లాంటి విద్యార్థి ఈ లోకంలో లేడని చెప్పుకోవడం బాధ అనిపిస్తోందని ఆవేదన వ్యక్త పరిచారు.

సేవ పేరుతో వృద్ధులకు నరకం

ఒక బాలికపై అత్యాచారం
గుడ్‌హార్ట్ ఫౌండేషన్ నిర్వాహకుల అరెస్టు
కారు, బైకు, కంప్యూటర్లు, రికార్డులు సీజ్
కడప డీఎస్పీ షేక్ మాసుంబాషా



అరెస్టయిన గుడ్‌హార్ట్ ఫౌండేషన్ నిర్వాహకులు, వివరాలను తెలియజేస్తున్న కడప డీఎస్పీ

కడప, క్రైం: స్థానిక పాతరిమ్స్‌లో గుడ్‌హార్ట్ ఫౌండేషన్ సంస్థ నిర్వహిస్తూ ప్రభుత్వ నిధులు స్వాహా చేస్తూ వృద్ధులను వేధింపులతో నరకం చూపిన నిర్వాహకులను వన్ టౌన్ పోలీసులు ఆర్టీసీ గేట్‌వద్ద అరెస్టు చేశారు. కడప వన్ టౌన్ స్టేషన్ లో శనివారం సాయంత్రం డీఎస్పీ షేక్ మాసుంబాష, సీఐ సత్యనారాయణ, ఎస్ఐ హుసేన్ విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను వెల్లడించారు. కడప వాసి పాతపల్లి హరినాధ్ ప్రసాద్, అతని భార్య మేడా గంగాదేవి గుడ్‌హార్ట్ ఫౌండేషన్ సంస్థను ఏర్పాటు చేసి వృద్ధులకు ఆశ్రయం కల్పిస్తున్నారు. వృద్ధాశ్రమం పేరుతో వృద్ధులను చేరదీసి వారికి వచ్చే పింఛన్, ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను స్వాహా చేశారు. వృద్ధులనే కనికరం లేకుండా వారికి భోజనం కూడా పెట్టకుండా విచక్షణారహితంగా దాడి చేయడం, వారికి సరైన వైద్యం కూడా కల్పించక పోవడం దారుణం. అంతేకాకుండా ఆశ్రమంలో వున్న ఓ బాలికపై హరినాధప్రసాద్ అత్యాచారం చేసినట్లు తెలిపారు. వృద్ధులపై వేధింపులు, వారికి నరకం చూపిస్తున్న విషయం జిల్లా జడ్జి శ్రీనివాసుల దృష్టికి రావడంతో గత నెల 23న జిల్లా జడ్జి స్వయంగా గుడ్‌హార్ట్ ఫౌండేషన్ సంస్థను తనిఖీ చేశారు. అక్కడున్న వృద్ధులపై జరిగే వేధింపులను అడిగి తెలుసుకున్నారు. సంస్థలో వున్న 51 మంది పరిస్థితి సరిగా లేకపోవడంతో వారిని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఓ వృద్ధురాలు ఆకలిబాధ తట్టుకోలేక మృతి చెందింది. గుడ్‌హార్ట్ ఫౌండేషన్ లో ప్రభుత్వ నిబంధనల మేరకు రాత్రి షెల్టర్‌లో ఒక మేనేజరు, ముగ్గురు కేర్‌టేకర్లు, ఆయా వుండాల్సి వుంది. అయితే వారిని ఎవరినీ నిర్వాహకులు నియమించకుండానే మొత్తం డబ్బు స్వాహా చేస్తున్నారు. గుడ్‌హార్ట్ ఫౌండేషన్ ఆశ్రమంలోకి ఇతరులను రానివ్వకుండా బెదిరింపులకు పాల్పడుతుండడంతో కడప జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్ ఎస్‌వీ శేషాద్రి ఫిర్యాదుపై పోలీసు, రెవెన్యూ అధికారులు గుడ్‌హార్ట్ ఫౌండేషన్ లో తనిఖీ నిర్వహించి వృద్ధులు ఇచ్చిన సమాచారం మేరకు వారిపై 344, 386, 354తో పాటు 60 ఫోక్సో యాక్టు చట్టం కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు నిర్వాహకులైన దంపతుల పై కేసు నమోదు చేసి వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

బోరులో నీళ్లుపడ్డాయన్న సంబరం ఆవిరి

విద్యుదాఘాతానికిగురై రైతు మృతి

వేంపల్లె: అరటి తోటకు నీరు పెట్టుకునేందుకు కొత్తగా వేసిన బోరు నీరు సమృద్ధిగా పడ్డాయి. ఈ ఆనందాన్ని ఎంతో సమయం అనుభవిస్తూ విద్యుదాఘాతానికి గురై రైతు తక్కెళ్ల ఫకృద్దీన్ (63) దుర్మరణం చెందాడు. ఇదే ఘటనలో ఆయన పెద్ద కుమారుడు దర్బార్ తృటిలో తప్పించుకున్నాడు. బాధితుల కథనం మేరకు సంఘటన వివరాల్లోకెళితే...

స్థానిక శ్రీరాంనగర్ వాసి తక్కెళ్ల ఫకృద్దీన్ కు చింతలమడుగుపల్లె సమీపంలో తనకున్న భూమిలో అరటిపంటను సాగుచేశారు. లక్షలాది రూపాయలు పెట్టుబడి సాగుచేస్తున్న అరటికి ఇటీవల బోరులో నీళ్లు తగ్గుతున్నాయి. దీంతో అరటి దెబ్బతినే అవకాశం కన్పించడంతో నీరు పారగట్టేందుకు కొత్తబోరు వేయబూనాడు. వేసిన బోరులో నీళ్లు సమృద్ధిగా పడ్డాయన్న సంబరంతో శనివారం బోరును బిగించుకున్నాడు. కాగా బోరు వేసిన సమయంలో భూమిపైన నీటి చెమ్మ ఏర్పడింది. చెమ్మ ఉన్న ప్రాంతంలో కుమారుడు దర్బార్‌తో కలిసి విద్యుత్ తీగలను తగిలిస్తుండగా తీగలు తగులుకుని విద్యుదాఘాతానికి



బోరు నుంచి చిమ్ముతున్న నీరు

గురయ్యాడు. దీంతో ఒక్కసారిగా ఫకృద్దీన్ కుప్పకూలి పోయాడు. దీన్ని గ్రహించిన కుమారుడు దర్బార్ తీగ మీద పడకుండా జాగ్రత్త పడ్డాడు. వెంటనే తేరుకుని తండ్రిని రక్షించేందుకు పక్కకు లాగేలోపులే ఫకృద్దీన్ మృతిచెందాడు. కొత్త బోరులో నీళ్లు పడ్డాయి, అరటితోటకు ఎలాంటి ఇబ్బంది ఉండదన్న సంబరాన్ని అనుభవించకుండానే ఫకృద్ధీన్ మృతి



మృతుడు తక్కెళ్ల ఫకృద్దీన్

చెందాడు. కొత్త బోరు నుంచి వచ్చిన నీరు పడి భూమి తడిగా ఉండడం కూడా విద్యుత్ ప్రమాదానికి ప్రధాన కారణమైంది. నీరు పారగట్టుకోవాలని అనుకున్న రైతు మృత్యువాత పడడంతో చుట్టుపక్కల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ కుటుంబంలో నీళ్లుపడ్డ సంతోషం ఎంతోసేపు మిగలలేదు. కోఆప్షన్ సభ్యులు దర్బార్, మాజీ కోఆప్షన్ సభ్యులు సాధక్‌వల్లి, ఇడుపులపాయ ఉపసర్పంచు శంకరయ్య, గండి మాజీ చైర్మన్ రమణ, మండల టీడీపీ అధ్యక్షుడు షబ్బీర్ మృతదేహాన్ని పరిశీలించి వారి కుటుంబాన్ని పరామర్శించారు. కుమారుడు దర్బార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ట్యాంకర్ బోల్తా - డ్రైవర్‌కు గాయాలు

రామాపురం: కర్నూలు- చిత్తూరు జాతీయ రహదారి గువ్వలచెరువు ఘాట్ రోడ్డు నాల్గవ మలుపు వద్ద శనివారం అదుపు తప్పి ట్యాంకర్ బోల్తాపడడంతో డ్రైవర్ తీవ్రగాయాలపాలైనట్లు ఎస్ఐ క్రిష్ణమూర్తి తెలిపారు. తమిళనాడుకు చెందిన టీఎన్02 బీఏ 5769 నెంబరు ట్యాంకర్ క్రూడాయిల్‌తో వస్తూ గువ్వలచెరువు ఘాట్‌లో మలుపు వద్ద అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ట్యాంకర్ డ్రైవర్ పళణిముత్తు తీవ్రగాయాలపాలయ్యాడు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ సంఘటనా స్థలానికి వెళ్లి గాయపడిన డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.



ఘాట్‌లో బోల్తా పడ్డ ట్యాంకర్

తాగినమైకంలో కాలేజీ విద్యార్థులతో

హైస్కూల్ విద్యార్థుల గొడవ

పోలీసులకు అప్పగించిన ఉపాధ్యాయులు

రైల్వేకోడూరు: పాఠశాలలో చదివి ఉన్నత స్థాయిలోకి చేరకోవాలని తల్లిదండ్రులు ఆశప డడంలో తప్పులేదు. అయితే ఉన్నత పాఠశాల చదువు సమయంలోనే మద్యం తాగే అలవాటు వారి జీవితాలను నాశనం చేస్తోంది. చివరకు ఉపాధ్యాయులే పోలీసులకు అప్పగించిన వైనం రైల్వేకోడూరు గవర్నమెంట్‌హైస్కూలు విద్యార్థుల ఘటన వివరాల్లోకెళితే....

14 ఏళ్ల వయసులోనే తాగినమైకంలో శనివారం గవర్నమెంట్‌హైస్కూలు 9వతరగతి విద్యార్థులు గొడవపడ్డారు. ఇందుకు కారణం గత శుక్రవారం ఉదయం ప్రభుత్వ జూనియర్‌కాలేజిలో సీనియర్ ఇంటర్ విద్యార్థి వెళు తుండగా కాలేజి ఆరవణలోని గవర్నమెంట్‌హైస్కూలు విద్యార్థులు కాలేజికి వెళ్లే దారిలో సైకిల్‌ను అడ్డంగా పెట్టారు. దీంతో సైకిల్‌ను తొలగించాలని హైస్కూల్ విద్యార్థికి చెప్పడంతో చిన్నపాటి గొడవ జరిగింది. దీంతో కాలేజి విద్యార్థి తన సోదరుడికి జరిగినవిషయాన్ని తెలిపాడు. సోదరుడు హైస్కూల్ విద్యార్థిని మందలించాడు. జరిగిన గొడవను ఇంట్లో చెబుతావా అంటూ హైస్కూల్ విద్యార్థులు మరికొందరితో కలసి మద్యంసేవించి కాలేజి ఆవరణలోకి వెళ్లి సీనియర్ విద్యార్థితో గొడవపెట్టుకుని కర్రలతో దాడిచేశారు. దీంతో కాలేజి విద్యార్థికి తలపై, ముఖంపై గాయాలయ్యాయి. ఈ విషయాన్ని కాలేజి పీడీ శారద గమనించి హుటాహుటిన వెళ్లి గొడవపడుతున్నవారిని వారించి నాలుగుదెబ్బలువేసి ఎస్ఐ వెంకటేశ్వర్లుకు సమాచారం ఇచ్చింది. ఇదేకాకుండా కాలేజి పక్కనున్న హాస్టల్ దగ్గర కూర్చుని పలువురు మద్యం సేవిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. హైస్కూల్ విద్యార్థులను పోలీసులు విచారిస్తున్నారు. విద్యార్థులు మద్యానికి బానిసకాకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఘనంగా శనిత్రయోదశి పూజలు



రాజంపేట : రాజంపేట పోలి చెరువు కట్టపై వెలసి ఉన్న శ్రీ శనేశ్వరస్వామి దేవస్థానంలో శనిత్రయోదశి సందర్భంగా ఉదయం 5గంటల నుంచి పంచామృతాభిషేకాలు, తైలాభిషేకం, నవగ్రహ హోమాలు, శనిదోష పరిహారాలు చేయడం జరిగిందని విజయస్వామి, రవిస్వామి, సుధీర్‌స్వామి, దత్తుస్వామి, నటరాజస్వామి, శ్రీధర్‌స్వాములు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి శనిదోష పరిహారం చేయించుకున్నారు.

పశువుల ద్వారా సంక్రమించే వ్యాధులు

రాజంపేట

వివిధ రకాల జంతువుల నుంచి మనుషులకు వ్యాధులు సంక్రమిస్తున్నాయి. ముఖ్యంగా వాతావరణ పరిస్థితులు మన పరిసర ప్రాంతాలలో ఉన్న అపరిశుభ్రత కీటకాలు, దోమలు, ఈగలు తదితర వాహకాల ద్వారా ఈ వ్యాధులు సంక్రమిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. అలాంటి వాటిపట్ల అప్రమత్తతగా ఉండకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుంది. అయితే ఈ వ్యాధులు ప్రబలిన వెంటనే లేదా వ్యాధులు ప్రబలే ముందు తగుజాగ్రత్తలు పాటిస్తే చాలా వరకు వాటి నుంచి రక్షణ పొందవచ్చు. పశువుల నుంచి సంక్రమించే వ్యాధులు.. నివారణోపాయాల గురించి సమగ్ర వివరాలిలా ఉన్నాయి.



ఆవులు (ఇన్‌సెట్‌లో) దోమ



గేదె

మెదడు వాపు వ్యాధి(జపనీస్ ఎన్సెఫలైటిస్)

ఈ వ్యాధి సాధారణంగా పిల్లలో 2నుంచి 15సంవత్సరాల వయసు ఉన్న వారిలో వస్తుంది. ఈ వ్యాధి కారక వైరస్ నీటి పక్షులు, పందులలో ఉండి క్యూలెక్స్ దోమల ద్వారా వ్యాపిస్తుంది. జ్వరం, తలనొప్పి, మెడ, బిగుసుకుపోవడం, వింత కదలికలు, అప్రయత్న పూర్వకంగా కండరములు ముడుచుకోవడం వంటివి లక్షణాలు. పిల్లలు కోమాలోకి పోయి చివరకు మరణిస్తారు.

క్రిమియన్ కాంగో హెమరేజిక్ జ్వరం

ఈ వ్యాధి 2011జనవరిలో గుజరాత్ రాష్ట్ర సనంద్ ప్రాంతంలో ఒక రోగి, అతనికి చికిత్స చేసిన వైద్యునితో పాటు నలుగురు చనిపోయారు. వ్యాధి కారకమైన నైరోవైరస్ పశువుల నుంచి సక్రమిస్తుంది. వ్యాధికి గురైన జంతువుల రక్తం, ఇతర స్రావాలను తాకడం వలన కూడా మనుషులు ఈ వ్యాధికి గురవుతారు. జ్వరం చర్మంపైన రక్తస్రావంతో కూడిన దదుర్లు, కామెర్లు, వాంతులు, విరేచనాలు, కీళ్ళ నొప్పి, మెడ కండరాల నొప్పి ముఖ్యమైన లక్షణాలు.

క్యసనుర్ ఫారెస్ట్ వ్యాధి

ఈ వైరల్ జ్వరాన్ని 1957లో కర్ణాటక రాష్ట్రంలో గుర్తించారు. ఈ వ్యాధి జంతువుల హీమఫైసాలిస్ స్పెనెగెర అనే పిడుదు ద్వారా వ్యాపిస్తుంది. కంఠము, కడుపు, చిగుర్లు, ముక్కు నుంచి రక్తస్రావము, నుదుటి భాగంలో తీవ్రమైన తలనొప్పి, కండరాల నొప్పి వంటివి మనుష్యులలో ముఖ్యమైన లక్షణాలు.

వెస్ట్‌నైల్ ఎన్సెఫలైటిస్

వెస్ట్‌నైల్‌వైరస్ సాధారణంగా పక్షులలో ఉండి దోమల ద్వారా మనుషులకు ఇతర జంతువులకు వ్యాపిస్తుంది. జ్వరం మెడ బిగుసుకుపోవడం, నరాల బలహీనత, కండరముల చైతనశక్తి నశించడం, పక్షవాతం వంటివి ముఖ్య లక్షణాలు.

-ప్లేగు వ్యాధి (బ్లాక్ డెత్ /మహమ్మారి)

వ్యాధి కారక బ్యాక్టీరియా ఎర్సీనియా, ఫెస్టిస్ సాధారణంగా ఎలుకలు, ఉడుతలు, ఇతర చిన్న జంతువులలో ఉండి వాటిపై ఉన్న ఈగల ద్వారా మనుషులకు వ్యాపిస్తుంది. ఈ వ్యాధి మనుషులలో ఫ్లూ జ్వరంతో పోలిన లక్షణాలతో మొదలై గజ్జలలో బిళ్ళలు కట్టి, క్రమేపి పుళ్ళుగా మారి నొప్పిని కలిగిస్తుంది.

తులరీమియా కుందేళ్ళ జ్వరం

వ్యాధికారక బ్యాక్టీరియా ఫ్రాన్సిసెల్లా తులరెన్సిస్ సాధారణంగా కుందేళ్ళు, ఎలుకలో ఉండి పిడుదుల ద్వారా గాని, కలుషిత నీరు, ఆహారం ద్వారా గానీ, బాధిత జంతువులను తాకడం ద్వారా మనుషులకు వ్యాపిస్తుంది. చర్మంపై పుండ్లు, చంక మొలభాగంలో నూమోనియా వంటివి ముఖ్యలక్షణాలు.

స్క్రబ్ టైఫస్ విషజ్వరం

వ్యాధికారక బ్యాక్టీరియా ఒరియెన్షియా సుసుగాముషి సాధారణంగా ఎలుకలు మొదలు చిన్న జంతువులలో ఉండి పొదలలో దాగి ఉన్న గోమార్ల (చిగ్గర్/లార్వాల్ మైట్స్) ద్వారా మనుషులకు వ్యాపిస్తోంది. జ్వరం, చర్మంపైన బొబ్బలు, దద్దుర్లు, పుండ్లు, దగ్గు వంటివి ముఖ్య లక్షణాలు.

లీప్టోనియాసిస్

కుక్కలు, ఎలుకల నుంచి సాండ్ ప్లైస్ ద్వారా వ్యాధికారక ఏకకణ సూక్ష్మజీవులు వ్యాపిస్తాయి. కాలేయం, ప్లీహం ఉబ్బడం, రక్తహీనత, చర్మంపైన కురుపులు, పండ్లు, మచ్చలు వంటివి ముఖ్యలక్షణాలు.

గినియా పురుగు వ్యాధి (డ్రాకన్ కులైసిస్)

కలుషితమైన నీటిలో ఉన్న వ్యాధికారక గినియా పురుగు లార్వా సైక్లాప్స్ అనే నీటి ఈగల ద్వారా మనుషులకు, కుక్కలకు వ్యాపిస్తుంది. మొదట దురదతో కూడిన దద్దుర్లతో మొదలై బొబ్బలుగా, నొప్పితో కూడిన కురుపుగా ఏర్పడుతుంది. ఈ కురుపులకు నీరు తగిలినపుడు గినియా పురుగు లార్వా నీటిలోకి విడుదల అవుతుంది. ఇవేకాక డెంగ్యూ, చికన్ గున్యా, రిలాప్సింగ్/తిరగబట్టే జ్వరం, లైమ్ డిసీజ్, రిఫ్ట్ వ్యాలీ జ్వరం, చాగాస్ వ్యాధి, బ్రుగియన్ ఏనుగుకాలు/బోదకాలు, డైఫిలోబోత్రియాసిస్ వ్యాది లాంటి జూనోటిక్ వ్యాదులు మన చుట్టూ ఉన్న వివిద రకాల కీటకాల ద్వారా వ్యాపిస్తాయి.

నివారణ చర్యలు

కీటక నిరోధకాలు వాడడం. దోమలను వివిద పద్ధతులలో నిర్మూలించడం.

పశువైద్యుని సంప్రదించి పిడుదులు, గోమార్లను నివారించటానికి తగిన మందులు వాడడం, పశువులకు, పెంపుడు జంతువులకు సక్రమంగా టీకాలు వేయించడం, నివాసాలకు దూరంగా పందులను ఉంచడం, పశుపాకలో పనిచేటప్పుడు రక్షిత చేతి తొడుగులు, పొడవాటి బట్టలు ధరించటం తప్పక పాటించాలి.

శ్రీ సౌమ్యనాథస్వామిని దర్శించుకున్న రాజంపేట జడ్జి

నందలూరు : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన చారిత్రాత్మక నందలూరు శ్రీ సౌమ్యనాథస్వామి వారిని రాజంపేట మూడవ ఏడీజే జడ్జి సత్యవాణి శనివారం ఉదయం దర్శించుకున్నారు. ఈ నేపథ్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పాలక మండలి అధ్యక్షుడు పల్లె సుబ్రమణ్యం ఆయన ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. రాజంపేట గీతాంజలి విద్యాసంస్థల అధినేత రమణ దంపతులు, కడప ఏసీపీ శ్రీనివాస రెడ్డి సతీమణి స్వామి వారిని దర్శిం చుకున్నారు.

కార్పొరేషన్ రుణాల కోసం 9న ఇంటర్వ్యూలు

ఒంటిమిట్ట : 2017-18ఆర్థిక సంవత్సరానికి గానూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, కాపు కార్పొరేషన్ ల ద్వారా రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్న వారికి ఈ నెల 9న మండల పరిషత్ సభాభవనంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వెంకటప్రసాద్ తెలిపారు. బీసీ, మైనారిటీ, కాపు, కార్పొరేషన్ దరఖాస్తు దారులకు ఉదయం 10నుంచి 1గంట వరకు, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ దరఖాస్తు దారులకు మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు స్క్రీనింగ్ కమిటీ సభ్యులు, బ్యాంకు మేనేజర్లు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని దరఖాస్తు దారులు ఆన్ లైన్ దరఖాస్తు ఫారం, కుల, ఆదాయ, రేషన్ , ఆధార్ పత్రాలతో రావాలని కోరారు.

గంజాయి,ఖైనీ ప్యాకెట్లు సహా ముగ్గురి అరెస్ట్



ఖైనీ, గంజాయి ప్యాకెట్లుసహా నిందితులతో పోలీసులు

నందలూరు : మండల కేంద్రంలోని బస్టాండు కూడలి సమీపంలో గంజాయి-ఖైనీ ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని ముగ్గురు వ్యక్తులను శనివారం అరెస్ట్ చేసినట్లు ఒంటిమిట్ట సీఐ రవికుమార్ పేర్కొన్నారు. నందలూరు పోలీస్‌స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్ఐ ప్రతాప్‌రెడ్డికి అందిన రహస్య సమాచారం మేరకు కాపు కాచి కడప నుంచి నందలూరు షాను సూపర్‌మార్కెట్ ఏపీ04వి1915 అనే బజాజ్ ఆటోలో తరలిస్తున్న 60వేల రూపాయలు విలువ చేసే ఒక కేజీ గంజాయి, ఖైనీ ప్యాకెట్లు స్వాధీనం చేసుకోవడంతో పాటు కడపకు చెందిన కోటా వెంకటరమణయ్య, ఆటో డ్రైవర్ పెద్దినేని రమణయ్య షాను సూపర్‌మార్కెట్ యజమాని షేక్ కరిముల్లాలను అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు. అదుపులోకి తీసుకున్న వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచ నున్నట్లు ఆయన తెలిపారు. నందలూరు తహశీల్దార్ దార్ల చంద్రశేఖర్, వీఆర్వో వెంకటేశ్వర్లు సమక్షంలో నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. ప్రజలు చెడు అలవాట్లకు గురికావద్దని, ఎవరైనా నిషేధిత గుట్కా, ఖైనీ లాంటి వస్తువులను అమ్ము తుంటే తమకు సమాచారం అందజేయాలని సమాచారం అందజేసిన వారిపేర్లను గోప్యం గా ఉంచుతామని సీఐ తెలిపారు. ఈ సమావేశంలో హెడ్‌కానిస్టేబుల్ శివాజీ గణేషన్ , పోలీసులు, సుధాకర్‌రెడ్డి, విజయ్, హోమ్‌గార్డులు శ్రీను, సుబ్బనరసయ్యలు పాల్గొన్నారు.

గిరిజన రైతులకు ప్రోత్సాహం

● ఉద్యానశాఖ ద్వారా ఆర్థిక సాయం ● ఏడీ వెంకటేశ్వర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యానవనశాఖ ఏడీ వెంకటేశ్వర్‌రెడ్డి

సుండుపల్లె: మామిడి తోటల్లో 15 సంవత్సరాలు పైబడిన ముదురుచెట్లు ఉన్న గిరిజన రైతులకు ఉద్యానవనశాఖ ద్వారా ప్రోత్సాహం ఇవ్వనున్నట్లు ఆ శాఖ ఏడీ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. శనివారం కొలిమిట్టలో గిరిజన మామిడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ 15 సంవత్సరాల ముదురుచెట్లకు కొమ్మలు కత్తిరించి దుక్కులు చేసుకుని ఎరువులు వేసుకుంటే ఒక రైతుకు ఎకరాకు రూ.8 వేలు చొప్పున ఉద్యానవనశాఖ ద్వారా ఆర్థిక ప్రోత్సాహం అందజేయనున్నట్లు తెలిపారు. వానరాచపల్లె బిడికి, ఉప్పరపల్లె, కొలిమిట్ట బిడికి ప్రాంతాల్లోని గిరిజన రైతులకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని ఆయన వివరించారు. రాష్ట్రీయ విభజన ఉద్యాన యోజన పథకం ద్వారా ఈ ఆర్థిక సహాయాన్ని అందజేయనున్నట్లు ఏడీ తెలిపారు. ఈ సందర్భంగా మామిడి తోటల పునరుద్ధరణ పద్ధతులపై మామిడి రైతులకు ఆయన శిక్షణ ఇచ్చారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవనశాఖ రిటైర్డ్ జేడీ లక్ష్మిరెడ్డి, హార్టికల్చర్ ఆఫీసర్ మల్లేశ్వర్‌రెడ్డి, గిరిజన మామిడి రైతులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కల్పించాలి





విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రధానం చేస్తున్న కళాశాల యాజమాన్యం, సమావేశానికి హాజరైన విద్యార్థినీ, విద్యార్థులు

రాజంపేట రూరల్ :ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కల్పించాల్సిన అవసరం విద్యార్థులపై ఉందని అదే సమయంలో ప్లాస్టిక్ తయారీ గురించి తెలుసుకోవాలని సెంట్రల్ ఇX ఇన్సిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్ ఇంజనీరింగ్ టెక్నాలజీ చెన్నైకు చెందిన టెక్నికల్ ఆఫీసర్ లక్ష్మణ్, ట్రైనీ ఇంజనీర్ జయకుమార్‌లు తెలిపారు. స్థానిక అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు ప్లాస్టిక్ అండ్ అప్లికేషX్స ఆఫ్ స్టాఫ్ వేర్స్ అనే అంశంపై అవగాహన సదస్సు శనివారం జరిగింది. ఈకార్యక్రమానికి సెంట్రల్ ఇX ఇన్సిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్ ఇంజనీరింగ్ టెక్నాలజీ చెన్నైకు చెందిన టెక్నికల్ ఆఫీసర్ లక్ష్మణ్, ట్రైనీ ఇంజనీర్ జయకుమార్ హాజరై మాట్లాడుతూ ప్రతి నిత్యం మనం ప్లాస్టిక్ ఎక్కువ వాడే వస్తువుల్లో ఒక్కటని, అది రెండు రకాలుగా ఉన్నదని, మొదటిది థర్మో ప్లాస్టిక్, రెండవది థర్మోసెట్స్‌ను తిరిగి వాడుకలో కుదరదని, కానీ థర్మోప్లాస్టిక్‌ను తిరిగి ఉపయోగించుకోవచ్చన్నారు. ఇతర వస్తువులతో పోల్చుకుంటే ధర తక్కువ, సాంద్రత కలిగి ఉన్న థర్మోప్లాస్టిక్‌ను సక్రమ రీతిలో ఉపయోగించడం వల్ల కాలుష్యాన్ని తగ్గించుకోవచ్చన్నారు. ఇతర మెటీరియల్‌తో పాటు థర్మోప్లాస్టిక్ పెరగడానికి అతి తక్కువ ఉష్ణోగ్రత అనగా 350సెంటీగ్రేడ్‌తో కరుగుతుందన్నారు. మనం ప్రతి నిత్యం ఉపయోగించే బెల్లుట్‌ప్రూఫ్ నుంచి వాటర్‌బాటిల్ వరకు అన్ని ప్లాస్టిక్ మీదనే ఆధారపడి ఉన్నాయని, తగు జాగ్రత్తలు పాటించకపోతే అత్యంత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ నారాయణ, కళాశాల వైస్ చైర్మెX యల్లారెడ్డి, మెకానికల్ హెచ్X వోడీ చలపతి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

చెట్టుతో పొంచి ఉన్న ప్రమాదం



సిద్ధవటం : మండల విద్యాశాఖాధికారి కార్యాలయ ఆవరణగేటు పక్కన ఉన్న ఎండిన వేపచెట్టుతో ప్రమాదం పొంచి ఉంది. ఈ చెట్టు సమీపంలోనే ఎంపీపీ ప్రాథమిక పాఠశాల ఉండడంతో పెనుగాలులు వీచినపుడు చెట్టు విరిగి పాఠశాల మీద పడితే పెద్ద ప్రమాదం జరుగుతుందని ఉపాధ్యాయులతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎ.గంగాధర్ మాట్లాడుతూ పాఠశాల ప్రధాన ముఖ ద్వారం పక్కన వేపచెట్టు చాలా కాలం నుంచి ఎండిపోయి పుచ్చుపటిఉందని అది గాలి వీచినప్పుడు చెట్టు కొమ్మలు విరిగి పడుతున్నాయన్నారు. ప్రమాదం ముంచుకురాక ముందే సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని ఎండిన చెట్టును తొలగించాలని హెచ్X ఎం, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా పాఠశాల కడప-బద్వేలు ప్రధాన రహదారి పక్కన ఉండడంతో బస్సులు, వాహనాలు అతి వేగంగా తిరుగుతుంటాయని అందువల్ల పాఠశాల సమీపంలో విద్యార్థుల రక్షణ కోసం ప్రధాన రహదారిపై స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలని హెచ్X ఎం, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

రామయ్య సన్నిధిలో దివ్యదర్శనం భక్తులు

ఒంటిమిట్ట : ఒంటిమిట్టలోని శ్రీ కోదండ రామస్వామి దేవాలయాన్ని శనివారం విజయవాడకు చెందిన సుమారు 200మంది దివ్యదర్శనం భక్తులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు కోదండరామున్ని దర్శించుకుని అర్చకులు శ్రావణX కుమార్ ద్వారా ఆలయ చరిత్రను తెలుసుకొని శిల్పసంపదను వీక్షించారు.

రేపు ఇసుక వేలం

ఒంటిమిట్ట పోలీస్‌స్టేషX లో ఈ నెల 7వ తేదీన ఉదయం 10గంటలకు 5ట్రాక్టర్ల ద్వారా పట్టుబడిన ఇసుకను వేలం వేయనున్నట్లు ఎస్ఐ ధనుంజేయుడు తెలిపారు. పెన్నానది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 5 ట్రాక్టర్లను గతంలో సీజ్ చేసి కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ కేసులో కోర్టు ఆదేశం మేరకు ట్రాక్టర్లనువిడుదల చేసి పట్టుబడిన ఇసుకను వేలం వేయనున్నామని తెలిపారు.

సినిమాగైడ్
రాజంపేట

సమద్ :నిన్నుకోరి
సుదర్శన్ :నాకు నేనే తోపు తురుము
పీవై : ఫిదా
బీఎస్: డిజె
(దువ్వాడ జగన్నాథమ్)
ఎస్ఎస్ఆర్:గౌతమ్‌నంద

మతిస్థిమితం లేకే జగX వ్యాఖ్యలు

సర్పంచ్X ల సంఘం జిల్లా అధ్యక్షురాలు పత్తిపాటి కుసుమకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న పత్తిపాటి కుసుమకుమారి

రాజంపేట టౌన్ :ప్రతిపక్ష నేత వైఎస్ జగX మోహX రెడ్డి మతిస్థిమితం లేకనే సీఎంపై వ్యాఖ్యలు చేస్తున్నారని రాష్ట్ర పంచాయతీ రాజ్ చాంబర్ కార్యదర్శి, జిల్లా సర్పంచ్X ల సంఘం అధ్యక్షురాలు పత్తిపాటి కుసుమకుమారి అన్నారు. శనివారం రాజంపేట టీడీపీ కార్యాలయంలో తెలుగుదేశం నాయకులతో కలిసి విలేకరులతో ఆమె మాట్లాడుతూ నంద్యాల ఉప ఎన్నికల సభలో జగX సీఎంపై చేసిన వ్యాఖ్యలకు అతని ఫ్యాక్షX బుద్ధి బయటపడిందని, జగX కు మతిస్థిమితం లేకుండా ప్రవర్తిస్తున్నారని ధ్వజమెత్తారు. జగX ను అన్ని జిల్లాల వారు వ్యతిరేకిస్తున్నారని, నంద్యాలలో టీడీపీ విజయం తథ్యమని, కాంగ్రెస్‌కు డిపాజిట్ కూడా గల్లంతు అవుతాయన్నారు. సీఎం చంద్రబాబునాయుడు ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వారి అభివృద్ధికి పాటు పడుతున్నారని, టీడీపీ వైపే నంద్యాల ప్రజలు ఉన్నారని వైసీపీకి ఓట్లు గల్లంతు అవుతాయన్నారు.

ఎమ్మెల్యే రోజా సినిమా డైలాగుల్లా మాట్లాడటం సిగ్గుచేటని, నోరును రోజా అదుపులో పెట్టుకోవాలని కుసుమకు మారి హితవుపలికారు. కులరాజకీయాలు చేస్తున్నది వైసీపీనేనన్నారు. మహిళలను తక్కువ చేసి మాట్లాడుతున్న జగX మహిళా ఓట్లు లేకుండా గెలవగలుగుతాడా.. అని ఆమె ఎద్దేవ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు సంజీవరావు, మండలాధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, మందపల్లె శ్రీనివాసులు, మైనారిటీ నాయకులు ఇషాక్, గంగిరెడ్డి, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు ఆందోళన



నిరసన తెలుపుతున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

రాజంపేట : ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు ఆందోళన తప్పదని ఎంఆర్‌పీఎస్ నాయకులు స్పష్టం చేశారు. రాజంపేటలో ఎంఆర్‌పీఎస్ నేతలు చేస్తున్న దీక్ష శనివారానికి 17వ రోజుకు చేరింది.

ఈసందర్భంగా ఓ నాయకుడు గుండు గీయించుకొని వినూత్నంగా దీక్షలో కూర్చుని నిరసన తెలిపారు. అనంతరం ఎంఆర్‌పీఎస్ నాయకుడు శివ య్యమాదిగ మాట్లాడుతూ 17రోజులుగా దీక్షలు చేస్తున్న సీఎం చంద్రబాబునాయుడికి చీమకుట్టినట్లు కూడా లేకపోవడం బాధాకర మన్నారు. వైఎస్ జగX మోహX రెడ్డి ప్రతి పక్ష నేతగా అసమర్థుడని, మాదిగల పట్ల నిర్లక్ష్యధోరణి జరుగుతున్నా ఒక్క మాట కూడా మాట్లాడక పోవడం శోచనీయమన్నా రు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయ కులు వెంకటేష్‌మాదిగ, పట్టణాధ్యక్షులు తాడిపత్రి తిరు పాలు, యువసేన అధ్యక్షులు పెంచలయ్య, కోశాధికారి సుబ్బరాయుడు, మేకలబాబు, సగినాల రమణయ్య, వెంకటయ్య, మోసయ్య, పెంచలయ్య, శంకరయ్య, నాని, గురునాద్, మహేష్, సురేష్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

నందలూరు : మండల పరిషX కార్యాలయ సభాభవనంలో ఈ నెల 7వ తేదీ ఉదయం 10.30గంటలకు మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మల్లీశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ నీటి సరఫరా, వ్యవసాయం, ప్రాథమిక విద్య తదితర విషయాలపై సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు.

శాటిలైట్ సిటీకి త్వరలో మోక్షం

కడప, సెవెన్‌రోడ్స్

కడప నగర శివారులోని శాటిలైట్ సిటీకి త్వరలో మోక్షం కలగనుంది. అక్కడ అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలను పరిశీలించి, వాటి పూర్తికి అధికారులు సమాయత్తమవుతున్నారు. 2005లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేదలకు తక్కువ వ్యయంతో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని నిర్ణయించి ఆ మేర శాటిలైట్ సిటీ పేరుతో వందల ఎకరాల విస్తీర్ణంలో కడప నగర శివారులో గృహ సముదాయ నిర్మాణం చేపట్టారు. 50 బ్లాకుల్లో దాదాపు 5 వేల ఇళ్లు నిర్మించే ప్రక్రియ ప్రారంభించారు. పెన్నానది నుంచి నేరుగా పైపులైన్ వేసి శాటిలైట్ సిటీకి నీరందిస్తూ వచ్చారు. అయితే ఇల్లు మరీ చిన్నదిగా వుండడంతో ఔత్సాహికులు ముందుకు రాలేదు. దీంతో అధికారులు పలు దఫాలుగా పర్యటించి చర్చించి రెండు ఇళ్లను ఒకటిగా చేసి గతంలో నిర్ణయించిన మేరకే అదే మొత్తం రూ.1.31 లక్షలకే విక్రయించే ప్రక్రియను ప్రారంభించారు. దీంతో పలువురు ఔత్సాహికులు 1500 ఇళ్లు కొనుగోలు చేసినా ఇప్పటికీ 302 కుటుంబాలే నివాసం వుంటున్నాయి.



పూడిపోయిన కాలువలు, ఏపుగా పెరిగిన కంపచెట్ల మధ్య అసంపూర్తి ఇళ్లు

అసంపూర్తిగా 2880 ఇళ్లు

శాటిలైట్ సిటీలో ఇప్పటికీ 2880 ఇళ్లు అసంపూర్తిగా వున్నాయి. ద్వార మందిరాలు, కిటికీలు కూడా అమర్చలేదు. అంతెందుకు.. సిమెంట్ పూతలు కూడా వేయకపోవడం గమనార్హం. ఇప్పటివరకు అధికారులు ఆ ఇళ్లపై దృష్టి సారించకపోవడంతో ముళ్లచెట్లు ఏపుగా పెరిగి అసంపూర్తి భవన సముదాయాన్ని కప్పేశాయి. రెండు ఇళ్లు ఒకటిగా చేస్తే 1440 ఇళ్లు అవుతాయి. వీటి నిర్మాణంపైనే అధికారులు ప్రస్తుతం దృష్టి సారించారు.

ప్రజలలో ఆసక్తి పెంచేందుకు చర్యలు

శాటిలైట్ సిటీలో అసంపూర్తి ఇళ్లను పూర్తి చేసి మౌలిక వసతులు కల్పించి ప్రజలకు ప్రత్యక్షంగా చూపించి వాటిపై ఆసక్తి కలిగేలా చేసేందుకు హౌసింగ్ అధికారులు చర్యలు తీసుకోనున్నారు. ఇప్పటికే తాగునీటి వసతి వుండడంతో ముఖ్యంగా డ్రైనేజీపై దృష్టి సారించి ప్రహారీగోడ నిర్మించాల్సిన అవసరాన్ని అధికారులు గుర్తించారు. రెండు, మూడు రోజుల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేసి చివరగా వీటి వ్యయం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నారు. కాగా ఎన్టీఆర్ రూరల్, అర్బన్ పేర్లతో నిర్మిస్తున్న ఇళ్లు పూర్తయ్యేలోగా ఏమాత్రం ఆర్థిక స్థోమత లేని వారిని గుర్తించి వారికి శాటిలైట్ సిటీలో గృహాల మంజూరుకు అవకాశం కల్పించాలన్న డిమాండ్లు వున్నాయి. ఏది ఏమైనా అధికారులు వేగవంతంగా చర్యలు తీసుకుంటే కడప నగర శివారులోని శాటిలైట్‌సిటీ అన్ని వసతులతో సుందరమైన గృహ సముదాయంగా నిలుస్తుంది.

సహకార శాఖ బ్యాంకు అధికారుల

ప్రమేయంతోనే బోగస్ రుణాలు

ప్రొద్దుటూరు పుట్టపర్తి సర్కిల్: చింతలమడుగుపల్లె సొసైటీ బోగస్ రుణాల అక్రమాలపై 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన వార్తలపై ఆ సొసైటీ మాజీ సీఈవో పి.వీరవెంకటనాగప్రసాద్ స్పందించారు. శనివారం ఆయన ప్రొద్దుటూరు 'ఆంధ్రజ్యోతి' కార్యాలయానికి వచ్చారు. తన హయాంలో చింతలమడుగుపల్లె సొసైటీలో జరిగిన అక్రమాలపై రాతపూర్వక వివరణ ఇచ్చారు. డీసీసీబీ, సహకార శాఖ అధికారుల ఒత్తిడితోనే, ప్రమేయంతోనే బోగస్ రుణాలు విడుదల అయ్యాయన్నారు. బ్యాంకు ఉద్యోగంపై ఆశతోనే తాను సహకరించానన్నారు.

వీఎన్‌పల్లె మండలం లింగాల గ్రామంలో సహకార శాఖ అధికారి తన బంధువుల పేర్లతో 17 ఎకరాల భూములను రెవెన్యూ రికార్డుల్లో ఎక్కించుకున్నాడన్నారు. వీటిపై సొసైటీలో రుణాలకు ప్రయత్నం చేశాడన్నారు. తాను తన భార్య పేరుతో పొందిన రుణాలను సహకార శాఖ డీసీసీ బ్యాంకు అధికారులకే ఇచ్చానన్నారు. బ్యాంకు ఉద్యోగం ఇస్తామని ఆశ చెప్పడంతోనే వారికరి డబ్బులు ఇచ్చానన్నారు అయితే బ్యాంకు అధికారులకు మాత్రం తిరిగి ఉద్యోగాలను ఇచ్చారన్నారు. తనకు మాత్రం ఉద్యోగం ఇవ్వలేదన్నారు. తనను ఆదుకోవాలని కోరారు.

జగన్‌పై రాజద్రోహం కేసు నమోదు చేయండి

కడప, సెవెన్‌రోడ్స్: ముఖ్యమంత్రి చంద్రబాబును నడిరోడ్డుపై కాల్చి చంపినా తప్పు లేదని బహిరంగ సభలో వ్యాఖ్యానించిన రాష్ట్ర ప్రతిపక్ష నేత, వైసీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డిపై రాజద్రోహం, హత్యాయత్నం కింద కేసు నమోదు చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి శనివారం ఎస్పీ బాబూజీని కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఫిర్యాదు పత్రం అందజేశారు. ముఖ్యమంత్రినే చంపాలని పిలుపునిచ్చే ప్రతిపక్ష నేత ఎక్కడా ఉండరని ఇటువంటి వ్యక్తికి సమాజంలో తిరిగే అర్హత ఉండదని అందువల్ల ఆయనపై కేసు నమోదు చేసి జైలుకు పంపాలని కోరారు. అదీకాక ఆయన మానసిక స్థితిపై తీవ్ర అనుమానాలు ఉన్నాయని, అందువల్ల జైలుకు పంపితే అక్కడి నుంచి పిచ్చాసుపత్రికి తరలించి వైద్యం చేయించవచ్చునని తెలిపారు. ఎస్పీని కలిసిన వారిలో టీడీపీ నేతలు కటారి క్రిష్ణ, గంగాధర్, షామీర్‌బాషా, వాసుదేవరెడ్డి, పీ. గంగాధర్ తదితరులు ఉన్నారు.



ఎస్పీకి ఫిర్యాదు పత్రం ఇస్తున్న రెడ్యం, తదితరులు

చిక్కులు తొలగిన చుక్కల భూములు

రైల్వేకోడూరు: గ్రామాల్లో చుక్కల భూములకు సంబంధించి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. చాలా ఏళ్లుగా చుక్కల భూములపై రైతులు, రైతుసంఘాలు ఉద్యమాలు చేశాయి. రిజిస్ట్రేషన్లు చేయడానికి వీలు లేకుండా చేశారు. అయితే.. కొన్ని చుక్కల భూములకు గతంలో రిజిస్ట్రేషన్లు జరిగాయి. ప్రస్తుతం రాష్ట్రప్రభుత్వం చుక్కల భూముల రైతులకు మోక్షం కల్గించింది. ఏయే గ్రామాల్లో చుక్కల భూములు ఉన్నాయన్నది పరిశీలించి రెవెన్యూ రికార్డుల్లో మార్పులు చేసే దిశగా ప్రభుత్వం ముందడుగు వేసింది. సెప్టెంబర్ 15వ తేదీ వరకు చుక్కల భూములుకు ప్రత్యేకంగా కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది. భూ యజమానులకు చెందిన ఆధారాలతో ఫారం-3 పూర్తి చేసి మీసేవలో దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. 12 సంవత్సరాల క్రితం చుక్కల భూములకు రిజిస్ట్రేషన్లు జరిగాయి. అయితే తర్వాత చుక్కల భూములకు రిజిస్ట్రేషన్లు జరగలేదు. చుక్కల భూముల వివరాల్లో సర్వేనెంబర్ మాత్రమే ఉంటుంది. ఇందుకు సంబంధించిన రైతుల పేర్లు ఉండవు. జీవోనెం 298 ప్రకారం ఆర్‌ఎస్‌ఆర్ పుస్తకంలో చుక్కలు లేకుండా చేసి రైతుల పేర్లు నమోదు చేసి రెగ్యులైజేషన్ చేస్తారు. ఇందుకు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రెవెన్యూశాఖ అధికారులు చుక్కల భూముల వివరాల సేకరణలో నిమగ్నమై ఉన్నారు. ఎక్కడా సమస్యలు రాకుండా ముందస్తుగా నివేదికలు తయారు చేస్తున్నారు. రైల్వేకోడూరు మండలంలో సుమారుగా 2000 మంది రైతులకు చెందిన 3000 ఎకరాలకు సంబంధించిన భూములకు చుక్కలు ఉన్నాయని రెవెన్యూ లెక్కలు చెబుతున్నాయి. వీటిని అధికారులు పరిశీలిస్తున్నారు. అయితే ప్రభుత్వం చుక్కల భూములపై తీసుకున్న నిర్ణయాన్ని రైతులు హర్షిస్తున్నారు.

కలెక్టర్ ఛైర్మన్‌గా కమిటీ



చుక్కల భూముల పరిష్కారానికి సంబంధించి జిల్లాస్థాయిలో కలెక్టర్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. కమిటీలో జాయింట్ కలెక్టర్, ఆర్‌డీవో, తహసీల్దార్‌లు సభ్యులుగా ఉంటారు. చుక్కల భూములు పరిశీలిస్తారు. గ్రామసభలు నిర్వహిస్తారు. అభ్యంతరాలు ఉంటే పరిశీలిస్తారు. రైతులకు నోటీసులు ఇస్తారు. అన్నీ పరిశీలించి సమస్యలు ఏమిలేవంటేనే ఆర్‌ఎస్‌ఆర్‌లో చుక్కలు తీసివేసి రైతుల పేర్లు పొందుపరుస్తారు.

- చంద్రాయుడు, తహసీల్దార్, రైల్వేకోడూరు

నివేదికలు పారదర్శకంగా ఉండాలి



చుక్కల భూములపై నివేదికలు పారదర్శకంగా ఉండాలి. ఎన్నో ఏళ్లుగా చుక్కల భూముల సమస్యలను పరిష్కారం చేయాలని ఉద్యమాలు చేశాం. రైతులు, రైతు సంఘాల ఆధ్వర్యంలో చుక్కల భూములను రెగ్యులైజేషన్ చేయాలని ప్రభుత్వాలను కోరాం. ఎవరైతే రైతులు భూములు అనుభవిస్తున్నారో వారికే భూములు ఇవ్వాలి. చుక్కల భూములు కలిగిన రైతులు మీసేవలో దరఖాస్తులు చేసుకోవాలి. చుక్కల భూముల సమస్యను పరిష్కారం చేసేందుకు వీలు కల్పించినందుకు ప్రభుత్వానికి అభినందనలు తెలుపుతున్నాము.

-మలిశెట్టి రాహుల్, రైతుసంఘం నాయకుడు, రైల్వేకోడూరు నియోజకవర్గం

సహకార గృహ నిర్మాణ

సంఘ సభ్యులకు రాయితీలు లేవు

కడప, కోటిరెడ్డిసర్కిల్: జిల్లాలోని సహకార గృహ నిర్మాణ సంఘ సభ్యులకు రుణాల మంజూరులో ఎలాంటి రాయితీలు, సబ్సిడీలు గాని లేవని ఏపీ హౌస్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) డాక్టర్ అక్బర్‌బాష తెలిపారు. శనివారం కడపకు విచ్చేసిన ఆయన డీసీవో కార్యాలయంలో సహకార గృహ నిర్మాణ సంఘ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రుణాలకు ఎలాంటి రాయితీలు ఉండవనే విషయాన్ని గుర్తించి కంతులు సక్రమంగా చెల్లించాలన్నారు. సభ్యుల నుంచి వసూళ్లు చేసిన బకాయిల మొత్తం ఎల్‌ఐసీ, అలహాబాద్ బ్యాంకులో చెల్లించాలన్నారు. బకాయిదారులు మొత్తాన్ని చెల్లించి తనకా పత్రాలను పొందాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు రూ.3.50 కోట్ల మేరకు రికవరీ చేశామన్నారు. మొండి బకాయిదారుల ఆస్తులను జప్తు చేస్తామన్నారు. ఈ సమావేశంలో డీసీవో పోమేనాయక్, హౌస్‌ఫెడ్ ఆర్‌ఎం గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

మినీ లోకం



వైవీయూలో మౌలిక సదుపాయాలకు కార్యాచరణ

● వీసీ ప్రొఫెసర్ అత్తిపల్లి రామచంద్రారెడ్డి

కడప, వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలోని విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ ఏర్పాటు చేసామని వైవీయూ వీసీ ప్రొఫెసర్ అత్తిపల్లి రామచంద్రారెడ్డి తెలిపారు. శనివారం వీసీ తన ఛాంబర్‌లో శాఖాధిపతులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్రీయ ఉచ్ఛతర్ శిక్షా అభియాన్ (రూసా) నిధులు ఖర్చు చేయడంలో అన్ని యూనివర్సిటీల కంటే ముందంజలో ఉన్నాయన్నారు. ఇప్పటికే 70 శాతం నిధులకు సంబంధించిన కొనుగోలు ఉత్తర్వులను పర్చిజింగ్ ఆడర్స్‌ను జారీ చేయడం జరిగిందని విసి తెలిపారు. రూ. 20 లక్షల గ్రాస్ క్రోమోట్‌గ్రాఫ్ 17 లక్షలతో డిఫరెన్సీట్సీయల్ గోబ్లల్ పొజిషియన్ ఇస్టెమ్, రూ. 7 లక్షలతో డిస్టోమేటర్ రూ. 5 లక్షలతో, యు.వి. స్పెక్టో పోటోమేటర్ వంటి ఆధునిక పరికరాలను కోనుగోలు చేస్తున్నామన్నారు. వైవీయూ అనుసరిస్తున్న పద్ధతిని మిగిలిన వర్సిటీలో అనుసరిస్తున్నామన్నారు. రూసా నిధులు అత్యంత సమర్థవంతంగా ఖర్చు చేసినందుకు రూసా రెండవ దశలో రూ.15 కోట్లు నిధులు త్వరలో రూసా అధికారులు విడుదల చేయనున్నట్లు విసి చెప్పారు. రెండవ దశ రూసా నిధులతో వైవీయూలో అసంపూర్ణంగా ఉన్న పరిపాలనా భవనం, విద్యార్థులకు తరగతి గదులను, ఇంజనీరింగ్ కళాశాల భవనాల నిర్మాణాలకు ఖర్చు చేయనున్నారు. వర్సిటీలోని ప్రయోగశాల పరిస్థితులను మరింత మెరుగుపరచడానికి సైన్స్ విభాగాలకు సెమిస్టర్‌గా లక్ష యాభై వేలు, ఆర్ట్స్ విభాగాలకు రూ. 50 వేల రూపాయలను కేటాయిస్తున్నట్లు వీసీ తెలిపారు. వైవీయూలోని అన్ని శాఖలలో మరింత సౌకర్యంగా కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. నూతన ఆర్ట్స్, కామర్స్, భవన సదుపాయం నెల రోజులలో నిర్మాణాలు పూర్తి అయ్యే అవకాశం వుందన్నారు. వర్సిటీ విద్యార్థులకు టూర్‌లో నిధులు కేటాయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ చంద్రయ్య, ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి, పీఆర్‌వో శ్యామ్‌స్వరూప్ అన్ని విభాగాల అధిపతులు పాల్గొన్నారు.



అధ్యాపకులతో సమావేశం అయిన వీసీ

గండిక్షేత్రంలో భక్తులకు వసతులు కరువు

ఆంధ్రజ్యోతి, కడప సిటీ : గండి ఆంజనేయస్వామి క్షేత్రంలో వసతులు కరువయ్యాయి. శ్రావణమాసంలో నాలుగు శనివారాలు భక్తులతో గండిక్షేత్రం కిటకిటలాడుతుంది. అయితే ఈసారి భక్తులకు సరైన వసతులు కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని చెప్పుకోవచ్చు. శనివారం రోజున 40 నుంచి 50వేల మంది వరకు భక్తులు ఆంజనేయస్వామిని దర్శించుకుంటారు. అంతపెద్ద ఎత్తున భక్తులు వస్తుంటే అందుకు తగ్గట్లు వసతులు లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. మహిళా భక్తులకు ప్రత్యేక స్నానపు ఘట్టాలను ఏర్పాటు చేయలేదు. దీంతో మహిళలు దుస్తులు మార్చుకోవాలంటే తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పాపాగ్నిలో ఫిల్టర్‌బోరు వేసి ప్రత్యేకంగా స్నానపు ఘట్టాలు ఏర్పాటు చేసినట్లయితే ఇబ్బందులు తప్పేవి. ఉచిత దర్శనమని చెబుతున్నప్పటికీ డబ్బులు వసూలు చేస్తుండడం పట్ల భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం తాగునీటి వసతి కూడా ఏర్పాటు చేయలేదు. అలాగే భక్తులు పరమపవిత్రంగా భావించే లడ్డు తయారీలో చుట్టుపక్కల వున్నమహిళలను పిలిపించి లడ్డులు తయారు చేస్తున్నారు. చేతికి గ్లౌజులు వేసుకోకుండానే మహిళలు లడ్డు లు చేయడం పట్ల పలువురు భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఆరుబయటే మహిళల స్నానాలు

చెరువులలో చేపలపెంపకం చేయాలి : కలెక్టర్

కడప, వినాయకనగర్ : చెరువులలో చేపల పెంపకం చేపట్టాలని కలెక్టర్ బాబూరావునాయుడు మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ ఛాంబరులో మత్స్యశాఖ ద్వారా అమలు చేస్తున్న మిషన్ ఫింగర్‌లింక్స్, చేపపిల్లలు వదులు కార్యక్రమం పై ఆయన సమీక్షసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ వర్షాకాలంలో నీరు వచ్చిన చెరువులలో చేపపిల్లలు వదిలి చేపలపెంపకాన్ని పెంచాలన్నారు. ఉపాధి హామీపథకం ద్వారా చిన్న చెరువులలో చిరుచేపలను వదిలి పెంచాలన్నారు. గ్రామ పంచాయతీ చెరువులు, పారం ఫాండు, ఎన్టీఆర్ జలసిరి పాండు నందులలో కూడా చేపపిల్లలను వదిలి త ద్వారా చేపల ఉత్పత్తిని పెంచాలని అధికారులకు సూచించారు. నీరు వచ్చిన లైసెన్స రిజర్వాయర్ నందు మత్స్యశాఖ చేప పిల్లల ఖరీదు నిర్వహణ ఖర్చులు భరించి చేప పిల్లల పెంపకం చేపడతారన్నారు. లీజుకు ఇచ్చే మైనర్ ఇరిగేషన్ చెరువులలో ఎస్‌హెచ్ జీలకు లీజుకు ఇచ్చి చేపల పెంపకం చేపట్టాలన్నారు. స్వయం సహాయక సంఘాలను గుర్తించి జీపీ ట్యాంకులను లీజు ఇప్పించాల్సిందిగా డీఆర్‌డీ ఏ పీడీ, మత్స్యశాఖ సంచాలకులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ, డీడబ్ల్యుఎంఏ, ఉప మ త్స్య సంచాలకులు, నీటిపారుదల శాఖ సూపరింటెండెంట్ ఇంజనీరు, అటవీఅధికారులు పాల్గొన్నారు.

పాఠకులకు సూచన:

క్లాసిఫైడ్ ప్రకటనలకు స్పందించే ముందు పూర్తిగా విచారించి తగిన నిర్ణయం తీసుకోగలరు. ప్రకటనదారు ప్రకటిస్తున్న లేదా చేసుకుంటున్న క్లయిమ్‌లతో మా పత్రికకు ఎటువంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

- మేనేజర్



పాములతో జరభద్రం

- రైతన్నలకు జాగ్రత్తలు తప్పనిసరి
- నాటు వైద్యం వీడాలి
- ఆందోళనకు గురికావద్దంటున్న వైద్యులు

కడప, ఐటీఐ సర్కిల్

ఖరీఫ్ సీజన్ అంటేనే పాముల భయం. వానాకాలంలో పాముల సంచారం విపరీతంగా ఉంటుంది. పంట భూములతో పాటు జన సంచార ప్రాంతాలలోనూ పాములు, తేళ్లు వస్తుంటాయి. అయితే రైతన్నలతో పాటు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. ఒకవేళ పాముకాటుకు గురైనా ఆందోళన అక్కర లేదని వారు సూచిస్తున్నారు. వర్షాకాలం ప్రారంభమైంది. జిల్లాలో ముందస్తు వర్షాలు ప్రారంభం కావడంతో పాటు చెదురుమొదురు వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. ఖరీఫ్ సీజన్ కు కొన్ని ప్రాంతాల్లో రైతన్నలు పంటలు సాగు చేసేందుకు సిద్ధమవుతున్నాయి. అయితే వానాకాలం ప్రారంభంలో విషసర్పాల బెడద రైతులను, ప్రజలను బెంబేలెత్తిస్తోంది. పొలం పనులలో తలమునకలైన రైతులు పాముకాటుకు ప్రాణాలు కోల్పోతున్నారు. జిల్లాలో ఇలాంటి సంఘటనలు ఏదో ఒక ప్రాంతంలో జరుగుతూనే ఉంటాయి. ప్రతి ఏడాది వర్షకాలం ప్రారంభంలో ఇదే జరుగుతుంది. పాములు కాటేస్తే ఏం చేయాలి, అక్కడికక్కడే తీసుకోవాల్సిన రక్షణ చర్యల గురించి అవగాహన అవసరం. వానా కాలంలో వర్షాలకు భూమి నాని లోపలి నుంచి పాములు బయటికొస్తాయి. ఇవి ముఖ్యంగా జూన్ నుంచి సెప్టెంబరు వరకు ఎక్కువగా తిరుగుతుంటాయి. ఈ క్రమంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి. చెప్పులు ధరించి పొలాలకు వెళ్లాలి. అవసరమైతే ఒకరి పొలాలకు వెళ్లే సమయంలో తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు వైద్యులు.

జాగ్రత్తలు అవసరం

ధాన్యపు నిల్వలు, గడ్డివాములు తడిసి ఉండే చోట కప్పలు, ఎలకలు, తేళ్లు తిరుగుతుంటాయి. వాటి కోసం పాములు వస్తాయి. చేల గట్లపై నడిచే సమయంలో పాములు ఉంటాయి. రహదారుల పక్కన పిచ్చిమొక్కల మధ్య గుబురు ప్రాంతాలలో ఉంటాయి. శబ్ధం చేసుకుంటూ వెళ్లాలి.

ఇవి పాటించాలి

గడ్డివాములు, ధాన్యపు నిల్వలు వున్న చోట ఎక్కువగా పాములు వుంటాయి. ఎలుకలు వుంటాయి. తడిగా వున్న చోట కప్పలు చేరతాయి. వాటిని తినడానికి పాములు వస్తుంటాయి. అలాంటప్పుడు ఆ ప్రదేశంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. ఆ చోట తేళ్లు కూడా వుండే అవకాశం వుంది. చేల గట్లపై వెళ్లేటప్పుడు తప్పక టార్చిలైటు ఉపయోగించాలి. పొలాల్లో కాకుండా నివాస ప్రాంతాల చుట్టూ పాములు, తేళ్లు సంచరిస్తుంటాయి. ఇంటి ఆవరణలో ఎక్కువగా చెత్తాచెదారం లేకుండా చూసుకోవాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని వెలుతురు ఉండేలా చూసుకోవాలి. చీకట్లో బయటకు వెళ్లేటప్పుడు చెప్పులు ధరించడం ఉత్తమం.

విషసర్పం కాటు లక్షణాలు



సాధారణ విషసర్పాలు కాటు వేసిన ప్రదేశంలో కోరల గాయం స్పష్టంగా కనిపిస్తుంది. నొప్పి క్రమంగా పైకి వ్యాపిస్తూ తిమ్మిరిగా ఉంటుంది. పాక్షిక పక్షపాతం కారణంగా నాలుక మండినట్లు గొంతు కండరాలు బిగించుకున్నట్లు గొంతులో ఏదీ దిగని పరిస్థితి తలెత్త వచ్చు. కళ్లు మూతగా శరీరం మత్తుగా వుండి స్పృహ కోల్పోవచ్చు.

లక్షణాలు : పాము కాటు వేసినప్పుడు రెండు గాట్లు పడితే విషపూరితమైన పాముగా గ్రహించాలి. రక్త పింజరి కాటు వేస్తే విషం శరీరంలోని రక్తంలోకి చేరుతుంది. నోరు, ముక్కు ద్వారా రక్తం బయటకు వస్తుంది. రెండు కంటే ఎక్కువ కాట్లు కనిపిస్తే పెద్ద ప్రమాదమే అని లేకున్నా ఆసుపత్రికి తీసుకెళ్లాలి.

పాములు..విషప్రభావాలు

కట్ల పాము : ఇది కాటు వేస్తే పదిహేను నిముషాల్లోనే శరీరంలోకి విషం ఎక్కుతుంది.

జెర్రిపోతు, నీరు కట్లు పాము : ఇది కాటేస్తే విష ప్రభావం వుండదు. అయితే చికిత్స మాత్రం తప్పనిసరి చేయించాలి.

రక్తపింజరి : దీని కాటు చాలా ప్రమాదకరం. కాటేసిన వెంటనే రక్తంలోకి విషం కలుస్తుంది. కావున బాధితుడిని వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించాలి.

ఆందోళన వద్దు


పాముకాటుకు గురైన వారు ఆందోళనకు గురి కావద్దు. ఆందోళన పడితే గుండెపోటుకు గురయ్యే అవకాశం వుంది. ప్రాథమిక చర్యగా కాటు వేసిన చోట విషం పైకి వెళ్లకుండా కట్టు కట్టాలి. వెంటనే చికిత్స కోసం ఆసుపత్రికి తీసుకెళ్లాలి. ఒకవేళ ఆసుపత్రి దూరంగా వుంటే కట్టిన కట్టును 5 నుంచి 10 నిమిషాలకొకసారి విప్పి మళ్లీ కట్టాలి. ఏ పాము కాటువేసిందో బాధితుడు స్పష్టంగా చెప్పగలిగితే వైద్యుడు అందుకు తగిన చికిత్స అందించి బాధితుడిని కాపాడేందుకు అవకాశం వుంటుంది.

నాటువైద్యం వీడాలి



వైద్య రంగంలో రోజురోజుకు మార్పులు సంతరించుకుంటున్నాయి. అయినా పల్లెల నుంచి పట్టణాల వరకు చాలా మంది పాము కరిచిన వెంటే నాటువైద్యాన్ని ఆశ్రయించి ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు. పాము కరిచిన వెంటనే డాక్టర్ వద్దకు తీసుకెళితే ప్రమాదం నుంచి గట్టెక్కవచ్చు. పాము కాటు వేసినప్పుడు మాత్రం నాటువైద్యం కంటే ఆసుపత్రులకు తీసుకెళ్లి చికిత్స చేయడమే ఉత్తమం. నాటువైద్యుడితో ప్రాణాలు పోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

పాము కరవగానే ఏమి చేయాలి



పాముల్లో చాలా వాటికి విషం వుండదు. తాచు, కట్ల, రక్త పింజరి వంటి వాటితో పాటు మరో 15 శాతం సర్పజాతులు ప్రమాదకరమైనవి. పాము కరిచిన సమయంలో ధైర్యంగా వుండాలి. బాధితులకు పక్కవారు ఎక్కువ ధైర్యం చెప్పాలి. ప్రాథమిక చర్యగా కాటు వేసిన చోట విషం పైకి వెళ్లకుండా కట్టు కట్టాలి. వీలైనంత త్వరగా ఆసుపత్రికి తీసుకెళ్లాలి. బాధితుడిని నడిపించకూడదు. 108 అంబులెన్స్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి. కాటువేసిన చోట కత్తి, బ్లేడ్లతో గాటు పెట్టకూడదు. ఆ ప్రదేశంలో నోటితో విషం పీల్చకూడదు.

ఒంటిమిట్ట కోదండపాణి కోవెలలో శ్రావణ సందడి

ఒంటిమిట్ట : ఏకశిలా నగిరి ఒంటిమిట్టలోని కోదండపాణి కోవెలలో రెండవ శ్రావణ శనివారం పురస్కరించుకొని భక్తుల సందడి నెలకొంది. ప్రధాన అర్చకులు వీణా రాఘవాచార్యులు, అర్చకులు శ్రావన్ కుమార్ అధ్వర్యంలో ఏకశిలపై వెలసిన శ్రీసీతారామలక్ష్మణ సమేత మూలవరులకు పాలు, పెరుగు, పసుపు, గంధం, తేనె, కొబ్బరినీళ్ళు, సుగంధ పరిమళ ద్రవ్యాలు కలిపిన జలంతో శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పట్టుపీతాంబరాలు, తులసీ గజమాలలు, ఆభరణాలతో ప్రత్యేక అలంకరణలు చేసి నైవేద్యం సమర్పించారు. విష్ణు సహస్ర నామార్చనలు, ఆదిత్యహృదయం, హనుమాన్ చాలీసా పారాయణంతో విశేషపూజలు నిర్వహించారు. అనంతరం సుమారు 15 00మంది వరకు భక్తులు, యాత్రికులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక ప్రసాదాలను స్వీకరించారు. అంతకుముందు ఆలయ పర్యవేక్షకుడు లక్ష్మీనాగరాజు సంప్రదాయబద్ధంగా పట్టుపీతాంబరాలు, పూజాసామాగ్రిని స్వామి వారికి సమర్పించారు.




ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న కోదండరాముడు, కోదండపాణి కోవెలలో భక్తులు

రామయ్య సన్నిధిలో బీజేపీ రాష్ట్ర మహిళాధ్యక్షురాలు

ఒంటిమిట్టలోని కోదండరామస్వామి దేవాలయాన్ని శనివారం బీజేపీ రాష్ట్ర మహిళాధ్యక్షురాలు మాలతీరాణి, మాజీ మంత్రి ఎరినేని సీతాదేవి సందర్శించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు స్వాగతం పలికి ఆలయ మర్యాదలు చేశారు. అనంతరం వారు ఏకశిలారామున్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు వీణారాఘవాచార్యుల ద్వారా ఆలయ విశిష్టతను తెలుసుకొని శిల్పసంపదను వీక్షించారు. వీరి వెంట జిల్లా బీజేపీ అధ్యక్షుడు శ్రీనాథరెడ్డి, బీజేపీ జిల్లా మహిళాధ్యక్షురాలు భానురెడ్డి, రాష్ట్ర బీజేపీ మహిళా ప్రధాన కార్యదర్శి సరస్వతి, జిల్లా బీజేపీ నాయకులు శ్రీనివాసులరెడ్డి, మండల బీజేపీ అధ్యక్షుడు పాటూరు గంగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి బాలరాజు శివరాజు, బీజేపీ నాయకులు హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఒంటిమిట్ట కోదండరాముని సన్నిధిలో బీజేపీ నేతలు

వర్షాకాలం.. మీ బైకు భద్రం!



కొద్ది పాటి జాగ్రత్త చర్యలు పాటిస్తే మేలు

చినుకుపడితే చిత్తడయ్యే రోడ్లు.. అడుగడుగునా బురద, గోతులు.. వర్షాకాలం వచ్చిందంటే చాలు ద్విచక్రవాహనాల రూపురేఖలు పూర్తిగా మారిపోతాయి. నిండా బురదతో అధ్వానంగా తయారవుతాయి. చాలా మంది ఆ బురదను తేలిగ్గా తీసుకుంటారు. కానీ ఇది సరికాదంటున్నారు మన మెకానిక్‌లు. కొన్ని జాగ్రత్తలు పాటిస్తే ఎక్కువ కాలం మన్నుతాయని చెబుతున్నారు.

కడప

● చిన్న చిన్న విడిభాగాల్లో సమస్యలు...

- వర్షం కారణంగా వీల్స్ బేరింగ్‌లో నీరు చేరే ప్రమాదం ఉంది. నీళ్లు ఆరిపోయాక బేరింగ్‌లో ఆయిల్ పోయడం మంచిది. రోడ్లపై ఏర్పడే గుంతల్లో వాహనాలు వేగంగా వెళితే ఈ బేరింగ్స్‌లోని బాల్స్ దెబ్బతింటాయి.
- చైన్ ప్యాకెట్ కవర్ ఉన్నా లోనికి నీరు చేరే ప్రమాదముంది. దీంతో గడగడ శబ్దం వస్తుంది. వెంటనే గ్రీస్ రాయాలి. ఆయిల్ పోయాలి. దీనిని ఉపేక్షిస్తే చైన్ వదులుగా మారి, ఆపై చెడిపోతుంది.
- షాక్‌అబ్జల్ దెబ్బతింటే షాకింగ్, అబ్జార్బింగ్‌లలో ఇబ్బందులు తప్పవు.

● వర్షంలో బయటకు వెళ్లి వచ్చాక...

- వర్షంలో బయటకు వెళ్లివచ్చాక ఒక్కసారి శుభ్రంగా తుడవాలి.
- వాహనం టైర్లలో గాలిని తరుచూ చెక్ చేయించుకోవాలి.
- గుంతల్లోంచి జాగ్రత్తగా వెళ్లాలి. లేదంటే పడిపోయే ప్రమాదముంది.
- ఇంజిన్ లోకి నీరు చేరకుండా చూసుకోవాలి.
- సైలెన్సర్‌పై పడే బురద మరకలను వెంటనే తుడి చేయాలి.
- వర్షం నీరు కారణంగా బ్రేకులు, కిక్‌రాడ్లు, క్లచ్, గేర్లు జామ్ అయ్యే ప్రమాదముంది. సర్వీసింగ్‌కు ఇచ్చి, ఆయిల్, గ్రీస్ వేయించాలి.
- వాహనం బయట పార్క్ చేయాల్సి వస్తే వర్షం నేరుగా ఇంజిన్ పై పడకుండా, మధ్య స్టాండ్ వేయాలి.

● ఇంజిన్ జర భద్రం...

ఏ వాహనానికైనా ఇంజిన్ గుండెకాయలాంటిది. ఇది దెబ్బతింటే వేలకువేలు పెట్టాల్సిందే! వర్షాలతో రోడ్లపై పెద్దమొత్తంలో నీరు నిల్వడం సహజం. అందులోంచి దూసుకుపోయినప్పుడు సైలెన్సర్‌లోకి నీరు చేరుతుంది. వెంటనే ప్రభావం చూపకున్నా రెండు రోజుల తర్వాత గరగర శబ్దం మొదలై, ఆ ప్రభావం ఇంజిన్ పై పడుతుంది. నీటిలో తడిచి ఆయిల్‌సీల్స్ సహా పలు విడిభాగాలు దెబ్బతింటాయి. అందువల్ల సైలెన్సర్ మునిగే నీళ్లలోంచి వెళ్లకపోవడమే మంచిది.



● సైలెన్సర్‌ను తుడిచేద్దాం..

వర్షాలకు త్వరగా దెబ్బతినే విడిభాగం సైలెన్సర్. నికెల్ కోటింగ్‌తో ఉండే సైలెన్సర్‌కు మట్టి, బురద అంటినప్పుడు శుభ్రం చేయకుంటే ఆ కోటింగ్ దెబ్బతింటుంది. అందువల్ల సైలెన్సర్‌కు అంటిన బురదను ఎప్పటికప్పుడు తుడిచివేయాలి. లేకపోతే రంధ్రాలు పడి, గరగర శబ్దం వస్తుంది. ఆ తర్వాత కొత్తది కొనక తప్పదు. ప్రస్తుతం మార్కెట్లో కొత్త సైలెన్సర్ ధరలు రూ. 1600 నుంచి రూ.1800 వరకు ఉన్నాయి. 150సీసీ బైక్‌లకైతే రూ.2 వేలపైగానే ఉంటున్నది. అందువల్ల సైలెన్సర్‌ను ఎప్పటికప్పుడు తుడుచుకోవడం ఉత్తమం.



● మడ్‌గార్డ్, రీములు

బురదతో దెబ్బతినే విడిభాగాల్లో రీములు, మడ్‌గార్డ్‌లు ముఖ్యమైనవి. బురద అంటినప్పుడు ఎక్కువ కాలం వాటర్ సర్వీసింగ్ చేయించకుండా ఉంటే ఫైబర్ మడ్‌గార్డు, నికెల్ కోటింగ్ ఉన్న ఉక్కు రీములైనా, స్టీల్ రీములైనా దెబ్బతింటాయి. అందువల్ల వర్షంలో తడిసినా, బురద పట్టినా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి. లేదా సర్వీసింగ్ చేయించాలి.



● పెట్రోల్ ట్యాంక్ జాగ్రత్త..

పెట్రోల్‌ట్యాంక్‌కు ఎంత పకడ్బందీ మూత ఉన్నా వర్షం జోరందుకుంటే నీరు లోనికిపోతుంది. అది పెట్రోల్‌తో సహా కార్బొరేటర్‌లోకి చేరుతుంది. వెంటనే వాహనం మొరాయిస్తుంది. అంతటితో అగితే ఫర్వాలేదు. కార్బొరేటర్ నుంచి వెళ్లే వాల్వ్ ద్వారా ఇంజిన్ కు నీరు చేరితే మరమ్మతులు తప్పవు. అందువల్ల భారీ వర్షం కురిసినప్పుడు వర్షంలో ఉంచకపోవడమే మంచిది.



టిష్యూ కల్చర్‌తో ప్రయోజనాలెన్నో...

అరటికి డ్రిప్ పద్ధతిలో నీరు : ఎరువుల యాజమాన్యం



పోరుమామిళ్ల : టిష్యూ కల్చర్ అరటి మొక్కల వల్ల రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఉంటాయి. ఈ పద్ధతిలో ఉత్పత్తి చేసిన పిల్ల మొక్కలు పూర్తిగా తల్లి మొక్కల లక్షణాలు కలిగి ఉంటాయి. సంవత్సరంలో ఏ కాలంలోనైనా పిల్ల మొక్కలను ఉత్పత్తి చేయడానికి వీలు ఉంటుంది. తక్కువ సమయంలో ఎక్కువ సంఖ్యలో పిల్ల మొక్కలను ఉత్పత్తి చేయవచ్చు. ఈ మొక్కల పెరుగుదల దిగుబడిలో సమంగా ఉంటాయి. పంటకోత నెలరోజుల్లో మూడు కోతలతో ముగుస్తుంది. దుంపలతో పోల్చితే పంట కాలం తక్కువగా ఉంటుంది. దీనివలన నెల రోజుల ముందే దిగుబడి లభిస్తుంది. పిల్ల మొక్కల ఉత్పత్తి సమయంలో తెగుళ్లు, చీడపీడలు ఉండవు. పిల్ల మొక్కలకు వైరస్ తెగుళ్లు, నులి పురుగులు ఆశించే అవకాశం ఉండదు. నాటిన అన్ని మొక్కల నుంచి 95 శాతం పైగా ఫలితం, సగటు దిగుబడి, ఉత్పాదకత అధికంగా ఉంటుంది.

డ్రిప్ పద్ధతిలో నీరు

డ్రిప్ పద్ధతిలో నీటిని పెట్టడం వలన నీటి వినియోగం 40 నుంచి 50 శాతం తగ్గుతుంది. ఎరువుల సామర్థ్యం పెరుగుతుంది. ఎరువులను కూడా డ్రిప్ పద్ధతి ద్వారా పైరుకు అందించడం వలన పైరు ఎరువుల వినియోగ సామర్థ్యం మరింత పెరుగుతుంది. కనుక బలమైన నేలల్లో మామూలుగా వాడే ఎరువుల్లో 65 శాతం ఎరువులతోనూ, తక్కువ భూసారం కలిగిన నేలలో 75 శాతం ఎరువులతోనూ మేలైన ఫలితాలు సాధించి అధిక లాభాలు పొందవచ్చు. ఈ నీటి ఎరువుల వినియోగ సామర్థ్యం పెరుగుట వలన అరటి ఏపుగా ఎదిగి మామూలు కన్నా 25, 35 రోజులు ముందుగానే గెల వేస్తుంది. అందువలన తోటలో పెంచే వ్యవధి తగ్గడమే కాక ఖర్చు కూడా తగ్గుతుంది. గెలల నాణ్యత కూడా పెరుగుతుంది. సంప్రదాయ, పొలప పద్ధతికంటే డ్రిప్ ఇరిగేషన్ అవలంభించినందున 27 శాతం అధిక దిగుబడులు వచ్చినట్లు మైక్రో ఇరిగేషన్ వారి క్షేత్రఅధ్యయనాలు నిరూపిస్తున్నాయి. ఎకరాకు 1450 చెట్లు నాటవచ్చు, నాటినప్పుడు వారానికి యూరియా, పొటాష్‌ను తగినంత మోతాదులో ఇవ్వాలి.



పోరుమామిళ్లలో అరటి తోటలను పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖాధికారులు

పిలకలు తీసివేయడం

పిలకలను ఎప్పటికప్పుడు తీసివేయడం వలన తల్లిమొక్కలు ఆరోగ్యంగా పెరిగి అధిక ఫలసాయం అందిస్తుంది. పిలకలను వెడల్పాటి పదునైన గుణపంతో కొద్ది పాటి దుంపతో సహా తీసివేసినా తిరిగి ఎదగదు.

గెలల కోత

75 శాతం పక్వానికి వచ్చిన గెలలు మాత్రమే కోయాలి. గెలను ఒక మనిషి చేతులతో పట్టుకుంటే మరో మనిషి గెలను కోయాలి, గెలను స్రవించే సొనకాయల మీదికి చిమ్మకుండా గెల కాడలను భూమిపై ఉంచి సొనపూర్తిగా కారిపోయేంత వరకు ఆగాలి. నరికి గెలను ఎండలోనూ, మట్టిలోనూ ఉంచరాదు. గెల మీద మంోగెల పేర్చరాదు.

బ్యాక్టీరియా, దుంపకుళ్ల తెగుళ్లు నివారణ

మొక్కలు చిన్నవిగా ఉన్నప్పుడు ఉష్ణోగ్రత ఎక్కువగా ఉంటే తెగుళ్ల ఉత్పత్తి ఎక్కువగా ఉంటుంది. కాండం మొదలు భూమిలో దగ్గరగా కుళ్లుమచ్చలు ఏర్పడి క్రమేపి దుంప కుళ్లిపోతుంది. కొత్తగా నాటిన చిన్న మొలకల్లో ఆకు కూడా కుళ్లి చనిపోతుంది. కింది ఆకులు పసుపు రంగులోకి మారి ఎండిపోతాయి. ఫిబ్రవరి, మే నెలల మధ్యలో నాటే వారు వేసవిలో తోటలకు సరిపడా నీరుపెట్టాలి. ఒక్కలీటరు నీటిలో 25 గ్రాముల బ్లీచింగ్ పౌడర్ కలిపి మొదళ్ల దగ్గర తడపాలి. వారం రోజుల తరువాత కాఫర్ ఆక్సికోరైడ్ లీటరు నీటికి కలిపి మొదళ్ల దగ్గర ఉంచడం వలన తెగుళ్లను నివారించవచ్చు.

యాజమాన్యం

తోటలో ఎక్కువ నీరు నిల్వ ఉండకుండా చేయాలి. సిఫారసు చేసిన మోతాదులో నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులను, సూక్ష్మపోషకాలను వాడాలి. తెగుళ్లు ఎక్కువగా సోకిన ఎండిన ఆకులను 75 శాతం మచ్చలతో దెబ్బ తిన్న ఆకులను కోసి కాల్చివేయాలి. ఉద్యానవనశాఖాధికారుల సలహాలు సరైన సమయంలో తీసుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చు.

2024 ఒలింపిక్స్‌కు పారిస్ ఆతిథ్యం

కరెంట్ అఫైర్స్



రామచంద్రారెడ్డి ఉప్పుల

అంతర్జాతీయం

పాక్ ఆపద్ధర్మ ప్రధానిగా అబ్బాసీ

పాకిస్థాన్ ఆపద్ధర్మ ప్రధానిగా పెట్రోలియం, సహజ వనరుల శాఖ మాజీ మంత్రి షహీద్ ఖాకన్ అబ్బాసీ జూలై 29న నియమితులయ్యారు. ప్రధానమంత్రి నవాజ్ షరీఫ్ మోసం, అవినీతికి పాల్పడ్డారని ఆ దేశ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఫలితంగా అతడిపై అనర్హత వేటు పడింది. పనామా పత్రాల కుంభకోణం వ్యవహారంలో షరీఫ్‌తోపాటు కుటుంబ సభ్యులపై దాఖలైన వ్యాజ్యానికి సంబంధించి అయిదుగురు సభ్యుల ధర్మాసనం ఈ తీర్పు వెలువ రించింది. తదుపరి ప్రధానిగా షరీఫ్ తమ్ముడు, పంజాబ్ రాష్ట్ర ముఖ్యమంత్రి షెహనాజ్ షరీఫ్ బాధ్యతలు చేపట్టనున్నారు. 45 రోజుల పాటు అబ్బాసీ తాత్కాలిక ప్రధానిగా పనిచేస్తారు.

టిబెట్‌లో ఎక్స్‌ప్రెస్ మార్గం ప్రారంభం

ప్రపంచంలోనే ఎత్తయిన పీఠభూమి టిబెట్‌లో చైనా ఎక్స్‌ప్రెస్ రహదారిని ప్రారంభించింది. కింఘై ప్రావిన్స్‌లోని గాంగ్వె కౌంటీని పుషు నగరంతో కలుపుతూ దీన్ని నిర్మించారు. 634.8 కి.మీ. పొడవైన ఈ మార్గం నిర్మాణానికి 25.6 వేల కోట్లను చైనా ఖర్చు చేసింది. సగటున 4 వేల మీటర్ల ఎత్తులో ఈ రహదారి ఉంటుంది. రహదారిలో 36 శాతం మంచునేల పెర్మాఫ్రాస్ట్‌పై నిర్మించారు. ఈ మార్గం ద్వారా యుషు, షినింగ్‌ల మధ్య ప్రయాణ సమయం 8 గంటలకు తగ్గింది.

చైనా గోడ కింద హైస్పీడ్ సొరంగ రైలు మార్గం

గ్రేట్ వాల్ ఆఫ్ చైనా కింద హైస్పీడ్ సొరంగ రైలు మార్గాన్ని చైనా నిర్మించనుంది. 2022 శీతాకాల ఒలింపిక్స్‌కు ఆతిథ్యమివ్వనున్న బీజింగ్, ఝూంగ్ జియాకు నగరాలను అనుసంధానించేందుకు ఈ ప్రాజెక్టు చేపట్టింది. ఇందులో భాగంగా మహాకుడ్యానికి చెందిన బాడలింగ్ భాగం కింద 12 కి.మీ. పొడవైన సొరంగాన్ని తవ్వనున్నారు. గోడ కిందే 102 మీటర్ల లోతున 36 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో రైల్వే స్టేషన్‌ను నిర్మించనున్నారు. ఈ మార్గంలో గంటకు 350 కి.మీ. వేగంతో రైళ్లు ప్రయాణించనున్నాయి.

చైనా చేతికి శ్రీలంక రేవు

వ్యూహాత్మక హంబంటోటా రేవులో 70 శాతం వాటాను చైనాకు విక్రయిస్తూ శ్రీలంక నిర్ణయం తీసుకొంది. ఈ మేరకు 110 కోట్ల డాలర్ల ఒప్పందంపై జూలై 29న శ్రీలంక నౌకాయాన మంత్రి మహింద సమరసింఘే, కొలంబోలో చైనా రాయబారి జియాన్ లియాంగ్‌లు సంతకం చేశారు. నష్టాల్లో ఉన్న ఈ రేవును చైనా ప్రభుత్వ ఆధ్వర్యంలోని చైనా మర్చంట్ పోర్ట్ హోల్డింగ్స్‌కు అప్పగిస్తారు. 99 ఏళ్ల పాటు ఈ లీజు ఒప్పందం కొనసాగుతుంది. ఈ ఒప్పందంపై భారత్ ఆందోళన వ్యక్తం చేసింది.

ఇరాన్ అధ్యక్షుడిగా రోహానీ ప్రమాణం



ఇరాన్ అధ్యక్షుడిగా హసన్ రోహానీ ఆగస్టు 3న ప్రమాణ స్వీకారం చేశారు. రోహానీ 2013లో మొదటిసారి అధ్యక్షుడయ్యారు. 2015 అణు ఒప్పందం విషయంలో, ప్రపంచ దేశాల ఆంక్షల తొలగింపులో ఈయన కీలక పాత్ర పోషించారు. 2017 మేలో జరిగిన ఎన్నికల్లో రోహానీ 57 శాతం ఓట్లు సాధించి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

లష్కరే కమాండర్ దుజానా హతం

లష్కరే తోయిబా టాప్ కమాండర్ అబు దుజానాను ఆగస్టు 1న భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. జమ్మూకశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో పాకిస్థాన్ జాతీయుడైన దుజానాను, అతని అనుచరుడు ఆరిఫ్ నబీదార్‌ను భద్రతా బలగాలు హతమార్చాయి. దుజానా దక్షిణ కశ్మీర్‌లో లష్కరే తోయిబా చీఫ్ కమాండర్, ఏ+++ హోదా ఉగ్రవాది. 2013లో అబు ఖాసీం మరణించాక దుజానా లష్కరే టాప్ కమాండర్‌గా ఉన్నాడు.

క్రీడలు

హంగేరియన్ గ్రాండ్‌ప్రి విజేత వెటెల్

ఫెరారీ డ్రైవర్ సెబాస్టియన్ వెటెల్ హంగేరియన్ గ్రాండ్‌ప్రి విజేతగా నిలిచాడు. ఈ విజయంతో వెటెల్ ఎఫ్ 1 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో తన ఆధిక్యాన్ని 14 పాయింట్లకు పెంచుకున్నాడు. జూలై 30న బుడాపెస్ట్‌లో జరిగిన రేసులో వెటెల్ మొదటి స్థానంలో, ఫెరారీకే చెందిన రైకోనెన్ రెండో స్థానంలో నిలిచాడు.

2024 ఒలింపిక్స్‌కు పారిస్ ఆతిథ్యం

2024 ఒలింపిక్స్‌కు ఫ్రాన్స్ రాజధాని పారిస్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ ఏడాది సెప్టెంబరు 13న పెరూలోని లిమాలో జరిగే సమావేశంలో 2024కి పారిస్, 2028కి లాస్ ఏంజిల్స్‌ను ఎంపిక చేసినట్లు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ(ఐఒసి) ప్రకటిస్తుంది. 2020 ఒలింపిక్స్‌కు టోక్యో ఆతిథ్యం ఇవ్వనుంది. 2024 ఒలింపిక్స్‌కు పారిస్, లాస్ ఏంజిల్స్ పోటీ పడగా, 1924లో తొలిసారి ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇచ్చి వందేళ్లవుతున్న సందర్భంగా పారిస్‌కు అవకాశం ఇచ్చారు. వింటర్ ఒలింపిక్స్ 2022లో బీజింగ్‌లో జరుగుతాయి.

అవార్డులు

ఆచార్య కృష్ణకు జాతీయ ప్రతిభా అవార్డు

హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో 'సెంటర్ ఫర్ ఎర్త్ అండ్ స్పేస్ సైన్సెస్'లో ఆచార్యుడిగా పనిచేస్తున్న కె.ఎస్.కృష్ణ ప్రతిష్ఠాత్మకమైన జాతీయ ప్రతిభా అవార్డును అందుకొన్నారు. భూశాస్త్ర మంత్రిత్వ శాఖ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్ లో జూలై 27న ఈ అవార్డును అందజేశారు. ఈ సంవత్సరం జియో సైన్స్ అండ్ టెక్నాలజీ రంగం నుంచి డా.కె.ఎస్ కృష్ణ ఎంపికయ్యారు. 1984లో గోవాలోని సముద్ర అధ్యయన జాతీయ సంస్థలో శాస్త్రవేత్తగా చేరి, ముఖ్య శాస్త్రవేత్త స్థాయికి ఎదిగిన ఆయన హెచ్‌సియు ఆహ్వానం మేరకు ఇటీవలే ఆచార్యుడిగా చేరారు. ఎన్ఐఓలో చేసిన పరిశోధనలకు కృష్ణ ప్రతిభా అవార్డుకు ఎంపికయ్యారు.

సైన్స్ అండ్ టెక్నాలజీ

ఉత్తర కొరియా క్షిపణి పరీక్ష



ఉత్తర కొరియా నెల రోజుల్లో రెండోసారి ఖండాంతర క్షిపణిని పరీక్షించింది. 2017 జూలై 28న 'హ్వాసాంగ్-14' అనే క్షిపణిని ప్రయోగించింది. ఉత్తర కొరియా నాయకుడు కిమ్ జోంగ్ ఉన్ దీన్ని ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ఈ క్షిపణి 3724.9 కిలోమీటర్ల ఎత్తుకు చేరి 998 కి.మీ. ప్రయాణించింది. తూర్పు తీరానికి చేరువలో సముద్రంలో పడిపోయింది. దీని పరిధి 10 వేల కి.మీ. ఉత్తర కొరియా, రష్యా, ఇరాన్‌లపై ఆంక్షలు విధిస్తూ అమెరికా సెనెట్ ఒక తీర్మానం చేసిన మరుసటి రోజే కొరియా ఈ పరీక్షలను జరిపింది. 750 కిలోల వార్ హెడ్‌తో ఈ క్షిపణి న్యూయార్క్, వాషింగ్టన్ నగరాలను చేరగలదు.

తొలి మానవ రహిత యుద్ధ ట్యాంక్ 'మంత్ర'

భారత్ తొలి మానవ రహిత యుద్ధ ట్యాంక్ 'మంత్ర'ను రూపొందించింది. చెన్నై సమీపంలోని అవడిలోని ట్యాంక్ పరిశ్రమలో దీన్ని తయారు చేశారు. అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా 'కంబాట్ వెహికిల్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్'లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దీన్ని ప్రదర్శించారు. ఈ యుద్ధ ట్యాంక్‌లు మూడు రకాలు. నిఘా, మందుపాతరల గుర్తింపునకు వీటిని ఉపయోగించనున్నారు.

స్మృతి

ప్రొఫెసర్ పి.ఎం.భార్గవ

ప్రముఖ శాస్త్రవేత్త, సీసీఎంబీ వ్యవస్థాపక



డైరెక్టర్ ప్రొఫెసర్ పుష్పమిత్ర భార్గవ ఆగస్టు 1న హైదరాబాద్‌లో మరణించారు. 1928లో రాజస్థాన్ లోని ఆజ్మీర్‌లో జన్మించిన ఆయన లక్నో యూనివర్సిటీ నుంచి ఆర్గానిక్ కెమిస్ట్రీలో పట్టా పొందారు. సింథటిక్ ఆర్గానిక్ కెమిస్ట్రీలో పీహెచ్ డీ చేశారు. 1950-53 మధ్య ఐఐసీటీలో, 1953-56 మధ్య విస్కాన్సన్ వర్సిటీలో పనిచేశారు. 1986లో పద్మవిభూషణ్ అవార్డు పొందారు. సీసీఎంబీ వ్యవస్థాపక సంచాలకుడిగా 1977లో బాధ్యతలు స్వీకరించి 1990 వరకూ కొనసాగారు.

స్వయం ఉపాధి



మైనంపాటి శ్రీనివాసరావు
బిజినెస్ కన్సల్టెంట్
సెల్: 9866119816

మయోనైజ్ అంటే క్రీమీగా చిక్కగా ఉండే సాస్ / డ్రెస్సింగ్ పదార్థమని అందరికీ తెలుసు. దీన్ని వెజిటబుల్ నూనెలు, కోడిగుడ్డు సొన, నిమ్మరసం లేదా వెనిగర్, సీజనింగ్ లేదా ప్రిజర్వేటివ్స్‌తో తయారు చేస్తారు. శాకాహారుల కోసం కోడిగుడ్డు లేకుండా కూడా తయారు చేస్తారు. ఈ సాస్ తెలుపు, పసుపు వర్ణాల మిశ్రమంగా కనిపిస్తుంది. రుచిలో కొంచెం తియ్యదనం ఉంటుంది.

మయోనైజ్



వాడకం

మయోనైజ్‌ను ప్రధానంగా ఆహార పదార్థాల తయారీలో, వినియోగంలో విస్తృతంగా వాడతారు. సలాడ్స్, శాండ్‌విచ్ లు బర్గర్స్ తయారీలో కూడా ఎక్కువగా ఉపయోగిస్తారు. మందుల తయారీ, పెయింట్స్, కోటింగ్స్, మేకప్ ఉత్పత్తులు, డిటర్జెంట్స్ తయారీలో కూడా వినియోగిస్తారు. బేకరీ ఉత్పత్తులు, కాన్ఫెక్షనరీ ఉత్పత్తుల తయారీలో విస్తృతంగా వాడుతు న్నారు. ఆహార పదా ర్థాలకు పరిమ ళాన్ని అందించి ఆకర్షణీయంగా కనిపించేందుకు కూడా మయోనైజ్‌ను వినియోగిస్తారు.

చరిత్ర

ఈ సాస్‌ను 1756లో ఫ్రెంచ్ చెఫ్ Due de Richelieu కనుగొన్నారు. ఆ తరవాత ప్రపంచ వ్యాప్తంగా వివిధ ముడిపదార్థాలతో పలు రుచులతో దీన్ని తయారు చేస్తున్నారు. అమెరికాలో అత్యధిక పరిమాణంలో వినియోగించే కండిమెంట్‌గా ఇది గుర్తింపు పొందింది.

ఇండియన్ మార్కెట్

2014 నివేదిక ప్రకారం మన దేశంలో మయోనైజ్ మార్కెట్ పరిమాణం రూ.350 నుంచి 400 కోట్ల వరకు ఉందని తెలుస్తోంది. ఏటా 25 శాతం వరకు వృద్ధి పొందుతోంది.

దేశీయ మార్కెట్ వృద్ధికి కారణాలు

మారుతున్న పట్టణ ప్రజల జీవన విధానం, పట్టణాల నుంచి నగరాలకు పాకుతున్న ఆధునిక జీవన శైలీ, ఆన్ లైన్ స్టోర్స్, సూపర్ మార్కెట్స్‌లో వినియోగదారులకు అందుబాటులో ఉండటం, విదేశీ ప్రయాణాలు పెరగడం వంటి కారణాల వల్ల మయోనైజ్ సాస్‌కు డిమాండ్ పెరుగుతోంది.

తయారీకి కావల్సిన యంత్ర పరికరాలు

• హై స్పీడ్ మిక్సర్ • ట్రాన్స్‌ఫర్ పంపు • హోమోజినైజర్ • న్యూమాటిక్ ఫిల్లర్. • బ్యాండ్ సీలర్ • స్టెయిన్ లెస్ స్టీల్ పాత్రలు • టేబుల్

ముడి పదార్థాలు

మయోనైజ్ సాస్‌ను మూడు రకాలుగా తయారు చేస్తారు.

• గుడ్డు సొనతో తయారుచేసిన మయోనైజర్ • ఎగ్‌లెస్ లేదా వెజిటబుల్ మయోనైజర్ • హెర్బల్ మయోనైజర్. వీటికి ప్రధానంగా సోయాబీన్ ఆయిల్, ఆవనూనె, వైట్ వెనిగర్, ఉప్పు, ఇంగువ, తులసి నూనె, కరివేపాకు నూనె, గుడ్లు, ప్రిజర్వేటివ్ వంటివి అవసరం.

తయారీ విధానం

సహజంగా కలిసే లక్షణాలు లేని రెండు లేదా అంత కంటే ఎక్కువ వంట నూనెలను హైస్పీడ్ మిక్సర్‌లో నిదానంగా కలుపుతారు. మధ్య మధ్యలో ఇతర ముడి పదార్థాలను నిర్ణీత పరిమాణంలో కలుపుతూ గట్టి పేస్ట్ లా తయారు చేస్తారు. ఈ పేస్ట్‌నే మయోనైజర్ లేదా మాయో అని పిలుస్తారు. దీన్ని పెట్ బాటిల్స్, ప్లాస్టిక్ పౌచ్ ల్లో ప్యాక్ చేసి మార్కెట్‌కు తరలిస్తారు.

ఆరోగ్య ప్రాముఖ్యం

మయోనైజ్ అనేది ఒక సమతులాహార పదార్థం. ఇది పదార్థాలకు రంగు, రుచి, సువాసనలను అదించడమే కాకుండా ఆరోగ్యాన్ని పెంపొందిస్తుంది. ఇందులో ఉండే సోయాబీన్ ఆయిల్, ఆవ నూనెల్లోని ఆల్ఫా లినోలిక్ యాసిడ్, అత్యావశ్యక ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్, విటమిన్ బితోపాటు అనేక రకాల విటమిన్లు, ఖనిజాలు శరీరానికి అరోగ్యాన్ని అందిస్తాయి.

మార్కెటింగ్

చైనీస్ రెస్టారెంట్స్, పిజ్జా, బర్గర్ తయారీ సంస్థల్లో నేరుగా మార్కెట్ చేసుకోవచ్చు. గృహ వినియోగదారుల కోసం సూపర్ మార్కెట్లు, కిరాణా దుకాణాల ద్వారా మార్కెటింగ్ చేసుకోవాలి. ఇటీవల ఆన్ లైన్ వ్యాపారం వృద్ధి చెందుతోంది. కాబట్టి సంబంధిత వ్యాపార సంస్థలతో ఒప్పందాలు చేసుకొన్నట్లయితే లాభదాయకంగా ఉంటుంది.

పరిశ్రమ వివరాలు: పరిశ్రమ సామర్థ్యం: గంటకు 100 కిలోలు
పరిశ్రమ వ్యయం: రూ. 25 లక్షలు

What was the time taken by car..

QUANTITATIVE APTITUDE

Direction (1-5) : What approximate value should come in place of the question mark (?) in the following questions? (You are not ex-pected to calculate the exact value.)

1. 34.95% of 499.99 – 20.24% of 1599 + ? = 59.99
(1) 415 (2) 435 (3) 485 (4) 205 (5) 465


2. 7839.03 ÷ 6.99% of 879.9 + 618.14 = ?
(1) 512 (2) 664 (3) 774 (4) 744 (5) 894

3. $\sqrt{2499} \times \sqrt{730} \div \sqrt{899} = ?$
(1) 55 (2) 56 (3) 48 (4) 52 (5) 45

4. $\frac{1}{7}(6785.2 \div 9.999 \times 9.5 + 8967.89 \div 9) = ?$
(1) 2015 (2) 1112 (3) 1965 (4) 1895 (5) 1785

5. $\sqrt[3]{5831} \times 39.86 + \sqrt{15129} + 22022.2 \div 11 = ?^2$
(1) 42 (2) 59 (3) 48 (4) 33 (5) 53

Direction (6-10): Study the following line graph and table carefully and answer the given questions.
Line graph shows the speed of two Cars P and Q in five different days and table shows the distance covered by two Cars in five different days.



Distance travelled in kms.		
Days	**P**	**Q**
Mon	100	200
Tues	140	120
Wed	150	160
Thur	120	180
Fri	90	180

6. How much time did Car P take to complete its journey on Friday?
(1) 1 hr (2) 3 hrs (3) 5 hrs (4) 2 hrs
(5) None of these

7. What was the time taken by Car Q on Wednesday?
(1) 16 hrs (2) 15 hrs (3) 19 hrs (4) 17 hrs
(5) None of these

8. What was the average time taken by Car P in all the five days?
(1) 10 hrs (2) 21 hrs (3) 15 hrs (4) 12 hrs
(5) None of these

9. What was the average distance travelled by Car P and Q on Thursday?
(1) 120 km (2) 180 km (3) 300 km (4) 150 km
(5) None of these

10 What was the difference between time taken by Car Q on Wednesday and Car P on Friday?
(1) 30 hrs (2) 11 hrs (3) 6 hrs (4) 12 hrs
(5) None of these

Direction (11-15) : What should come in place of the question mark (?) in the following number series

11. 16 37 75 140 ? 416
(1) 240 (2) 247 (3) 250 (4) 230 (5) 220

12. 50 44 52 80 134 220 ?
(1) 344 (2) 264 (3) 256 (4) 244 (5) 324

13. 1115 608 355 229 166.5 ?
(1) 134.50 (2) 135 (3) 135.30
(4) 135.75 (5) None of these

14. 220 219 223 196 212 (?)
(1) 138 (2) 87 (3) 127 (4) 327
(5) None of these

15. 62 74 98 134 182 ?
(1) 232 (2) 233 (3) 222 (4) 223
(5) None of these

16. Ramesh sells 56 litre milk and water mixture, where ratio between milk and water is 5 : 2. He replaces 21 litre milk and water are mixture with a milk, water and honey mixture in the ratio of 3 : 2 : 2, then he pours the newly formed mixture completely in a container that contains some water and honey mixture, where ratio between water and honey is $a : b$. If the final ratio between milk, water and honey is 17 : 9 : 4, then what is the value of $a : b$?
(1) 7 : 2 (2) 1 : 1 (3) 3 : 2 (4) 3 : 1
(5) None of these

17. Javed and Bipin started a business in partnership investing ₹ 30,000 and ₹ 25,000



B. Krishna Kishore
Senior Faculty
Dimensions Coaching
Centre, Guntur.

RRB, PO's Special

respectively. After five months, Deepak joined them with ₹ 12,000. If Bipin's share in total profit is ₹ 15,000 at the end of 10 months from the starting of the business, then find the share of Deepak in profit.
(1) ₹ 3500 (2) ₹ 3600 (3) ₹ 4200 (4) ₹ 4500
(5) None of these

18. A tank of capacity 60 litres has two inlets(of same capacity) and one outlet pipes . When all the three are opened together, it takes 8 min to fill the cistern. If the outlet flow rate is increased 1.5 times, the tank is never filled. Find the minimum flow rate of the outlet for this to happen.
(1) $\frac{45}{4}$ litres/min (2) 15 litres/min
(3) 12 litres/min (4) 16 litres/min
(5) $\frac{27}{2}$ litres/min

Hints & Solutions

(1-5) :

1. (4) 34.95% of 499.99 – 20.24% of 1599 + ? = 59.99
$\Rightarrow \frac{35}{100} \times 500 - \frac{20}{100} \times 1600 + ? \approx 60$
$\Rightarrow 175 - 320 + ? = 60$
$\Rightarrow ? = 320 + 60 - 175 = 205$

2. (4) 7839.03 ÷ 6.99% of 879.9 + 618.14 = ?
$\Rightarrow ? = 7839 \div \frac{7}{100} \times 880 + 618$
$= 7839 \times \frac{100}{880 \times 7} + 618$
$= 127.25 + 618 = 745.25 \approx 744$

3. (5) $\sqrt{2499} \times \sqrt{730} \div \sqrt{899}$
$\approx 50 \times 27 \div 30 = 45$

4. (2) $\frac{1}{7}(6785.2 \div 9.999 \times 9.5 + 8967.89 \div 9)$
$\approx \frac{1}{7}(6785 \div 10 \times 10 + 8968 \div 9)$
$= \frac{1}{7}(6785 + 996.44)$
$= \frac{1}{7} \times 7781.44 = 1111.63 \approx 1112$

5. (5) $\sqrt[3]{5831} \times 39.86 + \sqrt{15129} + 22022.2 \div 11 = ?^2$
$\Rightarrow ?^2 \approx 18 \times 40 + 123 + 22022 \div 11$
$\Rightarrow ?^2 = 720 + 123 + 2002$
$\Rightarrow ?^2 = 2845 = 53.33 \approx 53$

(6-10) :

6. (3) Required time $= \frac{90}{18} = 5$ hrs.

7. (1) Required time $= \frac{160}{10} = 16$ hrs.

8. (2) Required average
$= \frac{\frac{100}{5} + \frac{140}{7} + \frac{150}{3} + \frac{120}{12} + \frac{90}{18}}{5}$
$= \frac{20 + 20 + 50 + 10 + 5}{5} = \frac{105}{5} = 21$ hrs.

9. (4) Required average
$= \frac{120 + 180}{2} = \frac{300}{2} = 150$ km

10. (2) Required difference
$= \frac{160}{10} - \frac{90}{18} = 16 - 5 = 11$ hrs.

(11-15) :

11. (2) The number series is :
16 37 75 140 **247** 416
+21 +38 +65 +107 +169
+17 +27 +42 +62
+10 +15 +20

12. (1) The number series is :
$1^3 + 7^2 = 50$
$2^3 + 6^2 = 44$
$3^3 + 5^2 = 52$
$4^3 + 4^2 = 80$
$5^3 + 3^2 = 134$
$6^3 + 2^2 = 220$
$7^3 + 1^2 = \mathbf{344}$

13. (4) The number series is :
1115 608 355 229 166.5 **135.75**
–507 –253 –126 –62.5 –30.75
+254 +127 +63.5 +31.75

14. (2) The number series is :
$220 + (1)^3 = 219$
$219 + (2)^3 = 223$
$223 + (-3)^3 = 196$
$196 + (4)^3 = 212$
$212 + (-5)^3 = \mathbf{87}$

15. (5) The number series is :
62 + 12 = 74
74 + (12 × 2) = 98
98 + (12 × 3) = 134
134 + (12 × 4) = 182
182 + (12 × 5) = **242**

16. (2) Ramesh sells 56 litre milk and water mixture, where milk: water = 5 : 2.
∴ Amount of milk = 40 litre & water = 16 litre
He replaces 21 litre milk and water mixture.
Amount of milk removed = 15 litre & water removed = 6 litre.
New amount of milk = (40 – 15) = 25 litre
New amount of water = (16 – 6) = 10 litre
He adds milk, water and honey mixture in the ratio of 3 : 2 : 2 (21 litre).
Amount of milk added = 9 litre
Amount of water added = 6 litre
Amount of honey added = 6 litre
New amount of milk, water and honey are respectively 34 litre, 16 litre, 6 litre.
It is poured in a container that contains some water honey mixture where water: honey = $a : b$.
Then we can say, the container initially contains ak litre & bk litre of water & honey respectively.
So, 34 : (16 + ak): (6 + bk) = 17 : 9 : 4 = 34 : 18 : 8
$\Rightarrow ak = 2$ litre & $bk = 2$ litre
$\Rightarrow a : b = 1 : 1$

17. (2) Ratio of share in profit = 3000 × 10 : 25000 × 10 : 12000 × 5
Total amount $= \frac{61}{25} \times 15000 =$ ₹ 36600
Share of Deepak in profit $= \frac{6}{61} \times 36600$
= ₹ 3600

18. (2) Given, tank of capacity 60 litres has two inlets and one outlet.
Let the flow rate of inlet be 'a' litres/min and flow rate of outlet be 'b' litres/min
Now, when all the three are opened together, it takes 8 min to fill the cistern.
$\Rightarrow 8(2a - b) = 60$
$\Rightarrow 2a - b = \frac{15}{2}$ ....(i)
Given, if the outlet flow rate is increased 1.5 times, the tank is never filled.
Thus, the flow rate of outlet becomes greater than the inlet.
$\Rightarrow 1.5\,b \geq 2\,a$
$\Rightarrow b \geq \frac{4a}{3}$
Thus, minimum $b = \frac{4a}{3}$
Substituting in equation (i)
$\Rightarrow 2a - \frac{4a}{3} = \frac{15}{2}$
$\Rightarrow \frac{2a}{3} = \frac{15}{2}$
$\Rightarrow a = \frac{45}{4}$ litres/min
$= 4 \times \frac{45}{12} = 15$ litres/min
Thus, $b = \frac{4a}{3}$

ఉద్యోగాలు

హెచ్ఏఎల్

బెంగళూరులోని హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్)- **గ్రాడ్యుయేట్ ఇంజనీర్ అప్రెంటిస్‌షిప్ & డిప్లొమా టెక్నీషియన్స్ అప్రెంటిస్‌షిప్** కోసం దరఖాస్తులు కోరుతోంది.
గ్రాడ్యుయేట్ ఇంజనీర్స్ విభాగాలు: ఏరోనాటికల్/ ఏరోస్పేస్ / కెమికల్/ సివిల్/ కంప్యూటర్ ఇంజనీరింగ్/ కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ/ కంప్యూటర్ సైన్స్ & ఇంజనీరింగ్ / ఇన్ఫర్మేషన్ & ఇంజనీరింగ్/ ఐటి/ ఎలక్ట్రికల్/ ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్/ ఎలక్ట్రికల్ & కమ్యూనికేషన్ / ఏవియోనిక్స్/ ఎలక్ట్రానిక్స్& టెలి కమ్యూనికేషన్స్/ ఇండస్ట్రియల్ ఎలక్ట్రానిక్స్ & ఇన్ స్ట్రుమెంటేషన్ / టెలికమ్యూనికేషన్) /మెకానికల్/ ఇండస్ట్రియల్/ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ / ప్రొడక్షన్ / మెటలర్జీ & మెటీరియల్ సైన్స్/ ఫౌండ్రీ టెక్నాలజీ
అర్హత: సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిగ్రీ ఉండాలి.
డిప్లొమా టెక్నీషియన్స్ అప్రెంటిస్ విభాగాలు: ఏరోనాటికల్/ మెకానికల్/ ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్/ ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్ /సివిల్/ కంప్యూటర్ సైన్స్ & ఇంజనీరింగ్ /ఇన్ఫర్మేషన్ సైన్స్ & ఇంజనీరింగ్/ కమర్షియల్ ప్రాక్టీస్ / మెటలర్జీ ఇంజనీరింగ్
అర్హత: ఇంజనీరింగ్ డిప్లొమా ఉత్తీర్ణత + ప్రొవిజనల్ డిగ్రీ సర్టిఫికెట్ ఉండాలి
ట్రైనింగ్ వ్యవధి: ఏడాది
దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 22, 2017
వెబ్‌సైట్: http://115.254.50.170/tti

ఎంజీఎన్ ఆర్ఈజీఏ

మహాత్మాగాంధీ నేషనల్ రూరల్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ యాక్ట్ (ఎంజీఎన్ ఆర్ఈజీఏ) పథకం కోసం కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నారు.
మొత్తం ఖాళీలు: 77
పోస్టుల వారీ ఖాళీలు: జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్ 69, అకౌంట్ అసిస్టెంట్ 8
అర్హత: డిప్లొమా/ గ్రాడ్యుయేషన్ / ఇంజనీరింగ్ డిగ్రీ పూర్తిచేసి ఉండాలి
వయసు: 21 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
వేతనం(నెలకు): జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్‌కు రూ.8,000, అకౌంట్ అసిస్టెంట్‌కు రూ.13,000
ఎంపిక: రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
వెబ్‌సైట్: dungarpur.rajasthan.gov.in

రైల్‌టెల్ కార్పొరేషన్

రైల్‌టెల్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా - కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 50
పోస్టులు: ప్రాజెక్ట్ డైరెక్టర్/ ఎంటర్‌ప్రైజ్ ఆర్కిటెక్ట్ 2, సీనియర్ ఆర్కిటెక్ట్(ఒఎస్/ సర్వర్/ హార్డ్‌వేర్) 2, సీనియర్ ఆర్కిటెక్ట్ 1 (డేటాబేస్ అడ్మిన్), సీనియర్ ఇఆర్‌పి టెక్నో ఫంక్షనల్ (ఒరాకిల్) 1, టెక్నికల్ లీడ్(శాప్/ డాట్‌నెట్/ ఆండ్రాయిడ్ అప్లికేషన్స్/ జావా డెవలపర్/ నెట్ వర్క్ బ్యాండ్ విడ్త్) 14, టెక్నికల్ కన్సల్టెంట్ 25, ఆఫీస్ అడ్మిన్ (కో ఆర్డినేటర్ /ట్రైనింగ్ మేనేజర్) 2
అర్హత: బిఇ/ బిటెక్/ ఎంసిఏ/ బిసిఏ
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా
దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 22, 2017
వెబ్‌సైట్: www.railtelindia.com

అడ్మిషన్స్

గీతం యూనివర్సిటీ

గీతం యూనివర్సిటీ-స్కూల్ ఆఫ్ నర్సింగ్ బీఎస్సీ (నర్సింగ్) కోర్సులో ప్రవేశం కోసం నిర్వహించే **'గీతం నర్సింగ్ అడ్మిషన్ టెస్ట్ (జినాట్)- 2017'**కు ప్రకటన విడుదల చేసింది. ఈ కోర్సుకు ఇటీవలే ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ గుర్తింపు లభించింది.
సీట్ల సంఖ్య: 100
అర్హత: 45 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ (బైపిసి) లేదా ఇంటర్మీడియెట్ ఒకేషనల్ నర్సింగ్ కోర్సు.
జినాట్-2017 పరీక్ష తేదీ: ఆగస్టు 28, 2017
దరఖాస్తు ఫీజు: రూ.300
దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 14, 2017
వెబ్‌సైట్: www.gitam.edu

శ్రీవారికి శ్రావణమాసపూజలు

రైల్వేకోడూరు: పట్టణంలోని టోల్గేట్‌కు సమీపంలో వెలసిఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి శ్రావణమాసపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చకులు బండాత్మకూరుమణికంఠశర్మ ఆధ్వర్యంలో స్వామివారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేకపూజలు చేశారు. వందలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి భక్తులు క్రిష్ణయ్య, గునిశెట్టిరామచంద్రయ్యలు ప్రసాదాలు పంపిణీచేశారు.



కోడూరులో పెరుగుతున్న గల్ఫ్‌బాధితులు

రైల్వేకోడూరు: మండలంలో గల్ఫ్‌బాధితులు పెరుగుతున్నారు. శనివారం రైల్వేకోడూరు మండలంలోని అయ్యవారిపల్లెకు చెందిన శివలక్ష్మీ సౌదియాకు వెళ్లి అక్కడ కాయకష్టం చేసింది. జీతాలు ఇవ్వకుండా చిత్రహింసలకు గురిచేశారని కుటుంబీకులు వాపోతున్నారు. అలాగే కోడూరుకు చెందిన కుమార్‌ట్రావెల్స్‌వారు వీసాలుతీసి సౌదియాకు అమ్మేస్తున్నారని శివమ్మఅనే బాధితురాలు విలపించింది. సేట్‌ఇంటిలో చేస్తున్న భోజనాలు నచ్చలేదని పారవేసేవారని ఎదిరించినందుకు జైలుకు పంపారని, జైలులో ఒకటిన్నరనెలపాటు ఉన్నానని అక్కడినుంచి ఇండియాకు పంపారని పోలీసులకు వివరించింది. అదేవిధంగా ఓబువారిపల్లెకు చెందిన క్రిష్ణవేణిని కూడా రైల్వేకోడూరు కుమార్‌ట్రావెల్స్‌వారు సౌదియాకు పంపారని ఇంతవరకు ఆచూకీలేదని, ఆమె భర్త శంకరయ్య తెలుపడంతో ఓబువారిపల్లె పోలీసులను ఆశ్రయించాలని ఎస్సై వెంకటేశ్వర్లు సూచించారు. అలాగే రైల్వేకోడూరు మండలంలోని తాడివారిపల్లె గ్రామసమీపంలో ఉన్న కొత్తూరు గ్రామానికిచెందిన పద్మావతమ్మ నాలుగునెలలుగా సౌదియాకువెళ్లి ఇంతవరకు రాలేదని భర్త పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఆమేరకు ఎస్సై వెంకటేశ్వర్లు అదుపులోఉన్న కుమార్‌ను విచారించారు. పద్మమ్మను వెంటనే పిలించాలని చెప్పడంతో వారంరోజుల్లో పిలిపిస్తామని తెలిపారు. ట్రావెల్స్ నిర్వాహకులపై నిఘాలున్నాయని ఎస్ఐ తెలిపారు.



బాధితులను విచారిస్తున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు



సౌదీలో క్రిష్ణవేణి కనిపించలేదని ఆందోళనపడుతున్న భర్తశంకరయ్య



సౌదీలో చిత్రహింసలకు గురైన శివలక్ష్మీ

మైనారిటీ రుణాలకు గడువులు పెంచాలి

పెనగలూరు : ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మైనారిటీ కార్పొరేషన్ స్వయం ఉపాధి కోసం దరఖాస్తుల గడువు పెంచాలని మండల కో-ఆప్షన్ సభ్యుడు షేక్ షామీర్‌బాషా ప్రభుత్వాన్ని కోరారు. 2017-18ఆర్థిక సంవత్సరంలో పెనగలూరు మండలానికి మైనారిటీ కార్పొరేషన్ ద్వారా 8యూనిట్లు మంజూరు చేయగా ఏపీజీబీ పెనగలూరు శాఖ మూడు యూనిట్లు, పొందలూరు శాఖకు రెండు యూనిట్లు, ఎస్‌బీఐ పెనగలూరు బ్రాంచ్ కు రెండు యూనిట్లతో పాటు ఒక మోటారు వాహనం యూనిట్‌ని కూడా మంజూరు చేసిందన్నారు. అయితే లబ్ధిదారులు దరఖాస్తు చేసుకునేందుకు ఒక్క రోజు మాత్రమే గడువు ఉంది. ఒక్క రోజులో రెవెన్యూ కార్యాలయం నుంచి కులధృవీకరణ పత్రాలు పొందడం ఎవ్వరికీ సాధ్యపడదని అందువల్ల మరో పది రోజుల వరకూ మైనారిటీ కార్పొరేషన్ యూనిట్లకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం గడువు పెంచాలని ఆయన కోరారు.

ఇలా వెళితే ప్రమాదం కాదా!



రైల్వేకోడూరు: బొప్పాయి సీజన్ ప్రారంభమైందంటే చాలు కోడూరులో లారీ మోత తప్పదు. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, ఢిల్లీ, కర్ణాటక తదితర రాష్ట్రాలకు చెందిన లారీలు రైల్వేకోడూరుకు వస్తుంటాయి. మార్వాడీలు ఇక్కడే మకాం పెట్టి సీజన్ పూర్తి అయినంత వరకు కాయలు ఎగుమతులు చేస్తారు. ఇదిలా ఉండగా బొప్పాయి లారీకి 20మందికి పైగా కోతకూలీలు ఉంటారు. కోతలు, కాయలు ప్యాకింగ్ తర్వాత లోడింగ్‌పూర్తిచేసి కూలీలు లారీపైనే ప్రయాణిస్తుంటారు. రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పుల్లంపేట, పెనగలూరు తదితర మండలాలల్లో బొప్పాయితోటలకు రైల్వేకోడూరునుంచే లారీలు వెళుతాయి. దీంతో లోడుకుమించి జనాలను వేసుకునివస్తారు. గ్రామీణప్రాంతాల్లో విద్యుత్‌తీగలు కిందనేఉన్నాయి. గతంలో ప్రమాదాలు జరిగాయని, ఎవరు పట్టించుకోవడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. చిత్తూరుజిల్లా ఏర్పేడు సంఘటన రాష్ట్రమంతటా భయాన్ని కలిగించింది. ఇంత జరగుతున్నా లారీలలో టాప్ పైన కూలీలు కూర్చొని ప్రయాణిస్తుండడం ప్రమాదం కాదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. దీన్ని పోలీసులు ఎందుకు అదుపు చేయడంలేదని పలువురు పేర్కొంటున్నారు. ఏదైనా జరుగకముందే స్పందించాల్సిన అవసరం ప్రభుత్వం, పోలీసులపైన ఉంది.

వనం-మనంపై విద్యార్థులకు అవగాహన

చిట్వేలి : మండలం లోని కె.కందులవారిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం వనం-మనంపై అటవీ అధికారులు, ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో 20మొక్కలను నాటారు. అనంతరం మొక్కల ప్రతిభను తెలియజేసే డ్రాయింగ్ పోటీలను నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందించారు. ఈ నెల 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు 245మొక్కలు నాటించామని, ప్రతి శనివారం 6వారాల పాటు మొక్కలను నాటిస్తామని ఎఫ్ఎస్వో దివాకర్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గుండయ్యనాయుడు, రాజశేఖర్‌నాయుడు, హెచ్ఎం రామకృష్ణయ్య, ఉపాధ్యాయులు రామబ్రహ్మం, పీఈటీ రమేష్, ఎఫ్ఎస్వో దివాకర్, ఎఫ్‌బీవోలు రజని, లింగారెడ్డి, సావిత్రి, ఏబీవో ఈశ్వరయ్య, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



మొక్కలపై వేసిన డ్రాయింగ్‌లను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

11న రుణ దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు

రైల్వేకోడూరురూరల్ : ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, కాపు కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుదారులకు ఈనెల 11వ తేదీన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎస్సీ కార్పోరేషన్ ఈడీ, మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీ లక్ష్మి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని అన్ని బ్యాంకర్లతో సీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్యాంకర్లుకు ప్రభుతం నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని ఆమె సూచించారు. 11 వతేధీన రైల్వేకోడూరులో నిర్వహించే ఇంటర్వ్యూలకు 2014-15, 2015-16, 2016-17, 2017-18 వార్షిక సంవత్సరాలలో రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారందరూ హాజరు కావాలని తెలిపారు. 11న ఉథయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక యంపీడీవో సంజీవరావు, యంపీపీ అవుల కుంట్ల అనసూయమ్మ, జడ్పీటీసీ సభ్యురాలు మారెళ్ళ రాజేశ్వరి, వివిధ శాఖల బ్యాంకు మేనేజర్లు, పాల్గొన్నారు.



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీలక్ష్మీ

తపాలా శాఖ ద్వారా

గ్రామీణులకు సత్వర సేవలు

గల్ఫ్ ఇతర దేశాల నుంచి వెంటనే నగదు పొందే సౌకర్యం

పెనగలూరు సబ్ పోస్టుమాస్టర్ హరికృష్ణ, సెల్ : 9440455348



పెనగలూరు : విదేశాలలో బతుకుదెరువు కోసం వెళ్ళిన వారు సొంత గ్రామంలోని వారి బంధువులకు, ఆత్మీయులకు పంపించే డబ్బులు తపాలా శాఖలోని వెస్టరన్ యూనియన్ ద్వారా వెంటనే పొందవచ్చని పెనగలూరు సబ్‌పోస్టుమాస్టర్ సిద్దవరం హరికృష్ణ తెలిపారు. శనివారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడు తూ.. కేంద్ర ప్రభుత్వం తపాలా శాఖ ద్వారా ప్రజలకు అందించే పలు పథఖాల గురించి వివరించారు..

ప్రశ్న : తపాలా శాఖలో ఇతర దేశాల నుంచి వచ్చే డబ్బును ఎలాపొందవచ్చు..?

జవాబు : వెస్టరన్ యూనియన్ ద్వారా గల్ఫ్‌దేశాలు, అమెరికా, ఆస్ట్రేలియా తదితర దేశాల నుంచి పంపించే డబ్బును సొంత గ్రామంలోని ఆత్మీ యులు, బంధువులు సీక్రెట్ నెంబర్ ద్వారా తపాలా శాఖలో వెంటనే పొందే అవకాశం ఉందన్నారు.

ప్రశ్న : మన దేశంలో ఎప్పటికప్పుడు వెంటనే డబ్బులు తీసుకునే అవకాశం ఉందా..?

జవాబు : ఇఎంవో ద్వారా ఒక రాష్ట్రంలోని మారుమూల పల్లెలో ఉన్న తపాలా కార్యాలయంలో డబ్బు కట్టి వేరొక రాష్ట్రంలో ఉన్న తమ వారికి అందజేయాలని పంపిస్తే ఇక్కడ డబ్బు కట్టిన వెంటనే అక్కడ పోస్ట్‌మెన్ ద్వారా డబ్బు అందించే అవకాశం ఉందన్నారు.

ప్రశ్న : రెండింతలు వడ్డీ వచ్చే అవకాశం ఉందా..?

జవాబు : కిసాన్ వికాస్ పత్రాల ద్వారా 115నెలలకు ఎంత మొత్తం కడితే అంత మొత్తం వస్తుంది.

ప్రశ్న : ఆడ బిడ్డలకు ఎటువంటి పథకాలు ఉన్నాయి.?

జవాబు : సుకన్యసమృద్ధి యోజన పథకం ద్వారా పది సంవత్సరాల ఆడబిడ్డలకు డబ్బు కట్టేవీలుంది. నెలనెలా 1000 రూపాయలు చెల్లిస్తే 14ఏళ్లకు 5లక్షల రూపాయలు డబ్బు వస్తుంది.

ప్రశ్న : తపాలా వడ్డీ ఎలా ఇస్తారు.?

జవాబు : ఎస్‌బీకి నాలుగు శాతం, ఆర్‌డీకి 7.1శాతం, టీడీకి 1సంవత్సరానికి 6.9, రెండేళ్ళకు 7శాతం, మూడేళ్ళకు 7.2, ఐదేళ్ళకు 7.7శాతం లెక్కన వడ్డీ పొందవచ్చు.

నేడు అనంతరాజుపేటలో మనఊరు-మనశుభ్రత

రైల్వేకోడూరు: మండలంలోని అనంతరాజుపేటలో మనఊరు-మనశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు శనివారం నిర్వాహకుడు బండారుమల్లి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి రైల్వేకోడూరు ఎస్సైలు వెంకటేశ్వర్లు, భక్తవత్సలంలు ముఖ్యఅతిథులుగా హాజరౌతున్నారని, అనంతరాజుపేట గ్రామంలో పిచ్చిమొక్కలతొలగింపు, చెత్త చెదారాలు లేకుండా చేస్తామని, మట్టికుప్పలు తొలగింపు తదితర కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. గ్రామంలోని అందరు యువకులు పాల్గొంటారని తెలిపారు.

ఓబులవారిపల్లె ఎంపీపీ దాతృత్వం

సొంత నిధులతో మినరల్ వాటర్‌ప్లాంట్ మరమ్మతులు



నీటి శుద్ధియంత్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వర్‌రాజు

ఓబులవారిపల్లె : కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో మండలాధ్యక్షుడు వెంకటేశ్వర్‌రాజు తన సొంత ఖర్చులతో మినరల్‌వాటర్ ప్లాంట్‌ను మరమ్మతు చేయించారు. కస్తూరిబాగాంధీ బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన నీటి శుద్ధి యంత్రం మరమ్మతులకు గురై పాఠశాల విద్యార్థినులకు తాగునీటికి తీవ్ర ఇబ్బందులుపడుతుండేవారు. ఈ విషయాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ వరలక్ష్మీ మండలాధ్యక్షుడు వెంకటేశ్వరరాజు దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఎంపీపీ వెంటనే స్పందించి నీటి శుద్ధియంత్రానికి అయ్యే ఖర్చులు తానే భరించి మరమ్మతులు చేపట్టారు. నీటి శుద్ధికేంద్రం మరమ్మతులు అయ్యేంత వరకు క్యాన్ ల ద్వారా మినరల్‌వాటర్‌ను సరఫరాకు అయ్యే వ్యయాన్ని పాఠశాల ప్రిన్సిపాల్‌కు అందజేశారు. దీంతో ఎంపీపీకి పాఠశాల తరుపున ధన్యవాదాలు తెలిపారు.

బయోమెట్రిక్ ద్వారా ఎరువుల విక్రయాలు

ఓబులవారిపల్లె :మండలంలో బయోమెట్రిక్ విధానంతో ఎరువులు విక్రయించనున్నట్లు వ్యవసాయాధికారి శ్రీరాములు తెలిపారు. ఈ మేరకు శనివారం ఎరువుల దుకాణం నందు రైతులకు ఎరువులను బయోమెట్రిక్ ద్వారా విక్రయించే విధానాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు కావాల్సిన ఎరువులు గతంలో మాదిరి లేకుండా ప్రభుత్వం కొత్త విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఎరువులు కావాల్సిన రైతులు ఈ పాసుమిషన్ ద్వారా బయోమెట్రిక్ విధానంతో కొనుగోలు చేయాల్సి ఉంటుందన్నారు. ఎరువుల్లో ఏవైనా తేడాలు వస్తే రశీదు ద్వారా ఎరువుల దుకాణం యజమానిపై చర్యలు ఉంటాయని తెలిపారు.



బయోమెట్రిక్ ద్వారా రైతు ఎరువుల కొనుగోలు విధానాన్ని చూపిస్తున్న వ్యవసాయాధికారి శ్రీరాములు

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు తోడ్పాటు



కళాశాల ఆవరణంలో మొక్కలు నాటుతున్న సీఐ మురళీ

రాజంపేట రూరల్ : పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం ఎంతగానో తోడ్పడుతుందని సీఐ మురళీ పేర్కొన్నారు. రాజంపేట అన్నమాచార్య ఇంజ నీరింగ్ కళాశాలలో శనివారం భారీ ఎత్తున కళాశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం కళాశాల విద్యార్థులు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాజంపేట గ్రామీణ సీఐ మురళీ, ఎస్ఐ మహేష్ హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలు నాటండి.. పర్యావరణాన్ని పరిరక్షించండి అనే నినాదంతో విద్యార్థులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని విరివిగా చేపట్టాలన్నారు. అదేవిధంగా ఎన్ ఎస్ఎస్ విద్యార్థులు ఇలాంటి వినూత్న కార్యక్రమాల్లో పాల్గొని సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఇంటి దగ్గర మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇంజనీర్ రామసుబ్బారెడ్డి, కళాశాల డీన్ సుబ్రమణ్యం, అబ్దుల్‌రహీం, ఓబులపతి, కళాశాల వైస్ చైర్మన్ యల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మానవ మనుగడకు మొక్కలే ఆధారం



కస్తూర్బా పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటుతున్న రూరల్‌సీఐ, ఎస్ఐలు

వీరబల్లి: పర్యావరణ పరిరక్షణతో పాటు మానవ మనుగడకు మొక్కలే ఆధారమని రాయచోటి రూరల్ సీఐ నరసింహారాజు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రానికి సమీపంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణం కాలుష్యం కోరల్లో చిక్కుకుందని, ఈ పరిస్థితులు ఇలాగే కొనసాగితే భవిష్యత్ తరాలకు ప్రమాదం పొంచి ఉందన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ముఖ్యంగా ఉపాధ్యాయులు, బాలికలు వారి గ్రామాల్లో అవగాహన కల్పించి ప్రతి ఇంటిలో మొక్కలు పెంచుకునేలా చూడాలన్నారు. ఎస్ఐ లక్ష్మీప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కూడా ఇంటికొక మొక్కను నాటి విధిగా నీరు పోసి సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ఉపాధ్యాయులు, బాలికలు పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసాన్నిస్తాయి



మ్యూజికల్ చైర్స్ ఆడుతున్న రీజెన్సీ విద్యార్థులు

రాజంపేట టౌన్ : విద్యార్థులు చదువుతో పాటు ఆటలు అవసరమని, ఆట ల వలన మానసిక ఉల్లాసం లభిస్తుం దని రీజెన్సీ నలందా కళాశాల సీఏవో సబ్బినేని ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం చిన్నారులకు మ్యూజికల్ చైర్స్ కార్యక్రమాన్ని రీజెన్సీ నలందాలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఏ వో మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్యను విద్యార్థులకు అందిస్తున్నామని, దానికి తోడు మెదడు చురుగ్గా పనిచేయడానికి చిన్న వయసు నుంచే వారికి క్రీడల పట్ల ఆసక్తిని పెంచుతున్నామన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రధాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

12మంది మందుబాబులకు జరిమానా

రైల్వేకోడూరు: 12మంది మందుబాబులకు న్యాయస్థానం శనివారం అపరాధరుసుం విధించింది. 12మందిపైన ఇటీవల పోలీసులు డ్రంక్‌అండ్ డ్రైవ్ కేసులు నమోదుచేసి న్యాయస్థానంలో హాజరుపెట్టారు. న్యాయమూర్తి ప్రసూన కేసులను పరిశీలించి వారికి రూ.23వేలు అపరాధరుసంలు విధించారు. పదేపదే మద్యం తాగి వాహనాలను నడిపితే జైలుకు పంపాల్సివస్తుందని న్యాయస్థానం హెచ్చరించినట్లు రైల్వేకోడూరు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. అలాగే 5ఆటోలను నడిపే డ్రైవర్లకు డ్రైవింగ్‌లైసెన్సులు లేవని కేసులు నమోదుచేసినట్లు ఎస్సై వివరించారు.

నంద్యాలలో వైసీపీ గెలుపు తథ్యం

పెనగలూరు : నంద్యాల ఉప ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి శిల్పా మోహన్ రెడ్డి గెలుపు తథ్యమని రైల్వేకోడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, పెనగలూరు సహకార బ్యాంకు అధ్యక్షుడు కొండూరు అజయ్‌రెడ్డి, జడ్పీటీసీ విజయ్‌రెడ్డి, వైసీపీ మండల ఇన్ చార్జి కేతా చక్రపాణి, కన్వీనర్ బి.ఎల్.నరసింహారెడ్డి తదితరులు జోస్యం చెప్పారు. శనివారం సాయంత్రం ఓబిలి వారు విలేకరులతో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు మాత్రమే పనులు జరుగుతున్నాయి తప్ప పేద ప్రజల సమస్యలు పరిష్కారం కావడంలేదన్నారు.

కూలి ఇప్పించండి

రైల్వేకోడూరు: అటవీశాఖ అధికారులు అడవిలో వివిధరకాల పనులు చేయించుకుని కూలిఇవ్వలేదని కుక్కలదొడ్డి గ్రామానికిచెందిన జికంటివెంకటయ్య అనే గిరిజన కూలీ వాపోయాడు. ఆ మేరకు పోలీసులకు ఫిర్యాదుచేశామని, తమకు న్యాయంచేయాలని కోరాడు.

10న విద్యాసంస్థల బంద్

రాజంపేట టౌన్ : కేంద్రంలోనూ రాష్ట్రంలోనూ పాలకులు విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తూ సమస్యలు తీర్చకపోగా సమస్యలు సృష్టిస్తున్నారని, దీంతో ఈ నెల 10వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగ సమస్యల పరిష్కారానికై విద్యాసంస్థల బంద్ నిర్వహించచేస్తున్నామని ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యు విద్యార్థి నేతలు తెలిపారు. శనివారం ఎన్జీవో హోంలో సమావేశమై వారు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులకు విద్యను దూరం చేసే విధంగా ప్రభుత్వ పాఠశాలలను సంక్షేమ హాస్టళ్లను మూసి వేస్తున్నారని దాన్ని విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ఏరియా కార్యదర్శి ఇ.సికిందర్, ఎస్ఎఫ్ఐ ఏరియా కార్యదర్శి టి.ప్రశాంత్, పీడీఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్ .నగేష్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

రాయలసీమ అభివృద్ధికి ఉక్కు పరిశ్రమ నిర్మించాలి

రాజంపేట టౌన్ : రాయలసీమ అభివృద్ధికి ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని ఆర్ఎస్‌వైఎఫ్ జిల్లా అధ్యక్షుడు నరసింహ డిమాండ్ చేశారు. శనివారం రాయలసీమ విద్యార్థి యువజన సంఘం సభ్యులు కళ్లకు గంతలు కట్టుకొని రాజంపేట పాతబస్టాండు సర్కిల్‌లో ధర్నాచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమలో రత్నాలు రాసులుగా పోసి అమ్మినా నేల నేడు కరువుతో అల్లాడుతోందని, అయినా పాలకులు చోద్యం చేస్తున్నారు తప్ప పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కడపలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేయాలని వంద రోజుల పాటు దీక్షలు ప్రారంభమై 30రోజులు కావస్తున్నా ప్రభుత్వానికి పట్టలేదన్నారు.

పఠన సామగ్రి వితరణ

వీరబల్లి: మండల పరిధిలోని ఓదివీడు యర్రంరాజుగారిపల్లె ఉన్నత పాఠశాలలో రాయచోటి రోటరీక్లబ్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు పఠన సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ అసిస్టెంట్ గవర్నర్ పబ్బిశెట్టి సురేష్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు పఠనా సామాగ్రిని హైదరాబాదుకు చెందిన వసుధ ఫౌండేషన్ సౌజన్యంతో పంపిణీ చేసినట్లు తెలిపారు. అధ్యక్షుడు సయ్యద్ అస్రఫ్‌అల్లీ, రోటరీ జిల్లా అధికారి గాండ్లపెంట ఖాదర్ బాషా, గ్రామపెద్దలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామచంద్రరాజు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి

చిట్వేలి : పరిశుభ్రమైన వాతావరణంలో మెనూ ప్రకారం భోజనాన్ని వడ్డించాలని ఎంపీడీవో మస్తాన్ వలీ సూచించారు. కస్తూరిబా గాంధీ పాఠశాలను శనివారం ఎంపీడీవో పరిశీలించారు. ఈ సందర్భంగా బాలికలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

సినిమా గైడ్

రైల్వేకోడూరు

లక్ష్మీప్యారడైజ్:నిన్నుకోరి
సిద్దేశ్వర : ఫిదా
ఏఎస్ఆర్ :వాసుకి
శ్రీకృష్ణ : గౌతంనంద
లవ: దువ్వాడజగన్నాథం(డీజే)

దినఫలాలు

అదృష్టసంఖ్యలు: 1, 6


మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): వృత్తి, వ్యాపారాల్లో సృజనాత్మకంగా వ్యవహరించి సత్ఫలితాలు సాధిస్తారు. ప్రముఖులను కలుసుకుంటారు. గౌరవ పదవులు లభిస్తాయి. చిన్నారుల వైఖరి మనస్తాపం కలిగిస్తుంది.


వృషభరాశి: (ఏప్రిల్21-మే20): విద్యాసంస్థల్లో ప్రవేశానికి ఏర్పాట్లు చేసుకుంటారు. ప్రయాణాలు, సమావేశాలకు అనుకూలం. బదిలీలకు సంబంధించి కీలక సమాచారం అందుకుంటారు. రియల్ఎస్టేట్, ఫర్నిచర్ రంగాల వారు ఆచితూచి వ్యవహరించాలి.


మిథునరాశి:(మే21-జూన్21): ఫీజులు, స్టేషనరీ కొనుగోలుకు నిధులు సర్దుబాటవుతాయి. పెట్టుబడులకు సంబంధించిన సమాచారం సేకరిస్తారు. సన్నిహితుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపించాలి. పూర్వమిత్రులను కలుసుకుంటారు.


కర్కాటకరాశి:(జూన్22-జూలై23): ప్రియతముల కోసం విలువైన వస్తువులు సేకరిస్తారు. స్పెక్యులేషన్లు, పెట్టుబడుల్లో నిదానం అవసరం. భాగస్వామ్యాలు లాభిస్తాయి. పందాలు, పోటీల్లో విజయం సాధిస్తారు.


సింహరాశి:(జూలై24-ఆగస్టు23): కొత్త ప్రాజెక్టుల గురించి ఆలోచిస్తారు. వైద్యం, యోగ, ధ్యానాలు, ఆహార నియమాలపై దృష్టి పెడతారు. వృత్తి, వ్యాపారాలకు సంబంధించి కీలక నిర్ణయాలకు తగిన సమయం కాదు.


కన్యారాశి: (ఆగస్టు24-సెప్టెంబర్23): విద్యార్థులకు శుభప్రదం. విదేశీ విద్య కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. దీర్ఘకాలిక పెట్టుబడులపై దృష్టి సారిస్తారు. ప్రియతములకు సంబంధించిన ఒక సమాచారం కలవరం కలిగిస్తుంది.


తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): భూమి లావాదేవీలకు అనుకూలం, నిర్మాణరంగం వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. బంధు మిత్రుల కలయికతో ఇంట్లో సందడి నెలకొంటుంది. సమావేశాలు, ప్రదర్శనలకు ఏర్పాట్లలో అసౌకర్యం కలగవచ్చు.


వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): ప్రముఖుల సహకారంతో విద్యాసంస్థలతో పనులు పూర్తి చేస్తారు. ఏజెంట్లు, రిప్రజెంటేటివ్‌లు, బోధనా రంగానికి చెందిన వారికి ప్రోత్సాహకరం. ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. ఒక వార్త కలవరపెడుతుంది.


ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): విద్య, ప్రయాణాలకు అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి. వ్యూహాత్మకంగా వ్యవహరించి ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. సమావేశాలు, ప్రదర్శనలకు ఏర్పాట్లు చేసుకుంటారు. సంకల్ప సిద్ధికి అధికంగా శ్రమించాలి.


మకరరాశి:(డిసెంబర్22-జనవరి21): నిర్ణయాలను సమీక్షించుకుంటారు. పెట్టుబడులు, బీమా, మ్యూచువల్ ఫండ్ వ్యవహారాలపై ఒక నిర్ణయానికి వస్తారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపిస్తారు. విలువైన వస్తువులు కొనుగోలులో జాగ్రత్త అవసరం.


కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): రాజకీయాలు, సినిమా, టెలివిజన్ రంగాల వారికి ప్రోత్సాహకరం. బంధుమిత్రులతో వేడుకల్లో పాల్గొంటారు. భాగస్వామి వ్యవహారశైలి ఆవేదన కలిగిస్తుంది. ఆధ్యాత్మిక, సాహితీ ప్రముఖుల్ని కలుసుకుంటారు.


మీనరాశి: (ఫిబ్రవరి19మార్చి20): వృత్తిపరమైన సమావేశాలు సత్ఫలితాలనిస్తాయి. హోటల్, ఆస్పత్రులు, బ్యాంకులు, సహకార సంఘాల ఉద్యోగులకు ఆర్థికంగా ప్రోత్సాహకరం. విందు వినోదాలకు ఖర్చులు అధికం.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

ముఖ్యమంత్రి ఉదారత్వం విడనాడాలి

శిశుపాలుడు లాంటి జగన్‌పై చర్యలు తీసుకోవాలి ● లేకుంటే దేవుడినే అమ్మేందుకు కుట్ర చేస్తాడు ● రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్ లింగారెడ్డి


విలేఖరులతో మాట్లాడుతున్న లింగారెడ్డి

కడప, సెవెన్‌రోడ్స్ : ముఖ్యమంత్రి చంద్రబాబు అన్ని వేళలా అందరి పట్ల ఉదారంగా వ్యవహరిస్తారు. ఎవరినీ బాధపెట్టడం ఆయనకు ఇష్టముండదు. ఆయన నైజాన్ని తెలుసుకున్న కొందరు పేట్రేగి పోతున్నారు. అందులో ప్రతిపక్ష నేత జగన్ మోహన్ రెడ్డి ముందు వరుసలో ఉంటారు. ఏమన్నా... ఏం చేసినా.. ముఖ్యమంత్రి ఏమీ చేయరన్న ధోరణిలో జగన్ వ్యవహరిస్తూ ప్రజా స్వామ్యాన్ని కించ పరుస్తూ ఏకంగా సీఎంనే చంపాలని పిలుపునిచ్చే స్థాయికి వెళ్ళారు. శిశుపాలుడు లాంటి జగన్ పట్ల ఉదాసీనంగా ఉండాల్సిన అవసరం ఏమాత్రం లేదు. అందుకే ముఖ్యమంత్రి చట్ట రీత్యా జగన్ పై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్ ఎం.లింగారెడ్డి కోరారు. ఆయన శనివారం టీడీపీ జిల్లా కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడారు. శిశుపాలుడు వంద తప్పులు చేశాక శ్రీకృష్ణుడు మరణ శిక్ష విధించారని అయితే జగన్ ఇప్పటికే ఆ సంఖ్యను దాటి పోయారని ఇక ఏ మాత్రం ఉపేక్షించ అవసరం లేదన్నారు. రోజు రోజుకు క్షీణిస్తున్న ఆయన పార్టీ ఉనికిని కాపాడుకునేందుకు కార్యకర్తలను రెచ్చగొట్టేలా ముఖ్యమంత్రిని చంపాలని పిలుపునిచ్చిన ప్రతిపక్ష నేత జగన్ మోహన్ రెడ్డి మాత్రమేనన్నారు. అరెస్టు చేస్తే సానుభూతి వస్తుందని చేయకపోతే తాను పెద్ద నాయకుడని ఫోజులు కొట్టేందుకు జగన్ చేస్తున్న కుట్రను ఇప్పటికైనా ముఖ్యమంత్రి గమనించాలన్నారు. అన్యమతస్తులు తిరుమలలో వేంకటేశ్వరస్వామిని దర్శనం చేసుకోవాలనుకున్నప్పుడు విధిగా అక్కడున్న పుస్తకంలో సంతకం చేయాల్సి ఉంటుందని అలా చేయని జగన్ పదవి కోసం రెండు సంవత్సరాల పాటు యాగం చేయడం హాస్యాస్పదమన్నారు. గోదావరి పుష్కరాలలో స్నానమాచరించి పెద్దలకు పిండ ప్రదానం చేసిన జగన్ తిరుమలలో మాత్రం సంతకం చేయరని పదవి కోసం యాగాలు, స్నానాలు చేస్తారని దీన్ని బట్టి ఆయన తన పదవి కోసం భగవంతుడినే అమ్ముకునేందుకు కూడా వెనుకాడరని స్పష్టమవుతున్నదన్నారు. ఇటువంటి వ్యక్తిని సమాజంలో ఉండనీయడం ఏమాత్రం తగదని వెంటనే కటకటాలపాలు చేయాలని కోరారు. నంద్యాలలో ధర్మం గెలుస్తుందని జగన్ తొలిసారి నిజం చెప్పారని ధర్మం చంద్రబాబు వైపే ఉందని కనుక గెలుపు టీడీపీదేనని ఒప్పుకున్నారన్నారు. మాటకు ముందు జగన్ టీడీపీలో చేరిన వైసీపీ ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలని కోరడం విడ్డూరంగా ఉందని గతంలో టీడీపీ నుంచి ఆకర్ష్ పేరుతో ఆయన తండ్రి ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకున్న సంగతి ఒక సారి గుర్తుకు తెచ్చుకుని మాట్లాడాలన్నారు. జగన్ వ్యాఖ్యల పట్ల ముఖ్యమంత్రి ఇప్పటికి ఉదారంగా వ్యవహరిస్తే ప్రజలలో భయాందోళనలు అధికమవుతాయని జగన్ రాక్షసత్వానికి బలవుతామన్న అనుమానాలు పెరిగి పోతాయని సీఎం వెంటనే చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.హరిప్రసాద్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రెడ్యంవెంకటసుబ్బారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు గన్నెపాటి మల్లేష్, టీడీపీ నేతలు ఆమూరి బాలదాస్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్స్ ఏడీగా ఉష



కడప, ఎర్రముక్కపల్లె : మోడల్ స్కూల్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఎస్.ఉష నియమితులయ్యారు. డీఈవో కార్యాలయంలో శనివారం ఆమె ఏడీగా బాధ్యతలను చేపట్టారు. 1984లో నెల్లూరు డీఈవో కార్యాలయంలో టైపిస్టుగా ఉద్యోగ ప్రవేశం చేశారు. 1989లో సీనియర్ అసిస్టెంట్ పదోన్నతి పొందారు. 2005లో గుంటూరు డీఈవో కార్యాలయం సూపరింటెండెంట్‌గా పదోన్నతి సాధించారు. 2009లో నెల్లూరు సూపరింటెండెంట్‌గా బదిలీపై అక్కడే ఏడీ ప్రమోషన్ పొందారు. ప్రస్తుతం జిల్లా మోడల్ స్కూల్స్ ఏడీగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మోడల్ స్కూల్స్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

తహసీల్దార్లు నిజాయితీగా పనిచేయాలి

రెవెన్యూ అధికారుల సమీక్షలో కలెక్టర్ బాబూరావునాయుడు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాబూరావునాయుడు

కడప, కోటిరెడ్డిసర్కిల్: మండలాల్లో తహసీల్దార్లు నిజాయితీగా పనిచేయాలని కలెక్టర్ బాబూరావునాయుడు పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ శాఖ ద్వారా అందించే సేవల్లో ఎలాంటి పొరబాట్లకు తావివ్వద్దన్నారు. జాయింట్ కలెక్టర్ శ్వేత మాట్లాడుతూ మీ కోసం ద్వారా వచ్చే ఫిర్యాదుల పరిష్కారం కాలేదన్నారు. పట్టాదారు పాస్ పుస్తకాల జారీలో డాక్యుమెంట్లను పరిశీలించి సంబంధించిన వారికి నోటీసులు జారీ చేసి అర్హులని తేలితేనే మంజూరు చేయాలన్నారు. భూముల రిజిస్ట్రేషన్ ఆలస్యంగా ఎందుకు జరుగుతోందని తహసీల్దార్లను ప్రశ్నించారు. క్షేత్ర స్థాయిలో ఇంటి స్థలాల కోసం దరఖాస్తులు వస్తున్నాయని వాటిపై ప్రత్యేక శ్రద్ధ వహించి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ భూములు ఎక్కడైతే ఉన్నాయో మరోసారి పరిశీలించి ఆక్రమణకు గురైన వాటిని రెగ్యులర్ చేసే అంశంపై ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. జిల్లాలో ఫుడ్ పార్క్, విండ్ పార్కుల ఏర్పాటుకు భూసేకరణ విషయమై తహశీల్దార్లను అడిగి తెలుసుకున్నారు. జేసీ-2 శివారెడ్డి, డీఆర్వో నరసింహారావు, కడప, రాజంపేట, జమ్మలమడుగు ఆర్డీవోలు చిన్నరాముడు, వీరబ్రహ్మం, దేవేంద్రరెడ్డి, తహశీల్దార్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎల్‌పీ తెలుగు పదోన్నతుల కౌన్సెలింగ్

ఎల్‌పీల రీకౌన్సెలింగ్ వాయిదా


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఈవో శైలజ

కడప, ఎర్రముక్కపల్లె : లాంగ్వేజీ పండిట్ తెలుగు పదోన్నతుల కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. శనివారం మధ్యాహ్నం జరగాల్సిన లాంగ్వేజీ పండిట్స్ బదిలీల రీకౌన్సెలింగ్ సోమవారానికి వాయిదా పడింది. డీఈవో కార్యాలయంలో ఎల్‌పీ తెలుగు పదోన్నతుల కౌన్సెలింగ్ జరిగింది. శుక్రవారం జరగాల్సిన ఈ కౌన్సెలింగ్ రోస్టర్ సమస్య కారణంగా శనివారానికి వాయిదా పడింది. పాఠశాల విద్యాకమిషనర్ ఆదేశాల మేరకు శనివారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించారు. 29 మందితెలుగు లాంగ్వేజీ పండిట్లకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించారు.

ఎల్‌పీ బదిలీల రీకౌన్సెలింగ్ వాయిదా

లాంగ్వేజి పండిట్ బదిలీల రీకౌన్సెలింగ్ సోమవారం నాటికి వాయిదా పడినట్లు డీఈవో శైలజ తెలిపారు. కడప జడ్పీ ప్రాంగణంలో డీసీఈబీ హాలు, జడ్పీపాత సమావేశ మందిరం రెండు కేంద్రాల్లో నిర్వహిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఏడీ వరలక్ష్మి, ఎంఈవో జాఫర్‌సాదిక్, సీవీ ప్రసాద్, సూపరింటెండెంట్ పాల్గొన్నారు.

జిల్లాలో పలు మండలాల్లో తేలికపాటి వర్షాలు

కడప, ఐటీఐసర్కిల్ : పలు మండలాల్లో శనివారం తేలికపాటి వర్షాలు కురిశాయి. 2.8మి.మీ సరాసరి వర్షపాతం నమోదైంది. అత్యధికంగా పుల్లంపేట 13మి.మీ, చాపాడులో 10.6, ప్రొద్దుటూరులో 10.4, వీఎన్ పల్లెలో, 10.2మి.మీ నమోదైంది. కడపలో 4.2మి.మీ, వల్లూరులో 2.8, పెండ్లిమర్రిలో 3.4, సీకేదిన్నెలో 4.2, చెన్నూరులో 9.6, ఖాజీపేటలో 1.6, కమలాపురంలో 2.4, వీరబల్లిలో 3.6, రామాపురంలో 5, చిట్వేలిలో 4.2, పోరుమామిళ్లలో 5.4, కలసపాడులో 6, కాశినాయనలో 5.2, జమ్మలమడుగులో 5.2, మైలవరంలో 6.4, పెద్దముడియంలో 2.4, మైదుకూరులో 5.4, రాజుపాలెంలో 6.6, లింగాలలో 2.2, తొండూరులో 3.8 మి.మీ వర్షపాతం నమోదైంది.

ఐజీ ఇక్బాల్‌ను కలిసిన టీడీపీ నేతలు


ఐజీ ఇక్బాల్‌తో హరిప్రసాద్ తదితరులు

కడప, సెవెన్‌రోడ్స్: కడప పర్యటనకు వచ్చిన రాయలసీమ ఇన్‌స్పెక్టర్ జనరల్ మహ్మద్ ఇక్బాల్‌ను టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.హరిప్రసాద్, నేతలు సుభాన్ బాషా, జి.నాగరాజు కలిశారు. గతంలో జిల్లాలో మహ్మద్ ఇక్బాల్ పోలీసు అధికారిగా బాధ్యతలు నిర్వర్తించిన సంగతిని గుర్తు చేసుకున్నారు. అసాంఘిక కార్యకలాపాలపై తీసుకుంటున్న చర్యలను వారు ప్రశంసించారు.

తిరుమల సమాచారం

తిరుమలకు వెళ్లి శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు ముందస్తుగా కడప టీటీడీ దేవస్థాన ఈ-దర్శన్ ద్వారా దర్శనం టిక్కెట్లు, వసతి (రూములు) పొందవచ్చు. శనివారం సాయంత్రం 5.30 గంటలకు అందిన సమాచారం మేరకు తిరుమలలో వసతి, దర్శనం టిక్కెట్ల ఖాళీలు ఇలా వున్నాయి.

● రూ.300 దర్శనం టిక్కెట్లు

ఆగస్టు 21న 980, 22న 1610, 23న 1540, 25న 520, 26న 110 టిక్కెట్లు ఖాళీగా వున్నాయి.

● రూ.50 రూములు

ఆగస్టు 24న 56 రూములు ఖాళీగా వున్నాయి.

● రూ.100 రూములు

సెప్టెంబర్ 13న 33, 14న 65, 18న 13, 19న 116, 20న 84 రూములు ఖాళీగా వున్నాయి.

● రూ.500 రూములు

సెప్టెంబరు 12న 5, 13న 27, 14న 31, 18న 46, 19న 47 రూములు ఖాళీగా వున్నాయి.

● రూ.200 రూములు

(శ్రీనివాసం) తిరుపతిలో

ఆగస్టు 23న 10, 24న 11, 28న 5, 29న 5, 31న 19 గదులు ఖాళీగా ఉన్నాయి.

● టీటీడీ కల్యాణమండపాలు బుకింగ్ చేసుకునేందుకు సంప్రదించాల్సిన నెంబరు 9059948220.

టీటీడీ కార్యాలయం పనిచేయు వేళలు

- ప్రతి మంగళవారం సెలవు
- సోమ, బుధ, గురు, శుక్ర, శనివారాల్లో ఉదయం 9 గంటల నుంచి 1 గంట వర కు మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు, ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు తిరిగి మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 7 గంటల వరకు తెరిచి ఉంటాయి. ఆ సమయంలో దర్శనం టిక్కెట్లతో పాటు వసతి కోసం రూములను బుక్ చేసుకోవచ్చు.

గమనిక : ఈదర్శన టిక్కెట్లకు వచ్చే వారు గుర్తింపు కార్డులు తెచ్చుకోవాలి ఆధార్, రేషన్ కార్డు, ఓటర్‌కార్డు, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ తదితర ఏదో ఒక గుర్తింపు కార్డు తెచ్చుకోవాలి.

భజే వాయుపుత్రం

భక్తులతో క్రిక్కిరిసిన గండి క్షేత్రం
సర్వదర్శనానికి 4 గంటలు

చక్రాయపేట: శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా రెండో శ్రావణ శనివారం వాయుపుత్రున్ని వివిధ నామాలతో కీర్తించారు. ప్రముఖ పుణ్యక్షేత్రం గండి భక్తులతో క్రిక్కిరిసింది. స్వామి వారిని దర్శించుకునేందుకు సర్వదర్శనానికి నాలుగు గంటలు, ప్రత్యేక దర్శనానికి రెండు గంటలు పట్టింది. రెండోవారం భక్తులు పోటెత్తారు. దర్శించుకునేందుకు ఆలస్యం అవుతుందని కొందరు భక్తులు ముందు రోజే గండిక్షేత్రం చేరుకున్నారు. సర్వదర్శనం, స్పెషల్ దర్శనం, వీఐపీలకు దర్శనాలు సైతం ఏర్పాటు చేశారు. రాత్రి చేరుకున్న భక్తులతో శనివారం తెల్లవారుజామునే క్యూలైన్లు రద్దీగా కనిపించాయి. పాపాఘ్నిలో స్నానాలాచరించి అంజన్నను దర్శించుకున్నారు. జిల్లా దేవాదాయ శాఖ సూపరింటెండెంట్ వెంకటసుబ్బయ్య, సహాయ కమిషనర్ పట్టెం గురుప్రసాద్, చైర్మన్ రాజారావు, పాలక మండలి సభ్యులు దగ్గరుండి పనులు పర్యవేక్షించారు. క్యూలైన్లలో తాగునీరు, చలువపందిళ్లు వేయడంతో భక్తులకు ఎలాంటి ఇబ్బంది జరగలేదు. అర్చకులు కేసరి, రాజారమేష్‌లు ఆంజనేయస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారు దేదీప్యంగా దర్శనం ఇచ్చారు. పలువురు దాతలు అన్నదానం చేశారు. ఎన్నడూలేని విధంగా ఈ ఏడాది భక్తులు గండికి రావడంతో అంగళ్లకు పండుగ అయింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ రామకృష్ణుడు, ఎస్ఐ గోవిందరెడ్డి, రఘు, లింగాల ఎస్ఐ మల్లికార్జునరెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు. డాక్టర్ జ్వాలాపతి దాదాపు 300 మందికి వైద్యచికిత్స చేశారు. ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు వందమంది గండికి చేరుకుని స్వామి సేవలో తరించారు. పలు వినోద కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. ఎమ్మెల్యే లింగమూర్తి, ఈఈ శ్యాంసుందర్ రెడ్డి, చంద్రమౌళీశ్వరి, జడ్పీటీసీ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, టీడీపీ మండలాధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, అంకిరెడ్డి, రామచంద్రారెడ్డి, అధికారులు, అనధికారులు స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తుల కాలక్షేపం కోసం పలు వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. పాలక మండలి సభ్యులు సుబ్బరాయుడు, వెంకటస్వామి, అంజనరెడ్డి, భాస్కర్, శివశంకర్‌రెడ్డి, పసుపులేటి బాబు, కుళాయప్ప తదతరులు దగ్గరుండి పర్యవేక్షించారు.



తోమాల అలంకరణలో అంజన్న



భక్తులతో కిటకిటలాడిన క్యూలైన్లు

గండి క్షేత్రం మరింత అభివృద్ధి చెందాలి

రాయలసీమలో ప్రసిద్ధిగాంచిన గండి వీరాంజనేయస్వామి దేవస్థానం దినదినాభివృద్ధి చెందుతోందని శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ సతీష్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం సతీష్‌రెడ్డి ఆయన సతీమణి అంజన్నను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సహాయ కమిషనర్ గురుప్రసాద్, చైర్మన్ రాజారావు ఆలయ మర్యాదలతో సత్కరించారు. తిరుమల దేవస్థానం నుంచి దేవాదాయశాఖకు వచ్చే ముందు జీరోబ్యాలెన్స్ ఇచ్చారని, టీటీడీ నుంచి వచ్చిన అనంతరం భక్తుల సహకారంతో దేవస్థానం నిధులతో దినదినాభివృద్ధి చెందుతోందని, వసతి గృహాల్లో మంచాలు, బెడ్లు పూర్తి స్థాయిలో వేయించామని, షాపింగ్ కాంప్లెక్స్, భక్తులకు షెడ్లు వేశామని, మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని, గతంలో పాపాఘ్ని నది ఆనుకుని ఉన్న కొండపై 108 అడుగుల అంజన్న విగ్రహాన్ని కట్టాలని సంకల్పించారు, అదికూడా నిర్మించేందుకు కంకణం కట్టుకున్నామని, స్థలం పరిశీలించాలని ఆదేశించారు. కార్యక్రమంలో, రామచంద్రారెడ్డి, పాలక మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



అంజన్నను దర్శించుకున్న సతీష్‌రెడ్డి

మరుగుదొడ్ల నిర్మాణ లక్ష్యం అధిగమించాలి

● జాప్యం చేస్తే చర్యలు తప్పవు : కలెక్టర్

కడప, కోటిరెడ్డిసర్కిల్ : స్వచ్ఛ భారత్ లో భాగంగా వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణ లక్ష్యాలను అధిగమించాలని కలెక్టర్ బాబూరావునాయుడు సూచించారు. శనివారం స్థానిక కలెక్టరేట్ నుంచి జిల్లాలోని ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వ్యక్తి గత మరుగుదొడ్ల నిర్మాణాల్లో చాల మండలాలు వెనుకబడి నిర్ధేశించిన లక్ష్యం చేరుకోలేదన్నారు. వెనుబడిన వారు ఇప్పటికైనా క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లి లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. మరుగు దొడ్ల నిర్మాణాలు ఏ స్థాయిలో ఉన్నవి, వారి దరఖాస్తులు పరిశీలించి పొరబాట్లు లేకుండా జియోట్యాగింగ్ చేయించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ సమయంలో మండల అధికారులు అప్రమత్తంగా ఉండి కలెక్టర్, జేసీ ఇచ్చే సూచనలు, సలహాలు, ఆదేశాలను ఆలకించి క్షేత్ర స్థాయిలో పనులు చేపట్టాలన్నారు. సమావేశాలకు సరైన నివేదికలు తీసుకురాకుండా హాజరు కావడాన్ని పరిశీలిస్తే వారి నిర్లక్ష్యానికి నిదర్శనంగా చెప్పవచ్చన్నారు. మరుగుదొడ్ల నిర్మాణ లక్ష్యం ఛాలెంజ్‌గా తీసుకుని రెండు రోజుల్లో లక్ష్యం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. జేసీ శ్వేత తెవతీయ మాట్లాడుతూ డేటా ఎంట్రీ ఆపరేటర్లు లేరనే సాకులు చెప్పకుండా ప్రతి రోజు ప్రగతి నివేధికను ఆన్ లైన్ డేటాలో నమోదు చేయాలన్నారు. ఇందులో ఎలాంటి ఆలస్యానికి తావులేదన్నారు. కింది స్థాయి సిబ్బందికి ఎలాంటి సెలవులకు అనుమతి ఇవ్వకుండా పనులు చేపట్టి లక్ష్యం చేరుకోవాలన్నారు. ఈ విషయంలో తొందర పడి తప్పులకు ఆస్కారం ఇవ్వరాదన్నారు. ఈ సమావేశంలో జడ్పీ డిప్యూటీ సీఈవో ఖాదర్‌బాష, ఆర్ డబ్ల్యూఎస్ ఎస్ఈ సంజీవరావు, డ్వామా పీడీ విజయకుమార్, సీపీవో తిప్పేస్వామి, హౌసింగ్ పీడీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగలను మరిచిన చంద్రబాబునాయుడు

బ్రహ్మంగారిమఠం : సీఎం చంద్రబాబునాయుడు మాదిగలను మరిచాడని, ఈ ఫలితం వచ్చే ఎన్నికల్లో ప్రభావం చూపుతుందని జిల్లా యువసేన ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఎస్.ఆర్‌క్రిష్ణ ఫీఠర్‌లు పేర్కొన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయం వద్ద రిలేదీక్షలు 6వ రోజు కు చేరుకున్నాయి. ఈ సందర్భంగా దీక్షలను ఉద్దేశించి ఎమ్మార్పీఎస్ నేతలు మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీవర్గీకరన బిల్లుకు చట్టబద్దత కల్పించాలని, అలాగే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే ముఖ్యమంత్రి నెరవేర్చాలని వారు కోరారు. కార్యక్రమంలో చెండ్రాయుడు, చెన్నయ్య, ఓబులేసు, రమణ, ప్రసాద్, బాలచెన్నయ్య, సీపీఎం చెండ్రాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాడిపశువులకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వై.క్రిష్ణయ్య


వై. క్రిష్ణయ్య

బ్రహ్మంగారిమఠం : మండలంలోని పాడి పశువులకు మెరుగైన వైద్యం అందించడే పశుసంవర్ధకశాఖ లక్ష్యమని ఆశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వై.క్రిష్ణయ్య పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పశుపోషణకు సంబంధించి పలు విషయాలను వెల్లడించారు.

ప్రశ్న : బి.మఠంలో ఉద్యోగ బాధ్యతలు ఎప్పుడు చేపట్టారు ?

జ : మే 15, 2017లో బాధ్యతలు చేపట్టాను.

ప్రశ్న: ముఖ్యంగా పశువులకు వచ్చే జబ్బుల గురించి వివరించండి ?

జ : పశువులకు ప్రధానంగా పారుడురోగం వస్తుంటుందని, దీనికి పశుయజమానులు ముందస్తు జాగ్రత్త మేరకు పశువైద్యాధికారిన సంప్రదించి టీకాను వేయించుకున్నట్లు అయితే వ్యాధిని నివారించవచ్చు.

ప్రశ్న: నట్టల నివారణ మందు గురించి తెలపండి ?

జ : నట్టల నివారణ మందు ముఖ్యంగా మేకలు, గొర్రెలకువేయించుకోవాలి. గత నెలలో 2,2150 గొర్రెలకు, 5,557 మేకలకు గ్రామాలకు వెళ్లి నట్టల నివారణ మందును తాపించాం.

Interview ఇంటర్వ్యూ

ప్రశ్న: రైతులకు గడ్డి క్షేత్రాలను గురించి తెలపండి ?

జ : ప్రస్తుతం ప్రభుత్వం నుంచి సబ్సిడీ రూపంలో రైతులకు గడ్డి క్షేత్రాలు పెంపొందించేందుకు అవకావం ఉంది. ఇప్పటి వరకు 57మంది రైతులు, 79ఎకరాల గడ్డిక్షేత్రాలను పెంచుకోవడానికి దరఖాస్తు చేసుకున్నారు. త్వరలోనే ఆభూముల్లో జియోట్యాగ్ వేసిన వెంటనే గడ్డిక్షేత్రాలను రైతులు పెంచుకోవచ్చు.

ప్రశ్న : పాడి గేదెలను ఏమైనా పంపిణీ చేశారా ?

జ : ఇప్పటి వరకు పాడి గేదెలను పంపిణీ చేయలేదు. అయితే గతంలో ఎస్సీ, బీసీ కార్పొరేషన్ రుణాల కింద పాడి గేదెలను కోరుకున్నవారికి బ్యాంకు అధికారులతో చర్చించి పంపిణీ చేస్తాం.

ప్రశ్న : గడ్డి జొన్న విత్తనాలను పంపిణీ చేశారా ?

జ : గడ్డి జొన్న విత్తనాలను గతంలో రైతులకు పంపిణీ చేశాం. కావాల్సిన రైతులకు కూడా పంపిణీ చేస్తాం. ఒక్క ప్యాకెట్ ధర ప్రభుత్వ సబ్సిడీతో రూ. 75చెల్లించి పొందాలి.

ప్రశ్న: రాబీస్‌టీకా అందుబాటులో ఉందా ?

జ : పశువులకు కుక్కలు కరిచిన వెంటనే రాబిస్‌టీకా వేయాలని, అయితే, ప్రస్తుతం టీకా అందుబాటులో లేదని అధికారులతో చర్చించి వ్యాక్సిన్ ను తెప్పిస్తాం.

ప్రశ్న: సిబ్బంది కొరత ఏమైనా ఉందా ?

జ : ప్రస్తుతం వెటర్నరీ అసిస్టెంట్, అటెండర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వెంటనే భర్తీ చేస్తే రైతులకు సేవలు అందించేందుకు సులభంగా ఉంటుంది.

రోడ్డు ప్రమాద బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ


బాధితులను పరామర్శిస్తున్న రఘురామిరెడ్డి

మైదుకూరు : నంద్యాలలో జరిగిన వైయస్ జగన్ బహిరంగ సభకు వెళ్లి తిరిగి వస్తూ రోడ్డు ప్రమాదానికి గురై, కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి శనివారం సాయంత్రం పరామర్శించారు. గౌరిగోపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చాపాడు మండలం చిన్నగురువలూరుకు చెందిన బోరెడ్డి శివశంకర్‌రెడ్డి, ఖాజీపేట మండలం మిడుతూరుకు చెందిన వెన్నపూస ఓబుళరెడ్డిలను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో ఆరాతీశారు. మెరుగైన వైద్యం అందించాలని కోరారు. పార్టీ అండగా ఉంటుందని, ధైర్యంగా ఉండాలని బాధితులతో అన్నారు. రఘురామిరెడ్డి వెంట పార్టీ నాయకులు మదీనా దస్తగిరి, శంకర్‌రెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, నాగసుబ్బారెడ్డి తదితరులున్నారు.

అంజన్నకు శ్రావణశోభ



ప్రత్యేక అంలంకారంలో వీరాంజనేయస్వామి, వెంకటేశ్వరస్వామి

ఖాజీపేట: శ్రావణమాసం సందర్భంగా మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాలు శనివారం ముస్తాభయ్యాయి. కె.సుంకేసుల, ఆంజనేయకొట్టాలు, చెముళ్లపల్లె, తదితర గ్రామాలలో ఆంజనేయస్వామికి ఆకుల దండతో ప్రత్యేకంగా అలంకరించారు. అంజన్న దర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో తరళివచ్చారు. స్వామి వారికి కాయ కర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందించారు.

వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

ఖాజీపేట వక్కిలేరు సమీపంలో వెలసిన లక్ష్మీ వేంకటేశ్వరస్వామికి శ్రావణ శోభతో ఆలయ ప్రాంగణం విద్యుత్ దీపాలతో అలంకరించారు. స్వామి వారికి ప్రత్యేకంగా అలంకరించడంతో భక్తులు స్వామివారిని చూసి భక్తి పారవశ్యంతో పూజించారు. వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందించారు.

బడి రుణం ద్వారా పాఠశాలకు సామగ్రి


విద్యార్థులకు టై,బెల్టులు అందచేస్తున్న మండల విద్యాధికారి పద్మ

మైదుకూరు : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రచించిన బడి రుణం తీర్చుకుందాం కార్యక్రమం సత్ఫలితాలనిస్తోంది. మన ఊరు మన బడి అనే నినాదంతో ప్రభుత్వ పాఠశాలలకు మౌలిక వసతులు సమకూరుతున్నాయి. ఈకార్యక్రమం ద్వారా మున్సిపల్ పరిధిలోని సరస్వతీపేట ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థులు కూర్చునేందుకు బల్లలు, విద్యా సామగ్రి సమకూరింది. గ్రామానికి చెందిన తవ్వా నారాయణరెడ్డి రూ.10వేలు, తాటి వెంకటేశ్వర్లు రూ.4 వేలు, చక్రాంతం అపర్ణ 2,500, శీలం బుట్టాగాండ్ల నాగనాదం 2,500, చాగంరెడ్డి శేషారెడ్డి 2 వేలు, తాటి సుబ్బరాయుడు వెయ్యి రూపాయలు విరాళంగా ప్రకటించడంతో పాఠశాలలో బల్లలు సమకూర్చారు. అలాగే అవలి పార్వతి ఓ సీలింగ్ ఫ్యాను అందచేశారు. కాగా 5వ తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రతి ఏడాది రెండు వేలు ఇస్తున్నట్లు తాటి సుబ్బరాయుడు హామీ ఇచ్చారు. ఈసందర్భంగా శనివారం సాయంత్రం మండల విద్యాధికారి పద్మావతి ఆధ్వర్యంలో కార్యక్ర మం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు టైలు, బెల్టులు అందచేశారు. బడి రుణం కింద చందాలు ఇచ్చిన వారిని ఉపాధ్యాయులు సత్కరించారు.

మతిస్థిమితం లేని మహిళ అదృశ్యం



మైదుకూరు : మున్సిపల్ పరిధిలోని చిన్నయ్యగారిపల్లెకు చెందిన సరస్వతి(38) అనే మహిళ కనిపించడం లేదంటూ ఆమె భర్త లింగారెడ్డి మైదుకూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సరస్వతికి కొన్నేళ్ళుగా మతి స్థిమి తం లేక ఇంటి వద్దే ఉండేది. అయితే తరు చూ పొలం వద్దకు కూడా వెళుతుం డే దని, అయితే గురువారం మధ్యాహ్నం నుంచి కనిపించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా ఆమె ఆచూకీ లభిస్తే 9666783003కి లేదా సీఐ వెంకటేశ్వర్లు 9440077990కు ఫోన్ చేయాలని ఆయన కోరారు.

ట్రాక్టర్‌ఇంజన్ పై నుంచి పడి డ్రైవర్ మృతి

బ్రహ్మంగారిమఠం : ట్రాక్టర్ ఇంజన్ పై నుంచి అదుపుతప్పి కిందపడి మందల చెన్నయ్య అనే డ్రైవర్ మృతి చెందినట్లు ఎస్ఐ నాగరాజు పేర్కొన్నారు. మండలంలోని దిరసవంచె గ్రామానికి చెందిన చెన్నయ్య ఉదయం ట్రాక్టర్ డ్రైవర్‌గా వెళ్లి రాళ్లలోడుతో వస్తుండగా, రోడ్డు గుంతలమయం కావడంతో అదుర్లకు ప్రమాదవశాత్తు ఇంజన్ పై నుంచి కిందపడ్డాడు. అక్కడే ఉన్న గ్రామస్థులు వెంటనే 108 వాహనంలో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్యతోపాటు ముగ్గురు కుమారులు ఉన్నారు. ప్రభుత్వసాయం అందివ్వాలని కుటుంబసభ్యులు కోరారు.

అక్రమంగా పంటలు సాగుచేసేవారిపై కేసులు పెట్టాలి

బ్రహ్మంగారిమఠం : మండలంలోని సోమిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీలో ఇటీవల సీపీఎం మండలకమిటీ ఆధ్వర్యంలో సీటీపాయ భూముల్లో భూపోరాటం చేసింది విదితమే. అయితే పేదలకు చెందాల్సిన భూమి లో అక్రమంగా పంటలను సాగు చేస్తున్నవారిపై రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ కార్మికసంఘం నాయకులు జి.శివకుమార్ పేర్కొన్నారు. అందులో భాగంగానే శనివారం సుందరయ్యభవనం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నాను ఉద్దేశించి శివ కుమార్ మాట్లాడుతూ పేదలకు కేటాయించిన భూములను భూఆక్రమణదారులు సాగు చేసుకోవడం మంచిపద్దతి కాదన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి పేదలందరికీ భూములను పంపిణీ చేయాలని డిప్యూటీ తహసీల్దార్, మధుసూదన్ రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ ధర్నాలో సీపీఎం మండల కార్యదర్శి గురివిరెడ్డి, సి.గుర్రయ్య, ప్రసాద్, భాస్క ర్, ఓబులేసు, సాయి, మేరి, లక్షుమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులతోనే విద్యార్థులకు విజ్ఞానం


శాంతిని సన్మానిస్తున్న గ్రామస్థులు

చాపాడు: ఉపాధ్యాయులు బోధించే పాఠాలు వలనే విద్యార్థులకు జ్ఞానం పెరుగుతుందని సర్పంచ్ రామ్మోహన్ అన్నారు. పల్లవోలు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న శాంతి అనే ఉపాధ్యాయురాలు గోపవరానికి బదిలీ అయింది. ఈ సందర్భంగా ఆమెను శనివారం గ్రామస్థులు, విద్యార్థులు శాలువాలు కప్పి పూలమాలలతో సన్మానించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ ఉపాధ్యాయురాలు శాంతి గత 8 ఏళ్లుగా ఇక్కడే పనిచేస్తూ గ్రామంలో విద్యాపరంగా అభివృద్ధికి కృషి చేసిందన్నారు. విద్యార్థులను తమ పిల్లల్లాగా చూసుకుని విద్యాబుద్ధులు నేర్పించిందన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ

ప్రొద్దుటూరు టౌన్: ఎట్టకేలకు మున్సిపల్ పాఠశాలలో చదివే విద్యార్థులకు శనివారం తెలుగు మీడియం పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. పట్టణంలో 25 మున్సిపల్ ప్రాథమిక, 9 మున్సిపల్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. పాఠశాలలు ప్రారంభమై 55 రోజులు దాటినా తెలుగుమీడియం పుస్తకాలు పంపిణీ చేయలేదు ఇంగ్లీషుమీడియం అమలులో భాగంగా తెలుగుమీడియం పుస్తకాలను ప్రభుత్వం పంపిణీ చేయలేదు. యూనిట్ పరీక్షలు ప్రారంభం కావడంతో మున్సిపల్ విద్యార్థులు ఆందోళన చేపట్టారు. దీనితో స్పందించిన ప్రభుత్వం పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసింది. 8 ఉర్దూ పాఠశాలలు మినహాయించి 26 పాఠశాలలకు 8,232 పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు.

ఆక్రమిస్తే అడిగేదెవరు?

అక్రమ సంపాదనకు అన్నీ అర్హమే. జానెడు సర్కారు స్థలం కనిపిస్తే చాలు కాజేసి కాసులు రాల్చుకుంటున్నారు కబ్జాకోరులు.. ఏది విలువైన ప్రాంతమో పసిగట్టి అక్కడ పాగా వేస్తారు. వీలైనంత ఆక్రమించి ఆస్తులు సంపాదిస్తున్నారు. వ్యాపారం చేసుకుంటూ విచ్చలవిడిగా దోచుకుంటున్నారు. మరికొందరు ఇంకొక్క అడుగు ముందుకేసి గదులు నిర్మించి అద్దెకివ్వడం, ఏకంగా అమ్మేసి సొమ్ముచేసుకోవడం అలవాటై పోయింది. ఇదే తంతు జరుగుతోంది ప్రొద్దుటూరు మార్కెట్లో.. అయినా అధికారులు కిమ్మనకుండా ఉన్నారంటే కారణమేమిటో...



సైకిల్ స్టాండ్ స్థలంలో షెడ్లు వేసి ఆక్రమించిన దృశ్యం



మార్కెట్‌లోకి వెళ్లే ద్వారం వద్ద అక్రమంగా నిర్మించిన గదులు



మార్కెట్ వెలుపల మున్సిపల్ స్థలంలో ఆక్రమించి నిర్మించిన గది

ప్రొద్దుటూరు అర్బన్: మున్సిపల్ మార్కెట్ స్థలాల్లో యథేచ్ఛగా ఆక్రమణలు జరుగుతున్నాయి. మున్సిపాలిటీ స్థలాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పణంగా అప్పజెప్పి అవినీతికి పాల్పడే అధికారులకు ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పెట్టింది పేరుగా ఖ్యాతికెక్కింది. మార్కెట్ ఎంట్రెన్స్‌లో రోడ్డుపై నాలుగు గదులను ప్రైవేటు వ్యక్తులే నిర్మించుకుని బాడుగలకు ఇచ్చుకున్నారు. ఈ గదుల నుండి నెలకు రూ.20 వేలు బాడుగలు వస్తున్నట్లు సమాచారం. ఈ గదులను కొందరు మున్సిపల్ రెవెన్యూలో ఉన్న అధికారులు అవినీతికి పాల్పడి అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించినట్లు విమర్శలు ఉన్నాయి. దీనికితోడు మార్కెట్‌కు వినియోగదారుల కోసం సైకిల్ స్టాండ్ స్థలం ఉండేది. ఆ స్థలంలో కూడా కొందరు షెడ్లు నిర్మించి ఆక్రమించారు. ఆ షెడ్లలో సరుకులు నిలువ పెట్టుకుంటున్నారు. షెడ్ల నిర్మాణంలో కూడా కొందరు రాజకీయ నేతలు సిఫార్సులతో, మున్సిపల్ అధికారుల అవినీతితో సైకిల్‌స్టాండ్‌కు స్థలం లేకుండా ఆక్రమణలకు గురైంది. ఈ షెడ్లకు కేవలం ఆక్రమణ ఫీజు వసూలు చేస్తూ మున్సిపల్ అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. మార్కెట్ వెలుపలకు ఉన్న స్థలాల్లో ఏకంగా ఆర్‌సీస్లాబ్ గదిని అక్రమంగా నిర్మించి టీస్టాల్ నిర్వహిస్తున్నారు. ఈ గదికి ఎటువంటి బాడుగ వసూలు చేయడం లేదు కేవలం ఆక్రమణ ఫీజు మాత్రమే చెల్లిస్తున్నట్లు సమాచారం. ఇదే పద్ధతిలో మార్కెట్‌లో చాలా షెడ్లు కేవలం ఆక్రమణ ఫీజులు చెల్లిస్తూ వేలాది రూపాయల బాడుగలు మున్సిపాలిటీకి రాకుండా ఆదాయానికి గండికొడుతున్నారు.

● మార్కెట్ పేరుకే మున్సిపాలిటీ

అక్కడున్న వ్యాపారులంతా ఆ స్థలాలు తమ సొంత ఆస్తులుగా నిర్మాణాలు చేపట్టడం, బాడుగలకు ఇచ్చుకోవడం, విక్రయాలు చేసుకోవడం జరుగుతుంది. మార్కెట్ అక్రమార్కుల చేతుల్లో ఉం డటం వల్లే ఆధునికీకరణను వ్యతిరేకిస్తున్నారు. మార్కెట్‌ను ఆధునికీకరిస్తే తమ అక్రమ కట్టడాలు, వసూళ్లు విక్రయాలు నిలిచిపోతాయని మార్కెట్ రాజకీయాలకు వేదికగా కూడా చే శారు. దీంతో మున్సిపాలిటీకి ఏడాదికి రూ.కోట్లలో ఆదాయం నష్టం వాటిల్లుతుంది. కొత్తగా వచ్చిన కమిషనర్ శేషన్న మార్కెట్‌ను పరిశీలించి నెలలు కావస్తుంటే కానీ ఆయన మొదలుపెడుతానన్న మార్కెట్ ప్రక్షాళన ఒక్క అడుగు కూడా ముందుకు సాగడంలేదు.

అవీ.. ఇవీ

క్రీడల్లో మున్సిపల్ విద్యార్థినుల ప్రతిభ

ప్రొద్దుటూరు అర్బన్: క్రీడలలో మున్సిపల్ విద్యార్థినులు ప్రతిభ చాటుతున్నారు. లాంగ్‌జంప్ పోటీల్లో వైవీఎస్ మున్సిపల్ గర్ల్స్ హైస్కూలు విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బాలికల విద్యను ప్రోత్సహిం చడంతోపాటు క్రీడల్లోనూ ఆ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరుస్తున్నారు. గురువారం బాషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో లాంగ్‌జంప్‌లో అండర్-14లో మొదటిస్థానంలో అనిత, రాణి (9వ తరతి), సెకండ్‌ప్లేస్ 100 మీటర్లలో రాణి (9వ తరగతి), 600 మీటర్లలో అనిత ద్వితీయస్థానం సాధించింది. హైజంప్‌లో నాగేశ్వరి మొదిస్థానం సాధించింది. అండర్-16 విభాగంలో 400 మీటర్ల రన్నింగ్‌లో జ్యోతి ప్రియ మొదటిస్థానం, మల్లేశ్వరి రెండవస్థానం సాధించింది. 800 మీటర్లలో జ్యోతిప్రియ రెండవ స్థానం, వరలక్ష్మి మూడవస్థానం సాధించింది. షాట్‌పుట్‌లో లక్ష్మిదేవి, లాంగ్‌జంప్‌లో చాంద్‌బీ, 100 మీటర్లలో చాంద్‌బీ, 400 మీటర్లలో వరలక్ష్మిలు రెండవస్థానం సాధించారు. అండర్-14, 16 విభాగాల్లో మొత్తం 13 ప్రైజ్‌లు సాధించారు. వీరు ఈనెల 19, 20, 21 తేదీల్లో ఆర్‌సీపీఈ కళాశాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులను చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, హెచ్‌ఎం కాశీప్రసాదరెడ్డి అభినందించారు.

భారతీయ సంస్కృతికి ప్రతీక రక్షాబంధన్



రఘురామిరెడ్డికి రక్షా బంధన్ కడుతున్న బ్రహ్మకుమారీలు

ప్రొద్దుటూరు అర్బన్: భారతీయ సంస్కృతి, సాంప్రదాయ విలువలకు రక్షాబంధన్ ప్రతీకగా నిలుస్తుందని మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో ఓంశాంతి బ్రహ్మకుమారి బి.కె. శాంత, భాగ్యలక్ష్మిలు మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డికి రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బి.కె.శాంతి మాట్లాడుతూ శ్రావణ పౌర్ణమి సందర్భంగా రాక్షాబంధన్ వేడుకలను బ్రహ్మకుమారీలు ప్రారంభించారన్నారు. ఓంశాంతి సభ్యులు వాసు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

ప్రొద్దుటూరు టౌన్: భావితరాల భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని పశువైద్య కళాశాల విద్యార్థులు పేర్కొన్నారు. శ్రీ వెంకటేశ్వర పశువైద్య కళాశాలకు చెందిన చివరి సంవత్సరం ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ విద్యార్థులు పిడుగురాళ్లపల్లెలో వనం-మనంలో భాగంగా 400 మొక్కలు నాటారు. నగరిలో అపరిశుభ్రతను తొలగించి శుభ్రం చేశారు. అనంతరం మండల ప్రాథమిక పాఠశాలలో పాఠశాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పరిశుభ్రతకు తీసుకోవాల్సిన చర్యల గురించి ప్రొజెక్టర్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఇందిర, చరిత, లత, సుమిరన్, భరద్వాజ్, రాజు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో తల్లీబిడ్డ క్షేమం

ప్రొద్దుటూరు టౌన్: పౌష్టికాహారంతో తల్లీబిడ్డ క్షేమంగా ఉంటారని అర్బన్ సీడీపీవో రాజేశ్వరిదేవి పేర్కొన్నారు. వైఎంఆర్ కాలనీ అరవింద ఆశ్రమంలోని అంగన్వాడీ సెంటర్‌లో సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో కోడిగుడ్డు, పౌష్టికాహారం అందిస్తామని, బాలింతలు, గర్భిణీలు రోజు అంగన్వాడీ కేంద్రానికి వచ్చి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు.

పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న చైర్మన్ రఘురామిరెడ్డి

ప్రొద్దుటూరు అర్బన్: పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ప్రతి ఇంటిలోనూ మొక్కలను నాటాలని మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం టుటౌన్ బైపాస్‌రోడ్డుకు ఇరువైపుల మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో రెండు వేల మొక్కలు పెంచాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. మొక్కల పరిరక్షణ కోసం ట్రీగార్డులు కూడా తెప్పించామన్నారు. మొక్కలను సంరక్షించి నీళ్లు అందించాలని కోరారు. దీనికోసం ప్రత్యేక సిబ్బంది నియమిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంట్ డీఈ రాజేష్, హార్టికల్చరల్ ఆఫీసర్ సురేంద్ర, టీడీపీ నాయకులు చిన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీలకు ఆర్టీపీపీ డీఏవీ విద్యార్థుల ఎంపిక



ఎర్రగుంట్ల: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ మీట్‌కు ఆర్టీపీపీ డీఏవీ విద్యార్థులు ఎంపిక అయ్యారు. ఈనెల 19,20,21 తేదీలలో ప్రొద్దుటూరులోని ఆర్‌సీపీఈలో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ టోర్నమెంటుకు పాఠశాల నుంచి నాగనవీన, శ్రీచరణి, చందన, సుష్మా, తనూజ, దనలక్ష్మి, నిఖిల్‌కుమార్, రవికాంత్‌రెడ్డి ఈటోర్నమెంటుకు ఎంపిక అయినట్లు పీఈటీ నరేష్‌లు తెలిపారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసన్, పీఈటీ నరేష్‌లు శనివారం జరిగిన కార్యక్రమంలో వారిని అభినందించారు.

అంజన్నకు ప్రత్యేక పూజలు



పుష్పాలంకరణలో ఆంజనేయస్వామి

ప్రొద్దుటూరు టౌన్: శ్రావణ శనివారం సందర్భంగా స్థానిక పాత మార్కెట్‌లోని ఆంజనేయస్వామి గుడిలో స్వామివారికి శనివారం విశేషపూజలు నిర్వహించారు. తెల్లవారు జాము నుండి స్వామివారికి పంచామృతభిషేకం, క్షీరాభిషేకం, విశేష పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని గజమాలలు, ఆకు, తులసి, వడమాలలతో అలంకరించారు. పూజలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని కాయాకర్పూరం సమర్పించారు.

శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలి

కడప, కోటిరెడ్డిసర్కిల్ : యువత నైపుణ్య శిక్షణ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ బాబూరావునాయుడు అన్నారు. డ్రిప్ పరికరాల అమరికపై ఇచ్చిన శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.శనివారం సాయంత్రం డీఆర్‌డీఏ సాంకేతిక శిక్షణ అభివృద్ధి కేంద్రంలో డ్రిప్‌పరికరాల అమర్చే వృత్తిపై శిక్షణ పొందిన 29 మంది యువతతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. క్షేత్రస్థాయిలో కంపెనీలు 20రోజుల పాటు డ్రిప్ పరికరాల అమరికపై ప్రాక్టికల్‌గా శిక్షణ ఇచ్చి వారి కంపెనీలో ఉద్యోగావకాశాలు కల్పిస్తాయన్నారు. రాష్ట్రప్రభుత్వం సూక్ష్మనీటిసేద్యంపై భారీ ఎత్తున ఖర్చుపెడుతోందన్నారు.విద్యార్థులకు సర్టిఫికెట్లను అందించారు. సూక్ష్మనీటిసాగు పథక సంచాలకుడు మధుసూదన్ రెడ్డి, జేడీఎం హరిప్రసాద్, శిక్షకులు కిరణ్, మస్తాన్ , పెంచలయ్య పాల్గొన్నారు.

జిల్లాకు ఆశాదీపం ఉక్కు ఫ్యాక్టరీ

కడప, అర్బన్ : ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం నిరుద్యోగుల పాలిట ఆశాదీపం లాంటిదని శారద విద్యాసంస్థల అధినేత నరసింహులు అన్నారు. ఉక్కు పోరాట సమితి చేపట్టిన దీక్షలు శనివారం 30వరోజుకు చేరాయి. దీక్షల్లో సుధీర్, రామాంజులు, మూర్తి, నరసింహులు, ఆంజనేయులు, జయమ్మ, ఓబులేసు, వెంకటలక్ష్మీ, లక్ష్మీదేవి, శివమ్మ, ఓబులేసు, నాగరాజు, నాగయ్య, శివయ్య పాల్గొన్నారు.

రద్దు చేసిన రేషన్ కార్డులకు సెప్టెంబరులో నిత్యావసరాలు పంపిణీ

కడప, వినాయకనగర్ : ఇంటిపన్ను చెల్లించని రేషన్ కార్డుదారులను అనర్హులుగా గుర్తించి రేషన్ కార్డు రద్దు చేయబడిన వారికి తిరిగి సెప్టెంబరులో పంపిణీ చేస్తామని జిల్లా పౌరసరఫరాల అధికారిని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

'ఆ చికెన్ సెంటర్లను తొలగించండి'

కడప ఐటీఐసర్కిల్: వ్యాధులకు కారణమవుతున్న చికెన్ సెంటర్లను తీసివేయాలని మాలమహానాడు జూపూడి వర్గం జిల్లా అధ్యక్షుడు వెంకటన్న డిమాండ్‌చేశారు. నగరంలో శనివారం సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎర్రముక్కపల్లె, కందిపాలెంలో ఉన్న చికెన్ సెంటర్లతో ఆ ప్రాంత ప్రజలు, పిల్లలు వ్యాధుల బారిన పడుతున్నారని అధికారులు వాటిని తొలగించాలన్నారు.

విద్యుతన్ నగర్‌లో సమస్యల తిష్ఠ

రోడ్లకు నోచుకోని వీధులు ● అధ్వానంగా డ్రైనేజీలు ● పట్టించుకోని నాయకులు, అధికారులు



పిచ్చిమొక్కలతో నిండిన కెనాల్



రోడ్డు మధ్యలో ఉన్న చెత్త



మట్టిరోడ్డు

కడప, రవీంద్రనగర్ : కడప నగరం శివారు ప్రాంతాలు సమస్యలకు అడ్డాగా మారాయి. అడుగడుగున సమస్యలు అసౌకర్యాలు తాండవిస్తున్నాయి. విద్యుతన్ నగర్ ఏర్పడి దాదాపు 20 సంవత్సరాలు కావస్తోంది. అయినప్పటికీ మౌలిక సదుపాయాలు మాత్రం మరుగున పడ్డాయి. అక్కడ వందల కుటుంబాలు నివాసాలుంటున్నాయి. సకాలంలో పన్నులు చెల్లిస్తున్నప్పటికీ అధికారులు కనీస సదుపాయాలు కూడా చేకూర్చలేకపోతున్నారు. దెబ్బతిన్నరోడ్లు, సిమెంటు రోడ్లకు నోచుకోని మట్టిరోడ్లు, అస్తవ్యస్తంగా ఉన్న మురుగు వ్యవస్థ ఇలా కాలనీ మొత్తం అసౌకర్యాల నడుమ కొట్టుమిట్టాడుతోంది. పైగా ఈ కాలనీ వర్షం వస్తే రోడ్లన్నీ బురదబురదగా ఉంటాయి. కేసీ కాలువ దగ్గర రోడ్డు చాలా ఇరుకుగా ఉంది. కేసీ కాలువకు ఫెన్సింగ్ లేనందువన కొంచెం ఏమరపాటు అయితే కెనాల్‌లో పడాల్సిందే. కొన్ని వీధుల్లో మట్టిరోడ్లు కావడంతో స్థానికులు నరకయాతన అనుభవిస్తున్నారు.కొన్ని చోట్ల చెత్త కేసీ కెనాల్ రోడ్డు దగ్గర స్థానికులు వేస్తున్నారు. గాలికి కొట్టుకుని పోయి కెనాల్‌లో పడుతోంది. రోడ్డులో వేయడం తో చెత్త కుళ్లి భరించరాని వాసన వస్తోంది. పారిశుధ్య కార్మికులు క్లీన్ చేయడం లేదు. రోడ్డున పోయే స్థానికులు వాహనదారులు, పాదచారులు వాసనకు ముక్కు మూసుకుని వెళ్ళాల్సి వస్తోంది. నాయకులు ఓట్ల కోసమే కాకుండా సమస్యలను కూడా పట్టించుకుని సిమెంటు రోడ్లను కెనాల్ దగ్గర ఉండే ఇరుకు రోడ్డుకు బ్రిడ్జి వేయాలని లేక పోతే ప్రమాదాలు జరిగే అవకాశలు ఉన్నాయని స్థానికులు కోరుతున్నారు.

రోడ్లు అధ్వానం...



విద్యుతన్ నగర్‌లో ఎక్కడా సిమెంటు రోడ్లు లేవు. కొన్ని చోట్ల గుంతలు పడి మట్టి రోడ్లుపైనే వెళ్ళాల్సి వస్తోంది. వర్షాకాలం చిన్నపాటి వర్షం కురిస్తే రోడ్లన్ని బురదమయంగా ఉంటాయి. సిమెంటు రోడ్లు వేస్తే సమస్య ఉండదు. కాగా కేసీ కెనాల్‌దగ్గర ఉన్న మలుపులో వాహనం అదుపు తప్పితే కెనాల్‌లో పడిపోవాల్సిందే. కేసీ కెనాల్‌కు బ్రిడ్జి నిర్మించాలి.

● రాజేష్, దుకాణాదారుడు

సీడీసీ అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి

కడప, వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం అనుభవ డిగ్రీ కళాశాలలకు అప్లికేషన్ ఇచ్చేటప్పుడు వర్సిటీ సీడీసీ అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాని రాయలసీమ విద్యార్థి వేదిక నగర కన్వీనర్ గంగరాజు ఒక ప్రకటనలో తెలిపారు.

కార్మిక పోరాటాలకు సన్నద్ధమవుదాం

కడప అర్బన్ : రాష్ట్రంలో కేంద్రంలో కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న ప్రభుత్వాలకు వ్యతిరేకంగా కార్మికులు పోరాటాలకు సమరశంఖం పూరించి సన్నద్ధమవుదామని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి హరిక్రిష్ణ, జిల్లా కార్యదర్శి నాగసుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ కార్యాలయంలో శనివారం జిల్లా ఆఫీసు బేరర్స్ సమావేశం జిల్లా కార్యదర్శి సుబ్బరాయుడు అధ్యక్షత జరిగింది. ముఖ్యఅతిథులుగా వారు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వాలు కార్మికులకు చెప్పినదానికి చేస్తున్నదానికి ఎక్కడా పొంతన లేదన్నారు. కార్మికులు పెద్దఎత్తున ఆందోళనకు సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఆఫీస్ బేరర్లు సుబ్బారెడ్డి, బాదుల్లా, వేణుగోపాల్, మంజుల, జీవయ్య, బాష, శ్రీనివాసులు, మల్లికార్జున, గంగావతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు

'వైవీయూ భూములను పరిరక్షిస్తాం'

కడప, వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం భూములను కబ్జాకు గురికాకుండా పరిరక్షిస్తామని వైవీయూ పాలక మండలి సభ్యుడు గోవర్ధన్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైవీయూ భూములు కబ్జాకు గురైయ్యాయని వారం రోజులుగా పత్రికలలో వస్తున్న నేపథ్యంలో పాలక మండలి సభ్యులు అందరం కలిసి కట్టుగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళతామన్నారు. వర్సిటీ భూమి ఒక్క సెట్టు కూడా కబ్జాకు గురికాకుండా చూస్తామని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థి సంఘాలు సహాయం, అధ్యాపకులతోపాటు, అధికారుల సహాయం కూడా తీసుకుంటామన్నారు. విద్యార్థులు, విద్యార్థి సంఘాలు, భూములను పరిరక్షించాలని ఆందోళన చేస్తున్నారని అధికారులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్ళారని, పాలక మండలి సభ్యులుగా తమ వంతుగా అభివృద్ధికి కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు.

వంటగ్యాస్‌పై దశలవారీ సబ్సిడీ రద్దును విరమించుకోవాలి

కడప అర్బన్ : కేంద్ర ప్రభుత్వం తమపాలన స్వర్ణయుగమని, దేశంలో ప్రజలు సుఖ సంతోషాలతో వున్నారనే ఊహాలోకంలో వుంటూ ప్రజలపై భారాలు వేస్తూ వంటగ్యాస్‌పై నెలకు రూ.4లు సబ్సిడీ తగ్గిస్తూ వుందని ఈ రద్దును వెంటనే విరమించుకోవాలని రాయలసీమ పార్టీ నగర కార్యదర్శి మగ్బూల్‌బాష డిమాండ్‌చేశారు. ఆర్‌సీపీ కార్యాలయంలో శనివారం ముఖ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం వంటగ్యాస్‌పై సబ్సిడీని రద్దు చేసేందుకు శ్రీకారం చుడుతుందని ఇది పూర్తిగా ప్రజలను మోసం చేయడమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీపీ నగర కార్యదర్శిసభ్యులు సిద్ధరామయ్య, తులసీరామ్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌సీపీ నేతలు

ఆచరణతోనే ప్రచారం సుసాధ్యం



మాట్లాడుతున్న డీపీసీ బోధకులు

కడప, అర్బన్ : ఏదైనా సంకల్పించుకున్నప్పుడు దాన్ని ఆచరించాలి. ఆ తరువాతనే ప్రచారం చేయాలని లేకుంటే అది జీవన విధానానికి అడ్డుగోడగా నిలుస్తుందని ధర్మ పరిచయ బోధకులు డాక్టర్ ఫజుల్‌రెహమాన్ , సయ్యద్ అహ్మద్, అక్బర్ అలీ రషాది, అబ్దుల్ వదూద్ అన్నారు. మస్తాన్ వలి వీధిలోని ధర్మపరిచయకమిటీ కార్యాలయంలో శనివారం ధర్మ ప్రచారకులకు ఒక్కరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రసంగిస్తూ దైవ ప్రచారం చేయాలంటే ధర్మ నిబంధనలు ప్రచారకులు పాటించాలన్నారు. దేవుని యందు భక్తి, విశ్వాసం కలిగి వుండి ఏదైనా విపత్తు, ప్రమాదం, ఆపద సంభవించినప్పుడు దేవుని ఆశ్రయించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పది నియోజకవర్గాల నుంచి ధర్మ ప్రచారకులు, కమిటీ పెద్దలు ఇస్‌హాక్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఎంపీఈవోల నియామకం

రామాపురం: మండలానికి ఇద్దరు ఎంపీఈవోల నియామకం జరిగినట్లు మండల వ్యవసాయాధికారి శ్రీకర్ తెలిపారు. మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో ఐదుగురు బహుళ ప్రయోజన విస్తరణ అధికారులు (ఎంపీఈవో) పనిచేస్తుంటే మరో ఇద్దరు ఎంపీఈవోలను కొత్తగా ప్రభుత్వం నియమించినట్లు ఆయన తెలిపారు. బండపల్లె, పొత్తుకూరివాండ్లపల్లెకు బీ. వెంకటేష్, సుద్దమళ్ల, సరస్వతిపల్లె ఎంపీఈవోగా ఎం. ప్రసన్న విధులు నిర్వహిస్తామని తెలిపారు.

అర్హులందరికీ పక్కా గృహాలు

గాలివీడు: అర్హులైన ప్రతి ఒక్కరికీ పక్కా గృహాలను అందజేస్తామని గరుగుపల్లె సర్పంచ్ చిన్నపరెడ్డి పేర్కొన్నారు. గృహనిర్మాణాలపై ఆ శాఖ ఏఈ రెడ్డెయ్య ఆధ్వర్యంలో గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం పేద ప్రజల కోసం అనేక రకాల పథకాలను ప్రవేశపెడుతున్నదన్నారు. రాబోయే రెండు సంవత్సరాల కాలంలో ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జన్మభూమి కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

జగన్ తీరు మార్చుకోవాలి

లక్కిరెడ్డిపల్లె: ప్రతిపక్ష నేత జగన్‌మోహన్ రెడ్డి తన మాట తీరు మార్చుకోకపోతే ఎప్పటికీ పీఠమెక్కలేరని టీడీపీ మండల అధ్యక్షుడు జయరాం, పార్టీ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీపీ ఉమాపతిరెడ్డి పేర్కొన్నారు. శనివారం వారు లక్కిరెడ్డిపల్లెలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రాధినేత అయిన ముఖ్యమంత్రినే తన నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నాడని, ఇక సామాన్య ప్రజలను లెక్కచేస్తాడా అని ప్రశ్నించారు. ఏ సభకు వెళ్లినా ముఖ్యమంత్రిపై నిందలు వేయడం, కుర్చీ కోసం తనకిష్టమొచ్చిన భాషతో పెద్దతనాన్ని గమనించకుండా మాట్లాడడం సబబు కాదన్నారు. ఒక వీధి రౌడీలా మాట్లాడడం ఏమాత్రం నాయకత్వం కాదన్నారు. నంద్యాలలో ఆయన ఎంత అరిచినా ప్రజలు టీడీపీకే పగ్గాలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గంగయ్య, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

రోడ్డుపై పారుతున్న మురుగు

● అటువైపుగా వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిందే... ● సంవత్సరాలుగా ఇదే దుస్థితి


భట్టువీధి మురికినీటితో నీటి కుంటలా మారిన దృశ్యం

రాయచోటిటౌన్: రాయచోటి పట్టణంలో మురుగునీరు రోడ్లపై పారుతోంది. కొన్ని ప్రాంతాల్లో సంవత్సరాలుగా మురుగునీరు రోజు మార్చి రోజు రోడ్లపై వంకల్లా పారుతూ పాదచారులు, వాహనదారులకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తోంది. ముఖ్యంగా గాలివీడు మార్గంలోని రాజేశ్వరి హోటల్‌కు ఎదురుగా రోజు మార్చి రోజు మురుగునీరు పెద్ద ఎత్తున రోడ్డుపైకి వస్తోంది. ఈ క్రమంలోనే భట్టువీధి మురుగునీటితో కుంటలా మారింది. తాత్కాలిక చర్యలు చేపడుతున్నారే తప్ప మున్సిపల్ అధికారులు శాశ్వత చర్యలు చేపట్టడంలో పూర్తి స్థాయిలో విఫలమయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనికితోడు రాజేశ్వరి హోటల్‌కు ఎదురుగా కల్వర్టు ఉండడంతో మురుగునీరంతా అక్కడికి వచ్చి చెత్తాచెదారం అడ్డుపడి నీరంతా రోడ్డుపైకి పెల్లుబుకుతోంది. దీంతో గంటల తరబడి భట్టువీధి, రోడ్డుపై వెళ్లేవారు మురుగునీటి కంపును భరించక తప్పడం లేదు. మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా ఫలితం లేదని స్థానికులు వాపోతున్నారు.


రాజేశ్వరి హోటల్‌కు ఎదురుగా డ్రైనేజీ నుంచి తీసి వేసిన చెత్తకుప్ప

పేద కుటుంబాలకు ధీమా చంద్రన్న బీమా


లబ్ధిదారులకు బీమా పత్రాలను అందిస్తున్న అధికారులు

సంబేపల్లె: నిరుపేద కుటుంబాల్లో వెలుగును నింపే పథకమే చంద్రన్న బీమా అని సంబేపల్లె సర్పంచ్ నాగేశ్వర్‌నాయుడు, వెలుగు ఏరియా కోఆర్డినేటర్ వేణుమాధవ్ తెలిపారు. శనివారం ఐకేపీ కార్యాలయంలో ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన కార్మిక కుటుంబాలకు చంద్రన్న బీమా పథకం ద్వారా వచ్చిన రాయితీ డబ్బులను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఏడుగురు లబ్ధిదారులకు చంద్రన్న బీమా డబ్బులు వచ్చాయన్నారు. ప్రస్తుతం ప్రమాద మరణాలకు రూ. 5 లక్షలు, సహజ మరణానికి రూ.2 లక్షలు వర్తించే విధంగా ముఖ్యమంత్రి పథకంలో మార్పులు చేసినట్లు తెలిపారు.

గల్ఫ్ బాధితులను ఆదుకునేందుకే 'బంధం సర్వే'


మాట్లాడుతున్న వెలుగు ఏరియా కోఆర్డినేటర్

సంబేపల్లె: జీవనోపాధుల నిమిత్తం గల్ఫ్ దేశాలకు వెళ్లి వివిధ కష్టాలు పడుతున్న వారిని దృష్టిలో పెట్టుకుని జిల్లా కలెక్టర్ మొబైల్ వ్యాప్ ద్వారా వారి మధ్య బంధాన్ని కలిపేందుకే బంధం సర్వేని నిర్వహిస్తున్నట్లు వెలుగు ఏరియా కోఆర్డినేటర్ వేణుమాధవ్, ఏపీయం శ్రీనివాసులు తెలిపారు. జీవనోపాధుల కోసం భర్తను, పిల్లలను వదిలి గల్ఫ్ దేశాలకు వెళ్లి వారి మధ్య సత్సంబంధాలు తెగిపోవడం, దీంతో వివిధ కష్టాలు పడుతూ బయటకు చెప్పుకోలేక ఇబ్బందులు పడుతున్న వీరందరినీ స్వదేశానికి పిలిపించేందుకు ఈ సర్వే ఉపయోగపడుతుందన్నారు. ఏజెన్సీ నిర్వాహకుల ద్వారా సరైన సమాచారాన్ని సేకరించడం, అక్కడ వారి భోజన వసతి, వైద్యం, వివిధ ఇబ్బందులు పడుతున్న సమాచారాన్ని సేకరించడం జరుగుతోందన్నారు. కువైట్‌కు వెళ్లినవారు, ఇంటి దగ్గర ఉన్న వారి దగ్గర సంతృప్తి వాతావరణం ఉందా లేదా అని విచారించడం జరుగుతుందన్నారు. జిల్లాలో రాజంపేట, రాయచోటి నియోజకవర్గాల్లో అధిక మంది మహిళలు గల్ఫ్‌దేశాలకు వెళ్లడంతో ఈ ప్రాంతాల్లో ఈ సర్వేని చేపట్టడం జరుగుతోందని తెలిపారు. గ్రామాల్లో బంధం సర్వేలో వ్యక్తుల సమాచారాన్ని సేకరించి కువైట్‌లోని ఎంబీపీకి వ్యాప్ ద్వారా పంపడం జరుగుతుందన్నారు. తద్వారా అక్కడి కువైట్ అధికారులతో మాట్లాడి వారిని స్వదేశానికి పిలిపించే విధంగా జిల్లా కలెక్టర్, ఎస్పీలు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వెలుగు సీసీలు శ్రీనివాసరాజు, నాగరాజ, నాగేంద్ర, ఈశ్వరమ్మ, గంగాధర్, ఓబులేసు, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలపై మొగ్గుచూపండి


వేరుశనగ పంటను పరిశీలిస్తున్న జేడీఏ ఠాగూర్‌నాయక్

లక్కిరెడ్డిపల్లె: ఈ ఖరీఫ్‌కు వర్షాభావ పరిస్థితుల వల్ల వేరుశనగ పంట పూర్తిస్థాయిలో సాగు కాలేదని, ఆగస్టులో కురిసే వర్షాలకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై మొగ్గు చూపాలని జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు ఠాగూర్ నాయక్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని గాండ్లపల్లె గ్రామంలో పర్యటించి వేరుశనగ పంటను పరిశీలించారు. అనంతరం గాండ్లపల్లెలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో వేరుశనగ అతి తక్కువ శాతం సాగైందని, సకాలంలో వర్షాలు కురవకపోవడం వల్ల వేరుశనగ పంట పూర్తి స్థాయిలో సాగు తగ్గిందన్నారు. ప్రత్యామ్నాయ పంటలు కంది, ఉలవలు, ఉద్దులు, మినుములు, ఆముదం సాగుచేసుకోవచ్చునన్నారు. ఆగస్టు 15లోపు వర్షాలు కురిస్తే ప్రత్యామ్నాయ పంటలు మంచి దిగుబడి వస్తాయన్నారు. ఖరీఫ్‌లో వేరుశనగ సాగుచేసిన రైతులు వర్షాలు కురవక ఎండుముఖం పడితే యూరియా పిచికారి చేస్తే 15 రోజుల పాటు పంట పచ్చగా ఉంటుందన్నారు. కృషి విజ్ఞాన శాస్త్రవేత్త అంకయ్యకుమార్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ఎంతో లాభదాయకమని, గాండ్లపల్లెలో ప్రతి రైతు భూసార పరీక్షలు చేసి సేంద్రియ తయారు చేసి వాటితోనే పంటలు సాగుచేయాలన్నారు. కషాయాలు తయారు చేసుకుని పిచికారి చేస్తే చీడపీడలను నివారించవచ్చునన్నారు. ముఖ్యంగా జీవామృతం, పంచగవ్య, వాయలాకుతో కషాయాలు తయారు చేసుకుని సులభమైన పద్ధతిలో చీడపీడలను నివారించవచ్చునన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు వీరయ్య, లక్కిరెడ్డిపల్లె ఏడీ దివాకర్, ఏవో వెంకట్రమణారెడ్డి, ఏఈవోలు అనూష, హేమలత, కెరోలిన్, ఎంపీఈవోలు పాల్గొన్నారు.

వెలిగల్లు కుడికాలువకు నీటిని విడుదల చేయండి

గాలివీడు: వెలిగల్లు కుడికాలువకు సాగునీటిని విడుదల చేయాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర సభ్యుడు గుమ్మా అమర్‌నాథరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన తలముడిపి, కొర్లకుంట, పందికుంట పంచాయతీల్లో ఎండిపోతున్న వేరుశనగ పంటకు వెలిగల్లు ప్రాజెక్టు నుంచి నీటిని విడదల చేయాలని డీఈ వెంకట్రమణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పందికుంట, తలముడిపి, కొర్లకుంట పంచాయతీల్లో 600 ఎకరాల్లో సాగు చేసిన వేరుశనగ పంట ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితుల వల్ల పూర్తిగా ఎండిపోయే పరిస్థితి దాపురించిందని, వెలిగల్లు కుడికాలువకు ఒకటి, మూడో డిస్ట్రిబ్యూటర్ల ద్వారా నీటిని విడుదల చేస్తే పంటను కాపాడవచ్చునని తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని డీఈ హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జేఈ కృపానిధి తదితరులు పాల్గొన్నారు.


వినతి పత్రం అందిస్తున్న అమర్‌నాథరెడ్డి

పూర్తి సబ్సిడీతో ఉలవలు, పెసలు ఇవ్వాలి

లక్కిరెడ్డిపల్లె: వర్షాభావ పరిస్థితుల వల్ల ఆగస్టులో కురిసే వర్షాలకు ప్రత్యామ్నాయ పంటలు ఉలవలు, పెసలు, కందులు, ఉద్దులు సాగు చేసుకుంటామని, వీటికి పూర్తి సబ్సిడీతో రైతులకు అందించాలని ఏపీ రైతు సంఘం ఉపాధ్యక్షుడు రంగారెడ్డి, రాయచోటి రైతు సంఘం అధ్యక్షుడు కొనసాని రాజారెడ్డి శనివారం జేడీ ఠాగూర్‌నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయాధికారులు రైతుల పట్ల నిర్లక్ష్యం చేయకుండా కనీసం ప్రత్యామ్నాయ పంటల సాగుకు సహకరించాలని కోరారు.

అలాగే ఇన్సూరెన్స్, ఆధార్‌కార్డు, బ్యాంకులోని తప్పొప్పుల వలన రైతులకు సక్రమంగా పంట నష్టం అందడం లేదని, వీటిని ప్రత్యేకంగా సర్వే నిర్వహించి రైతులకు పంట నష్టం అందించాలని కోరారు.

ప్రతి చిన్నారికి ఎంఆర్ వ్యాక్సిన్ చేయాలి

చిన్నమండెం: 9 నెలల నుంచి 15 సంవత్సరాలలోపు ప్రతి చిన్నారికి మీజిల్, రుబెల్లా వ్యాక్సిన్ వేయాలని అదనపు డీఎంహెచ్ఓ చంద్రశేఖర్ సూచించారు. చిన్నమండెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు ఎంతమంది పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్ వేశారు. ఇంకా ఎంతమందికి వేయాలని అనే అంశాలపై ఆరా తీశారు. 4 ఆరోగ్య సబ్ సెంటర్ల పరిధిలో 1159 మంది విద్యార్థులకు వ్యాక్సిన్ చేసినట్లు వైద్యాధికారులు మధుసూదన్ రెడ్డి, శారద తెలిపారు. పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దోమలను నివారించే కార్యక్రమంపై దృష్టి పెట్టాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ క్రిష్ణయ్య, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
4
బద్వేలు
కడప । ఆదివారం 6 ఆగస్టు 2017
బద్వేలు । పోరుమామిళ్ల । గోపవరం । కలసపాడు । కాశినాయన । బి. కోడూరు । అట్లూరు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ


చెక్కు పంపిణీ చేస్తున్న విజయజ్యోతి

కలసపాడు : కలసపాడులో వైఎస్ఆర్సీపీ పాలక మండలి సభ్యురాలు ఎం.డి విజయజ్యోతి తన స్వగృహంలో శనివారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. కాశినాయన మండలం, నర్సాపురం గ్రామానికి చెందిన మహబూబ్‌బీ అనారోగ్యానికి గురికావడంతో ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఆమెకు రూ.3లక్షలు నిధులు మంజూరుకావడంతో విజయజ్యోతి చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం రిలీఫ్‌ఫండ్ పేదలకు వరంలాంటిదన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముర్రుపాలు అమృతంతో సమానం


తెల్లపాడులో తల్లిపాల వారోత్సవాలపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

బద్వేలు : పుట్టిన బిడ్డకు ముర్రుపాలు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీలమ్మ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని నందిపల్లె అంగన్వాడీ కేంద్రం, గుండంరాజుపల్లె, రామవరెడ్డిపేట, రంగనాథ్‌పురంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపు తల్లిముర్రుపాలు పట్టించడం వలన వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఆయా అంగన్వాడీ కేంద్రాల్లో బాలింతలకు తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించారు. తల్లిపాలు బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండటానికి ఎంతో దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో రంగనాథ్‌పురం అంగన్వాడీ టీచర్ మహాలక్ష్మి, నందిపల్లె, బాలాయిపల్లె, అంగన్వాడీ టీచర్లు సునీత, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.


రెడ్డికొట్టాలలో తల్లిపాల వారోత్సవాల ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తెల్లపాడులో తల్లిపాల వారోత్సవాలు

కలసపాడు : మండలంలోని తెల్లపాడు గ్రామంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈకార్యక్రమానికి మండల విద్యాశాఖాధికారి శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం చేకూరుతుందన్నారు. అలాగే ముర్రుపాలు బిడ్డకు అమృతం లాంటివని తెలిపారు. పుట్టిన వెంటనే ముర్రుపాలు బిడ్డకు తాపించడం వలన రోగనిరోధకశక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుగుణ, ఉపాధ్యాయులు రామసుబ్బయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు అమృతం

పోరుమామిళ్ల : తల్లిపాలే బిడ్డకు శ్రేష్ఠమని సూపర్‌వైజర్ లక్ష్మీదేవి అన్నారు. శనివారం కాశినాయన మండలంలోని రెడ్డికొట్టాలలో తల్లిపాల వారోత్సవాలపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు తప్పనిసరిగా తల్లిపాలు తాపించాలన్నారు. పోతపాల వలన రోగనిరోధకశక్తి తగ్గి రోగాల బారిన పడతారన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు క్రిష్ణమ్మ, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అలాగే పోరుమామిళ్లలోని 1వ అంగన్వాడీ కేంద్రం ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అంగన్వాడీ కార్యకర్త నాగేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే...

గ్రామాల్లో లోపించిన పారిశుధ్యం


రహదారి పక్కనే వేసిన చెత్తా చెదారం

అట్లూరు : మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్యం లోపించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలనే ఉద్దేశ్యంతో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని చేపట్టాయి. అయితే అధికారులు తూతూమంత్రంగా కార్యక్రమాన్ని చేపట్టి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో గ్రామాల్లో ఎక్కడ పడితే చెత్తా చెదా రాలతో పారిశుధ్యం అధ్వాన్నంగా తయా రైంది. వర్షం వచ్చినపుడు వర్షపునీటితో చెత్త కొట్టుకొని వచ్చి రహదారులపై నిలుస్తోంది. అధికారులు మాత్రం ఇదంతా చూస్తున్నారేకానీ, పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టడం లేదు. దీనికితోడు మండల పరిధిలో ఏ గ్రామ పంచాయతీలో డంపింగ్‌యార్డు లేకపోవడంతో గ్రామాల్లో ఉండే చెత్త అంతా రహదారుల పక్కనే వేస్తున్నారు. దీంతో వర్షాలు వచ్చినప్పుడు వర్షపు నీరు నిలిచి దోమలు ఎక్కువగా వృద్ధి చెందుతున్నాయి. ముంపు గ్రామాలైన ముత్తుకూరు, జొన్నవరం, చింతువాండ్లపల్లె గ్రామాల్లో చెత్తపారేసేందుకు డంపింగ్‌యార్డులు లేకపోవడంతో గ్రామ శివార్లల్లో వేస్తున్నారు. దీంతో వర్షం వచ్చినప్పుడు నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని ప్రజలు వాపోతున్నారు. అధికారులు మాత్రం ప్రతి శుక్ర, శనివారాలు పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నామని చెబుతున్నారేకానీ, ఆ దాఖలాలు ఎక్కడా కనిపించడం లేదని గ్రామీణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్తా చెదారం వేసేందుకు ప్రతి గ్రామ పంచాయతీలో డంపింగ్‌యార్డు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇంటిస్థలాలకు దరఖాస్తు చేసుకోండి

బి.కోడూరు : మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఇంటిస్థలం లేని లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటిస్థలం లేని లబ్ధిదారులు ఇంటిస్థలం కోసం ఈనెల 17వ తేదీ లోపు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని ఆయన తెలిపారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఇంటిస్థలం లేని వారిని గుర్తించి కేటాయిస్తామని ఆయన తెలిపారు.

తహసీల్దార్, వీఆర్వోలపై చర్యలు తీసుకోవాలి


కబ్జాభూముల్లో పర్యటిస్తున్న సీపీఐ నాయకుల బృందం

అట్లూరు : ప్రభుత్వ బంజరు భూములను అక్రమార్కులకు కట్టబెట్టిన తహసీల్దార్, వీఆర్వోలపై విచారణ జరిపి, వెంటనే చర్యలు తీసుకొని సస్పెండ్ చేయాలని సీపీఐ బద్వేలు ఏరియా, పట్టణ కార్యదర్శి వీరశేఖర్, చంద్రశేఖర్‌లు పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని మాడుపూరు, కొండూరు, తంబళ్లగొంది, చౌటపల్లె, కొండ్రాజుపల్లె గ్రామాల్లో సీపీఐ బృందం పర్యటించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అట్లూరు మండలంలోని మాడుగ్రామ పంచాయితీలో ప్రభుత్వ భూములను వీఆర్వో వారి బంధువులకు కట్టబెట్టారన్నారు. అలాగే మండల వాసులకు కాకుండా స్థానికేతరులైన బద్వేలు, మైదుకూరు, మండలాల వారికి కేటాయించారని, దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు జకరయ్య, రంతుల్లాఖాన్, పెంచలయ్య, శివరామ్, సుబ్బారెడ్డి, ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకం.. భావితరాలకు బంగారు భవిష్యత్


చెన్నారెడ్డిపల్లె ఆర్సీఎం పాఠశాలలో మొక్కలు నాటుతున్న విజయజ్యోతి

కలసపాడు : మొక్కల పెంపకం భావితరాలకు బంగారు భవిష్యత్తునిస్తుందని వైఎస్ఆర్సీపీ పాలక మండలి సభ్యురాలు ఎం.డి విజయజ్యోతి పేర్కొన్నారు. శనివారం మండలంలోని చెన్నారెడ్డిపల్లెలో ఉన్న ఆర్సీఎం పాఠశాలలో నీరు-చెట్టు కార్యక్రమంలో భాగంగా ఆమె మొక్కల ను నాటారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలు నాటడం వలన భవిష్యత్తులో చెట్లగా మారి ప్రాణవాయువును అందిస్తాయన్నారు. టీడీపీ నాయకులు వావిళ్ల రమణయ్య, సిద్దారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, వెంకటరెడ్డి, మాజీ ఎంపీటీసీ రామసుబ్బయ్య, బాలయ్య, నగిలిడేవిడ్, కృపానందం, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా సత్యనారాయణ వ్రతం



వడమాలలతో అభయాంజనేయస్వామి, ప్రత్యేక అలంకరణలో సత్యనారాయణ స్వామి

బద్వేలు టౌన్ : పట్టణంలోని శ్రీమారుతీభజన మండలి, మారుతీసేవా సమితిట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం శనిత్రయోదశి సందర్భంగా అభయాంజనేయస్వామికి 1001 వడమాలలు వేసి సత్యనారాయణ వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచే అభయాంజనేయస్వామికి అభిషేకాలు, అర్చనలు చేశారు. అలాగే గణపతిపూజ, రుద్రాభిషేకం అనంతరం సత్యనారాయణ వ్రతాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం మంగళహారతి నిర్వహించి భక్తులకు సత్యనారాయణవ్రత విశిష్టత గురించి ఆలయ అర్చకులు భక్తులకు వివరించారు. కార్యక్రమంలో అడ్వకేట్ డీఎకుమార్, కేవీఎస్ క్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు సీతారాముల కల్యాణం : పట్టణంలోని మిద్దెలవారిపాలెంలో సీతాలక్ష్మణ హనుమత్ సమేత కోదండరామస్వామి తృతీయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం సీతారాముల కల్యాణం, గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. అలాగే అన్నదానం కూడా ఉంటుందన్నారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం


ఫ్రెండ్‌షిప్‌డే వేడుకలు నిర్వహించుకుంటున్న చిన్నారులు

బద్వేలు : విద్యార్థి జీవితంలో స్కూలు విద్య అతి ముఖ్యమని, అప్పుడు ఏర్పడే బంధాలు జీవితాంతం గుర్తిండిపోతాయని నారాయణ ఈటెక్నో పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పాఠశాలలో స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్నేహమేరా జీవితం, స్నేహమేరా శాశ్వతం అని తెలియజేశారు. విద్యార్థులు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లను కట్టుకొని ఆనందోత్సవాల్లో మునిగిపోయారు. డీజీఎం రామ్మోహన్ రెడ్డి, ఏజీఎం నజీర్, డీన్ రవీందర్, అకడమిక్ డీన్ శ్రీకాంత్ రెడ్డి, పావని, లలిత, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని చెరబట్టినందుకే చంద్రబాబును కాల్చాలన్నది



ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసాద్‌రెడ్డి

ప్రొద్దుటూరు అర్బన్: పరిశ్రమలను స్థాపించి నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తానని, డ్వాక్రా మహిళలకు రుణ మాఫీ చేస్తానని, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి ఇస్తానని హామీలు ఇచ్చి ప్రజలను వంచించి ప్రజాస్వామ్యాన్ని చెరబట్టిన చంద్రబాబును నడిరోడ్డుపై కాల్చినా తప్పులేదని జగన్ మాట్లాడటంలో అర్థం ఉందని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి సమర్థించుకున్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ మంత్రులు, నాయకులకు జగన్ మాట్లాడిన భాషమీదనా, ఉద్దేశాల మీదనా అభ్యంతరాలు ఉన్నది అర్థం కావడంలేదన్నారు. రాజకీయ విలువలను మంటగలిపి చంద్రబాబు ప్రతిపక్షంలో ఉన్న 21 మంది ఎమ్మెల్యేలను రాజీనామా చేయకుండానే టీడీపీలో చేర్చుకుని ప్రజాస్వామ్యాన్ని నీరుగార్చారన్నారు. రాజకీయాల్లో నైతిక విలువలను నిలబెట్టడానికి జగన్ శిల్పాచక్రపాణిరెడ్డిని ఎమ్మెల్సీకి రాజీనామా చేశాకే వైసీపీలో చేర్చుకున్నారన్నారు. టీడీపీ ఎన్ని ఎత్తులు వేసినా నంద్యాలలో ఓటమి తప్పదన్నారు. జగన్ చంద్రబాబుకు కాల్చి చంపినా తప్పులేదన్నాడని, కానీ కాల్చి చంపుతానని మాట్లాడలేదన్నారు. మహిళలపై అత్యాచారాలు, యాసిడ్ దాడులు చేసిన వారిని దోపిడీ దొంగలను, ఉగ్రవాదులను ప్రజలు కాల్చిచంపాలని డిమాండ్ చేస్తారన్నారు. కానీ చంద్రబాబు వారందరికంటే ప్రమాదకరంగా మారాడన్నారు. టీడీపీ నేతలు కేసినేని బోండా ఉమ, ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌పై దౌర్జన్యం, చింతమనేని ప్రభాకర్ ఎమ్మార్వో వణిజాక్షిపై దౌర్జన్యం, తనకు ఎమ్మెల్యే రాధాకృష్ణ పోలీసులపై దౌర్జన్యం, పయ్యావుల కేశవ్ కులపిచ్చి ఉన్మాదం, జేసీ దివాకర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డిల దౌర్జన్యం టీడీపీ వారికి కనపడదా అని ప్రశ్నించారు. అసెంబ్లీలో తన అంతు చూస్తానని బెదిరించారని రాచమల్లు ఆరోపించారు. చంద్రబాబు ఎన్ని కుట్రలు చేసినా జగన్ రాజీ పడలేదని పేర్కొన్నారు. టీడీపీ వారికి ఓటమి భయం పట్టుకుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండలాధ్యక్షుడు దేవీ ప్రసాద్‌రెడ్డి, పట్టణాధ్యక్షులు చిప్పగిరి ప్రసాద్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ వెలువలి నారాయణరెడ్డి, మహిళాధ్యక్షులు జింకా విజయలక్ష్మి, ఓబయ్యయాదవ్ పాల్గొన్నారు.

ఆలయాల్లో శని త్రయోదశి పూజలు

ప్రొద్దుటూరు టౌన్: శని త్రయోదశి పర్వదినంను పురష్కరించుకుని పట్టణంలోని వివిధ ఆలయాల్లో ఉన్న నవగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనిదేవునికి ప్రీతికరమైన నువ్వుల నూనెను భక్తులు సమర్పించారు. నవగ్రహాలకు పూలు, పండ్లు, నువ్వుల నూనె, నల్లని వస్త్రం సమర్పించారు. అనంతరం నవగ్రహాల చుట్టూ ప్రదక్షిణలు చేసి తమ కోర్కెలు నెరవేరాలని మొక్కుకున్నారు. పూజలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

ప్రేమానురాగాలను పంచే రక్షాబంధనం



ప్రొద్దుటూరు టౌన్: మానవ సంబంధాలను పటిష్టం చేస్తూ సోదరీ సోదరుల మధ్య ప్రేమానురాగాలను పెంచేదే రక్షాబంధనం అని ఎంపీపీ మల్లెల ఝాన్సీరాణి పేర్కొన్నారు. రక్షాబంధన్ పర్వదినంను పురష్కరించుకుని శనివారం ఎంపీపీ మల్లెల ఝాన్సీరాణి, ఉప ఎంపిపి మల్లెల రాజారాంరెడ్డిలకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. విజయనగరం వీధిలోని ఓంశాంతి భవన్ నిర్వాహకురాలు బి.కె.శాంత తదితరులు పాల్గొన్నారు.

10న రుణాలకు ఇంటర్వ్యూలు

పెద్దముడియం: 2017-18 సంవత్సరానికిగాను మండలానికి మంజూరైన సబ్సిడీ రుణాలకు సంబందించి ఇంటర్వ్యూలు ఈనెల 10వ తేదీన జరుగనున్నాయని ఇన్‌ఛార్జి ఎంపీడీవో విజయరాఘవరెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన పెద్దముడియంలోని ఎంపీడీవో సభాభవనంలో ఈ ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. మండలంలోని పెద్దపసుపుల, పెద్దముడియం, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్లు, ఎంపీడీవో తదితరులు పాల్గొంటారన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే దరఖాస్తుదారులు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఎడ్యుకేషన్ క్వాలిఫికేషన్ సర్టిఫికెట్లు ఒరిజినల్ తీసుకుని ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. మండలానికి సంబందించి ఎస్సీలకు 32 యూనిట్లు, బీసీలకు 50, కాపులకు 20, మైనార్టీలకు 11 మొత్తం 113 యూనిట్లు మంజూరు కాగా వీరికి 332 దరఖాస్తులు వచ్చినట్లు విజయరాఘవరెడ్డి తెలిపారు.

ఘనంగా గంధపు ఉత్సవం



జమ్మలమడుగు రూరల్: జమ్మలమడుగులోని పలగాడి వీధిలో వెలసిన హజరత్ సయ్యద్‌షా బడే గౌస్‌పీరాఖాద్రి పెద్ద ఆస్థానములవారి ఉరుసు మహోత్సవాల కార్యక్రమంలో భాగంగా శనివారం ఘనంగా గంధపు ఉత్సవాలు జరిగాయి. అందులో భా గంగా శుక్రవారం రాత్రి కూడా నిషాన్‌తో భక్తులు జెండాలతో ఊరేగింపు చేశారు. నాగారాలు, బాణసంచా వేడుకలతో రాత్రిగంధాన్ని పురవీధుల్లో ఊరేగింపు చేశారు.

లింక్ రోడ్ల పనుల కోసం ఏఎంసీల పాలకవర్గాల పట్టు

ప్రొద్దుటూరు పుట్టపర్తి సర్కిల్: గ్రామీణ లింక్ రోడ్ల పనుల కోసం వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఎఎంసీ)ల పాలకవర్గాలు పట్టుపడుతున్నాయి. ఎఎంసీ నిధులతో చేపట్టే ఈ పనులను ప్రభుత్వం మార్కెటింగ్ శాఖ పంచాయతీరాజ్‌శాఖకు అప్పగించడంపై ఎఎంసీల పాలకవర్గాలు వ్యతిరేకిస్తున్నాయి. ఎఎంసీల వార్షిక ఆదాయంలో 20 శాతం నిధులకు జాతీయ మహాత్మా గాంధీ ఉపాధి పథకంలోంచి మరో శాతం నిధులను (మ్యాచింగ్ గ్రాంట్స్) కలిపి గ్రామీణ లింక్‌రోడ్ల నిర్మాణాలను చేపట్టాలని ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. అయితే వ్యవసాయ మార్కెటింగ్ శాఖలో సొంతంగా ఇంజినీరింగ్ విభాగం ఉన్నప్పటికి ఆశాఖ ఆధీనంలోని ఎఎంసీల నిధులతో చేపట్టే గ్రామీణ లింక్‌రోడ్ల పనులను పంచాయతీరాజ్ (పీఆర్) డిపార్టుమెంట్‌కు అప్పజెప్పడంపై ఎఎంసీల పాలకవర్గాఉ ఒప్పుకోవడంలేదు. గత ఏడాది 2016-17లో జిల్లాలోని 12 వ్యవసాయ మార్కెట్ కమిటీల ద్వారా రూ.19.07 కోట్ల ఆదాయం లభించింది. ఇందులో 20 శాతం నిధులు రూ.2.80 కోట్లు, జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు రూ.2.80 కోట్లు కలిపి మొత్తం రూ.5.60 కోట్లతో జిల్లాలో గ్రామీణ లింక్ రోడ్ల నిర్మాణం చేయడానికి అవకాశం ఏర్పడింది. ఇందుకు ఇప్పటి వరకు కేవలం కడప, కమలాపురం, పులివెందుల, జమ్మలమడుగు, రైల్వేకోడూరు ఎఎంసీలు మాత్రమే పనులను ప్రతిపాదించి ప్రభుత్వానికి పంపాయి. వీటికి పరిపాలనా అనుమతి లభించింది.

అయితే సాంకేతిక అనుమతి రావాల్సి ఉంది. ఇందుకు మార్కెటింగ్‌శాఖ, పంచాయతీరాజ్‌శాఖల ఇంజినీరింగ్ విభాగాల్లో ఎవ్వరూ అనుమతి ఇవ్వాలనే సిబ్బంది ఏర్పడింది. దీంతో జిల్లాలోని ఇతర ఎఎంసీల పాలకవర్గాలు లింక్‌రోడ్లకు పనులు, ప్రతిపాదనలు ఇంకా పంపలేదు. మార్కెటింగ్‌శాఖ ద్వారా అయితే పనుల నిర్వహణ, పెత్తనం, ఎఎంసీల చేతుల్లోనే ఉంటుంది. ఉపయోగంగా ఉంటుంది. ఇందుకోసం పాలకవర్గాలు గట్టిగా ప్రయత్నిస్తున్నాయి.

చేనేత జాతీయ దినోత్సవాన్ని జయప్రదం చేయండి


ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అవ్వారు ప్రసాద్

ప్రొద్దుటూరు టౌన్: ఆగస్టు 7వ తేదీ జాతీయ చేనేత దినోత్సవాన్ని జయప్రదం చేయాలని చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ అవ్వారు ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 7వ తేదీ సాయంత్రం పద్మశాలీయ కల్యాణ మండపంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా అవ్వారు మల్లికార్జున పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా చేనేత వర్గాలకు చెందిన ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, చేనేత సంఘాల అధ్యక్షులను ఘనంగా సన్మానిస్తామన్నారు. చేనేత కులాల రాజకీయ, సామాజిక ఆర్థికాభివృద్ధికి ఈ సమావేశంలో దశ, నిర్దేశం చేస్తామని, చేనేత కళాకారులు, మహిళలు, వ్యాపారులు, విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొని చేనేత శక్తిని నిరూపించాలన్నారు. కార్యక్రమంలో శివశంకర్, బాలసుబ్రమణ్యం, వెంకటయ్య, బాలయ్యలు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీపై దాడి చేయడం పిరికి చర్య

ప్రొద్దుటూరు టౌన్: కాంగ్రెస్ పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీపై దాడి చేయడం పిరికి చర్య అని కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షులు పిఎండి నజీర్ విమర్శించారు. వరద బాధితులను పరామర్శించడానికి గుజరాత్ లోని వరద ప్రాంతాలకు వెళ్లిన రాహుల్‌పై బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు రాళ్లు విసరడం బీజేపీ దుర్మార్గపు పాలనకు నిదర్శనమన్నారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని, దేశం కోసం ప్రాణత్యాగం చేసిన కుటుంబం గాంధీ కుటుంబమని, ఆ కుటుంబానికి చెందిన రాహుల్ గాంధీపై దాడి చేయడం అమానుషమన్నారు. బీజేపీ ఇటువంటి కుటిల యత్నాలను మానుకోవాలని, లేకుంటే రాబోయే రోజుల్లో ప్రజలే బుద్ధిచెబుతారని హెచ్చరించారు.

వీధులు మునిగిపోతున్నాయ్...

కడప, ఎర్రముక్కపల్లె : జిల్లాలో ప్రధాన పట్టణాల్లో మురుగునీటి కాలువలు ఆక్రమణకు గురవుతున్నాయి. ఫలితంగా ఏపాటి చిన్నవర్షం కురిసినా రోడ్లపైకి వర్షం నీరు చేరి జనజీవనానికి విఘాతం కలిగిస్తుంది. పూడికలు తొలగించడం వీలుకాక, కొన్ని చోట్ల అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్ల కొన్నిచోట్ల కాలువలు అధ్వానంగా మారి వీధులన్నీ మునిగిపోతున్నాయి. ఈ నేపథ్యం లో భారీ వర్షాలు పడితే ప్రజలు మరింత తీవ్ర ఇబ్బందులు పడే అవకాశముంది. నిబంధనల మేర కొన్నిఅడుగుల ఖాళీ స్థలం విడిచిపెట్టి భవనాలు నిర్మించుకోవాలి. ఈ నిబంధనలు ఎక్కడా అమలు కావడం లేదు సరికదా వున్నకాలువలు ఆక్రమిస్తూ నిర్మాణాలు సాగిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. కడప నగర


తులశమ్మ ఆసుపత్రి మార్గంలో జలమయం (ఫైల్)
పాతబస్టాండు(ఫైల్)

పాలక సంస్థ పరిధిలో కాలువలు, రహదారులను ఆక్రమించి నిర్మించిన నిర్మాణాల జోలికి పోలేదు. వీటిపై అధికారులు దృష్టి సారించకపోవడంతో చిన్నపాటి వర్షానికి నగరంలో పలు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. ప్రధానంగా చిన్నచౌకు, మృత్యుంజయకుంట, కొత్తబస్టాండు, జిల్లా కోర్టు, కోటిరెడ్డిసర్కిల్, పాతబస్టాండుతో పలు లోతట్టు ప్రాంతాలు వర్షం నీటితో జలమయమై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది. వర్షం నీరువెళ్లేందుకు కొత్తగా నిర్మాణాలు చేపట్టిన కల్వర్టులు కూడా శాస్త్రీయంగా నిర్మాణం చేపట్టకపోవడంతో ఎక్కడ నీరు అక్కడే నిలిచి జలయమవుతున్నాయి. అధికారులు దీనిపై చర్యలు చేపడితే సమస్య పరిష్కారమవుతుందని పలువురి అభిప్రాయం.

ఇన్ కమ్‌ట్యాక్స్‌పై ప్రభుత్వ పెన్షనర్లకు అవగాహన సదస్సు

కడప, రవీంద్రనగర్ : ఇన్ కమ్ ట్యాక్స్‌పై ప్రభుత్వ పెన్షనర్లకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం పాతకలెక్టరేట్ ఎదురుగా వున్న ఏపీ ప్రభుత్వ పెన్షనర్ల కార్యాలయంలో శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపీ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి సరస్వతి పాల్గొని మాట్లాడుతూ ఇన్ కమ్‌ట్యాక్స్ వల్ల వచ్చే లాభాలు తెలిపారు. ప్రభుత్వ పెన్షన్ దారులు ఇన్ కమ్‌ట్యాక్స్ కట్టాలని వాటి చెల్లింపులతో ఎంతో లాభమనే అంశంపై తెలిపారు. పెన్షనర్ల సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించే వరకు పోరాటం చేయాలని కోరారు. అనంతరం ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నారెడ్డి, సుబ్బారెడ్డి, రామమూర్తినాయుడు, మల్లయ్య, దేవరాజ్, మహిళా సభ్యులు రాణి, సరస్వతమ్మ, గ్రేసమ్మ పాల్గొన్నారు.

మోదీ కుటిల రాజకీయాలు మానాలి

కడప, అర్బన్ : కాంగ్రెస్ పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ పర్యటనలో రాహుల్‌కాన్వాయ్‌పై రాళ్లదాడి జరిపించడం ప్రధాని మోదీ కుటిల రాజనీతికి నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నీలిశ్రీనివాసరావు అన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తప్పుడు విధానాలతో ముందుకెళితే ప్రజల మనసులను గెలువలేరన్నారు. రాష్ట్రపతి ఎన్నికలకు దేశంలోని 17 పార్టీలను ఏకం చేసి నడిపించిన రాహుల్‌గాంధీని చూస్తే మోదీకి ధైర్యం చాలడం లేదన్నారు.

డ్రైడే తప్పనిసరిగా పాటించాలి

కడప, ఎర్రముక్కపల్లె : నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న గృహనిర్వాహకులు తప్పక వారానికోరోజు డ్రైడే పాటించాలని కమిషనర్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం ప్రకాష్‌నగర్ పరిసర ప్రాంతా ల్లో పర్యటించారు. ఇళ్ల మధ్య ఖాళీ స్థలంలో నిల్వ వున్న నీటిలో ఆయిల్‌బాల్స్ వేశారు.మోరీలు, కల్వర్టు కింద ఫాగింగ్‌చేయించారు. మురికికాలువల్లో బయోటెక్స్ స్ప్రే చేశారు. ఈ కార్యక్రమంలో ఎం హెచ్ వో వినోద్‌కుమార్, కార్పొరేటర్ బాబు, శానిటరీ ఇన్ స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

రుణాల దరఖాస్తు గడువు పెంచాలి

కడప, మారుతీనగర్ : ఎస్సీ, ఎస్టీ రుణాల ఆన్ లైన్ చేసుకునే గడువును ఈ నెల 20వ తేదీ వరకు పొడిగించాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి పేరుపోగు వర్గం జిల్లా అధ్యక్షుడు మాతంగి సుబ్బరాయుడు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం స్థానిక ఐటీఐసర్కిల్‌లోని సమితి కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాల్లోని మీసేవ, ఆన్ లైన్ కేంద్రాల్లో సర్వర్ పనిచేయడం లేదని కలెక్టర్ స్పందించి గడువు పొడిగించాలన్నారు.

కరువు పరిస్థితులపై అంచనా వేయండి:కలెక్టర్

కడప, కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడడంతో తక్కువ వర్షపాతం నమోదైందని ఇందుకు సంబంధించి చేపట్టాల్సిన కార్యాచరణ ప్రణాళిక తయారీకి సంబంధిత అధికారులు కృషి చేయాలని కలెక్టర్ బాబూరావునాయుడు సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియోకాన్ఫరెన్స్ హాలులో అధికారులు కరువు పరిస్థితిపై అవగాహన కార్యక్రమం జరిగింది. మండలాల్లో కరువు పరిస్థితి ఏ విధంగా వుందో తెలుసుకోవాలన్నారు. రెవెన్యూ అధికారులతో పాటు సీపీవో తిప్పేస్వామి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కరువు పరిస్థితిని వివరించి కరువును ఎలా అంచనా వేయాలో వివరించారు. కరువు ప్రభావం ఏయే రంగాలపై పడతాయి, ప్రజల జీవన ప్రమాణస్థాయి తదితర వాటి గురించి వివరించారు. జేసీ శ్వేత, డీఆర్‌వో నరసింహారావు, ఆర్డీవోలు చినరాముడు, వీరబ్రహ్మం, దేవేంద్రరెడ్డి, జేడీ ఠాగూర్‌నాయక్, పరిశ్రమల శాఖ జీఎం చాంద్‌బాష, ఎల్‌డీఎం ఆంజనేయాచారి పాల్గొన్నారు.

రాష్ట్రంలో ముస్లిం మైనార్టీలకు అండగా టీడీపీ

కడప, అర్బన్ : రాష్ట్రంలో టీడీపీ ముస్లిం మైనార్టీలకు అండగా పాలన సాగిస్తోందని రాజకీయంగా ఎన్నో పదవులు కట్టబెట్టిందని ఈ విషయాన్నితెలుసుకొని వైసీపీ నాయకులు మాట్లాడాలని జిల్లా మైనార్టీ ప్రధాన కార్యదర్శి మన్నూరు అక్బర్ అన్నారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ఎన్ని జిమ్మిక్కులు, కుయుక్తులు చేసినా నంద్యాలలో టీడీపీ అభ్యర్థి 50వేల మెజార్టీతో గెలుస్తారని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆమూరి బాలదాసు, హుసేన్ , ఇషాక్, గూడుబాష పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమకై 10న భారీ ర్యాలీ

కడప, మారుతీనగర్ : జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు ఐక్యంగాఉద్యమిస్తామని ప్రైవేటు స్కూల్స్ కళాశాలల అసోసియేషన్ నాయకులు అన్నారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో కడప ఉక్కు పోరాటకమిటీ ఏర్పాటు చేసిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఉక్కు పరిశ్రమసాధనకు ఈ నెల 10న జడ్పీ కార్యాలయం నుంచి కోటిరెడ్డిసర్కిల్, అంబేద్కర్‌సర్కిల్‌మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపడుతున్నామన్నారు. రామచంద్రారెడ్డి, జోగిరామిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రమణయ్య, రాజగోపాల్‌రెడ్డి, సుబ్బారెడ్డి, ఆర్‌సీపీరాష్ట్రప్రధాన కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి, ఆర్‌ఎస్‌వైఎఫ్ నాయకుడు శంకర్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

సిబ్బంది సంక్షేమానికి కృషి :ఎస్పీ


హోంగార్డుకు యూనిఫామ్ అందిస్తున్న ఎస్పీ

కడప, క్రైం : పోలీసు సిబ్బంది, హోంగార్డుల సంక్షేమానికి కృషి చేస్తామని ఎస్పీ అట్టాడ బాబూజీ అన్నారు. హోంగార్డులకు మంజూరైన యూనిఫామ్ కిట్లను శనివారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాకు 150కిట్లు మంజూరయ్యాయని హోంగార్డులు పోలీసులతో సమానంగా పనిచేస్తున్నారని వారి అభివృద్ధికికృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ విజయకుమార్ పాల్గొన్నారు.

ఒత్తిడిని తగ్గించేందుకే శిక్షణ తరగతులు

కడప, ఎర్రముక్కపల్లె : విద్యార్థుల్లో ఒత్తిడిని తగ్గించేందుకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లుసెయింట్‌జోసెఫ్ కళాశాల కరస్పాండెంట్ బాలస్వామిరెడ్డి పేర్కొన్నారు. కడప సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాలలో శనివారం విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం పెంపొందించేందుకు ఎడ్యుకేషనల్ సైకాలజిస్టులతో అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు చదువు,ఆటతోపాటు విజ్ఞానం పెంపొందించేందుకు మానసిక వ్యక్తిత్వ వికాసం అలవరచుటకు ఈ శిక్షణ దోహదపడతాయన్నారు. ప్రిన్సిపాల్ రజనీకాంత్ , సైకాలజిస్టులు షేక్‌అబ్దుల్, కరీముల్లా, హుసేన్ , ఎన్ ఎస్ఎస్ పీవో బాబు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న సైకాలజిస్టులు


హాజరైన విద్యార్థులు

సినిమా గైడ్
కడప సినిమాలు

మురళి	: గౌతమ్‌నంద
రవి	: ఫిదా
సుధ	: దర్శకుడు
ప్రతాప్	: వాసుకి
అమీర్	: దండుపాళ్యం-2
రమేష్	: గౌతమ్‌నంద
తాహర్	: నిన్నుకోరి
అప్సర	: నక్షత్రం
రాజా	: నక్షత్రం
ఎస్ఆర్	: జెబ్ మేరి

పాహిమాం.. పవన సుతా...

● ఘనంగా
రెండో శ్రావణ శనివార వేడుకలు

రాయచోటిటౌన్: శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా రాయచోటి పట్టణంతో పాటు మండల పరిధిలోని పలు ఆంజనేయస్వామి ఆలయాల్లో రెండో శ్రావణ శనివారం వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గాలివీడు మార్గంలోని ప్రసన్నఆంజనేయస్వామి దేవస్థానంలో ఆలయ అర్చకులు స్వామికి ఆకుపూజలు నిర్వహించడంతో పాటు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. అలాగే రాయచోటి-సుండుపల్లె మార్గంలోని సద్దికూళ్లవంక వద్ద ఉన్న అభయాంజనేయస్వామి ఆలయంలో శనివార పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తుల సౌకర్యార్థం అన్నదానం చేశారు. అలాగే పెమ్మాడపల్లె, మాసాపేట గుండాంజనేయస్వామి ఆలయాల్లో, బొట్లచెరువు పంచముఖ ఆంజనేయస్వామి ఆలయాలకు భక్తుల తాకిడి పెరిగింది.

రామాపురంలో...: పవిత్ర శ్రావణమాసంలో భాగంగా రెండో శనివారం మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో ఉన్న ఆంజనేయస్వామి ఆలయాల్లో పూజలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా చిట్లూరు గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో మురళీకృష్ణ దంపతులు ఘనంగా ఘట్టాభిషేకం, అకుపూజలు నిర్వహించారు. అలాగే కంభారాయునిగుట్ట, గువ్వలచెరువు ఘాట్ రోడ్డులోని ఆంజనేయ స్వామి దేవాలయాల్లో అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

గాలివీడులో...: శ్రావణమాసంలో శ్రీరామ భక్తుడైన శ్రీవీరాంజనేయస్వామిని దర్శిస్తే సకల పాపాలు హరిస్తాయని వేదపండితులు నాగఫణికిశోర్ శర్మ పేర్కొన్నారు. పరమపవిత్ర శ్రావణమాసం రెండో శనివారోత్సవాల్లో భాగంగా అరవీడు శ్రీఆంజనేయ స్వామి ఆలయంలో మూలవిరాట్ మూర్తికి వివిధ రకాల అభిషేకాలను నిర్వహించారు. అలాగే మండలంలోని పాపాఘ్ని నదిలో సహజ సిద్ధంగా ఏర్పడిన గండి మడుగులో భక్తాదులు స్నానాలు చేసి సమీపంలోని ఆంజనేయ, ఉమామహేశ్వర స్వామిని దర్శనం చేసుకున్నారు. మండలంలోని నూలివీడు పంచాయతీ నాగూరివాండ్లపల్లె, గోపనపల్లె పంచాయతీ సీపరంవాండ్లపల్లె, సీసీపల్లె పంచాయతీ వడ్డెపల్లెలో ఉన్న ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

లక్కిరెడ్డిపల్లెలో...: మండలంలోని విశ్వభారతి హైస్కూల్‌కు సమీపంలోని శివాలయంలో శ్రావణ మాసం రెండో శనివారం పురస్కరించుకుని శివునికి, ఆంజనేయస్వామికి పూజలు నిర్వహించారు. భక్తులు పాల్గొని ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విశ్వభారతి పాఠశాల యాజమాన్యం రామచంద్రయ్య, రఘునాధరాజు, గంగరాజు, రవికుమార్ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.


పూజలందుకుంటున్న ఆంజనేయస్వామి


ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి


లక్కిరెడ్డిపల్లెలో అన్నదానం చేస్తున్న దృశ్యం

8న కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

చిన్నమండెం: ఎస్టీ, ఎస్సీ, బీసీ, కాపు, మైనార్టీ కార్పొరేషన్ల రుణాలకు అభ్యర్థులకు ఈనెల 8వ తేదీన స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ వెంకటరమణారెడ్డి, మండల కార్యాలయ పర్యవేక్షకులు శివశంకర్ తెలిపారు. చిన్నమండెం ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు, స్టేట్ బ్యాంకు, చాకిబండ స్టేట్‌బ్యాంకు, రాయచోటి స్టేట్‌బ్యాంకు అధికారులు ఈ ఇంటర్వ్యూలకు హాజరవుతారన్నారు. అభ్యర్థులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లు, దరఖాస్తు పత్రాలతో హాజరు కావాలని కోరారు.

నలుగురు జూదరుల అరెస్టు

● 5130 నగదు స్వాధీనం

చిన్నమండెం: మండలంలోని మల్లూరు గ్రామం సమీపంలోని గండమాను గుట్ట వద్ద నిర్వహిస్తున్న జూదశాలపైశనివారం రాత్రి దాడి చేసి నలగురు జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.5130 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే దేవగుడిపల్లెలో నిర్వహిస్తున్న బెల్ట్‌షాపుపై దాడి చేసి ఒకరిని అరెస్టు చేసి 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారం మేరకు వెంకటనాగులును అదుపులోకి తీసుకుని రిమాండుకు పంపామని ఎస్ఐ తెలిపారు.

డంపింగ్ యార్డులకు స్థలాలు సేకరించండి

గాలివీడు: మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో చెత్తను నిల్వ చేయడానికి డంపింగ్ యార్డుల కోసం స్థలాలను సేకరించాల్సిందిగా ఎంపీడీవో వెంకటసుబ్బయ్య పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కేవలం గాలివీడు, నూలివీడు, గరుగుపల్లె, వెలిగల్లు, అరవీడు గ్రామ పంచాయతీలకు మాత్రమే డంపింగ్ యార్డులు మంజూరయ్యాయన్నారు. ప్రస్తుతం మిగిలిన అన్ని పంచాయతీల్లో డంపింగ్‌యార్డుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ సురేష్, ఈసీ బాలవర్ధిరాజు, సర్పంచ్‌లు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఘాట్‌లో ట్యాంకర్ బోల్తా - డ్రైవర్‌కు గాయాలు

రామాపురం: కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి గువ్వలచెరువు ఘాట్ రోడ్డు నాల్గవ మలుపు వద్ద శనివారం అదుపు తప్పి ట్యాంకర్ బోల్తాపడడంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలైనట్లు ఎస్ఐ క్రిష్ణమూర్తి తెలిపారు. తమిళనాడుకు చెందిన టీఎన్02 బీఏ 5769 నెంబరు గల ట్యాంకర్ గువ్వలచెరువు ఘాట్‌లో మలుపు వద్దకు రాగానే అదుపు తప్పి బోల్తాపడింది. దీంతో డ్రైవర్ పళణిముత్తుకు తీవ్రగాయాలు కావడంతో 108 వాహనంలో రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆర్థిక నేరస్థుడు వేదాలు వల్లిస్తే ప్రజలు నమ్మరు

రాయచోటిటౌన్: లక్షల కోట్ల రూపాయల అక్రమార్జనకు పాల్పడిన ఆర్థిక నేరస్థుడు వేదాలు వల్లిస్తే ప్రజలు నమ్మరని, మూడుసార్లు ముఖ్యమంత్రిగా ఉన్న మచ్చలేని చంద్రబాబును జగన్ విమర్శించడమా అని తెలుగుదేశం పార్టీ రాయచోటి మండలశాఖ అధ్యక్షుడు మురికినాటి వెంకటసుబ్బారెడ్డి, చిన్నమండెం మండల అధ్యక్షుడు బెల్లం నరసింహారెడ్డి, టీడీపీ జిల్లా కోశాధికారి గుర్రం సుబ్బయ్యనాయుడు పేర్కొన్నారు. శనివారం వారు స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డికి చంద్రబాబు స్థాయి రావాలంటే మరో వంద సంవత్సరాలు పడుతుందన్నారు. ఆర్థిక నేరగాళ్లు ఉగ్రవాదుల కంటే సమాజానికి ప్రమాదకరమైన వ్యక్తులని, వేలకోట్లు దోచుకుని పలు కేసుల్లో జైలుశిక్ష అనుభవించిన జగన్ చంద్రబాబును విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. ముఖ్యమంత్రిని నడిరోడ్డులో కాల్చి చంపాలని మాట్లాడిన జగన్‌ను ఓటు అనే ఆయుధంతో ఉప ఎన్నికల్లో ప్రజలే కాల్చి చంపేరోజులు దగ్గర పడ్డాయన్నారు. వైసీపీ నేతలు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడకపోతే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఇప్పటికైనా ప్రజలను మోసగించే ప్రయత్నాలు మానుకుని రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని హితవు పలికారు. కార్యక్రమంలో సర్పంచులు బసయ్య, సహదేవరెడ్డి, జిలానీబాషా, ఎంపీటీసీ మల్లికార్జున, టీడీపీ నేతలు చింతం సుబ్బారెడ్డి, చంద్ర, ఆంజినేయులు, గుడి రఘునాధ, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

మెలకువలు పాటిస్తే మంచి దిగుబడులు పొందవచ్చు

రామాపురం: దోస, పుచ్చతోటల సాగులో రైతులు మెలకువలు పాటిస్తే మంచి దిగుబడులు పొందవచ్చునని ఉద్యానశాఖాధికారిణి చందన అన్నారు. మండలంలోని చిట్లూరు కస్పా శివాలయంలో శనివారం ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో పుచ్చ, దోస సాగులో మెలకువలపై రైతులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో అధిక శాతం చిట్లూరు పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో రైతులు పుచ్చ, దోస తోటల సాగుపై ఆసక్తి చూపుతారన్నారు. ఇందుకోసం ఉద్యానశాఖ రిటైర్డ్ జేడీహెచ్ లక్ష్మిరెడ్డితో శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. విత్తనాలు పెట్టిన అనంతరం కలుపు నివారణకు మొక్క రెండు ఆకుల దశలో ఉన్నప్పుడు పాలిథిన్X పట్టకు మొక్క ఉన్న చోట రంధ్రం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏడీ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీఈవోలు ప్రశాంతి, విజయకుమారి, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న లక్ష్మిరెడ్డి

సర్వేను వేగవంతం చేయండి

● ఈవోపీఆర్డీ సురేష్

గాలివీడు: గ్రామ పంచాయతీలోని పక్కా గృహాలు, మురుగు కాల్వలు వంటి వాటిని జియోట్యాటింగ్ చేయడానికి చేస్తున్న సర్వేను వేగవంతం చేయాలని ఈవోపీఆర్‌డీ సురేష్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో పూలికుంట, వెలిగల్లు, నూలివీడు, ప్యారంపల్లె, కొర్లకుంట, గరుగుపల్లె, తలముడిపి, గోరాన్‌చెరువు, ఎగువగొట్టివీడు గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ట్యాబ్‌లను అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు, సర్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

రాయచోటి	
ప్రసాద్	: ఫిదా
గౌతమ్	: గౌతమ్‌నంద
సాయి	: దర్శకుడు
సోనీరాజ్	: ట్యూబ్‌లైట్
గాలివీడు	
పావని	: బాహుబలి-2

చెక్‌డ్యాం నిర్మాణంలో అక్రమాలు జరుగుతున్నా పట్టించుకోరా ?

● ఇరిగేషన్‌ శాఖ ఏఈపై ఎంపీపీ ధ్వజం



ఇరిగేషన్ ఏఈ ప్రతాప్‌రెడ్డిపై ధ్వజమెత్తిన ఎంపీపీ

పోరుమామిళ్ల : మండలంలో చేపడుతున్న చెక్‌డ్యాంల నిర్మాణాల్లో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపణలు వస్తుంటే.. మీరు ఏమి చేస్తున్నారంటూ ఇరిగేషన్‌ శాఖ ఏఈ ప్రతాప్‌రెడ్డిపై ఎంపీపీ చిత్తా విజయప్రతాప్‌రెడ్డి ధ్వజమెత్తారు. శనివారం స్థానిక స్త్రీశక్తిభవనంలో మండల సర్వసభ్యసమావేశం జరిగింది. సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో ఇరిగేషన్‌ శాఖ ఆధ్వర్యంలో పనుల వివరాలు కావాలన్నా, అధికారులను ప్రాధేయపడాల్సి వస్తుందన్నారు. నీరు-చెట్టు చేపడుతున్న పనులను నాసిరకంగా చేస్తున్నా ఏం చేస్తున్నారని ఏఈ ప్రతాప్‌రెడ్డిని ప్రశ్నించారు. ఈ పను లు కాంట్రాక్టర్ల కోసమా, ప్రజల కోసమా అని ప్రశ్నించారు. గానుగపెంట ఎంపీటీసీ వెంగల్‌రెడ్డి మాట్లాడుతూ రేపల్లె చెరువుదగ్గర భూములు సరిగాలేవని, అలుగు అధ్వానంగా ఉందని, రైతుల పొలాలకు మట్టితవ్వడం నిలిపివేశారని సభ దృష్టికి తెచ్చారు. అనంతరం రెవెన్యూ, విద్య, ఐసీడీఎస్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, విద్యుత్తుశాఖల పనితీరుపై సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామక్రిష్ణయ్య, డిప్యూటీ తహసీల్దార్ ఆయూబ్‌ఖాన్‌, ఎంపీటీసీ కవలకూరి నడిపి వెంకటసుబ్బయ్య, శెట్యం ప్రతాప్, మండల కోఆప్షన్‌ సభ్యులు ఇస్సాక్, సిద్దవరం సర్పంచ్‌ సునీల్‌కుమార్, పీఆర్‌ఏఇ ఇంజనేయప్రసాద్, ఏపీఓ శివశంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జూనియర్ పోటీలకు డిగ్రీకళాశాల విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ బృందం

పోరుమామిళ్ల : ఈ నెల 19, 20 , 21 తేదీల్లో ప్రొద్దుటూరులో నిర్వహించే రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్ పోటీలకు ప్రభుత్వ డిగ్రీకళాశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ఆదినారాయణరెడ్డి తెలిపారు. ఈనెల 3న ప్రొద్దుటూరు ఎస్వీఎన్‌ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా అథ్లెటిక్ పోటీలు జరిగాయన్నారు. ఈ పోటీల్లో పోరుమామిళ్ల ప్రభుత్వడిగ్రీ కళాశాల విద్యార్థులు లక్షుమయ్య 400 మీటర్ల పరుగుపందెంలో ప్రథమ స్థానం, సుబ్రహ్మణ్యం 400 మీటర్ల పరుగుపందెంలో ద్వితీయస్థానం, 100మీటర్ల పరుగుపందెంలో ప్రథమ స్థానం, రవికుమార్ షాట్‌పుట్‌లో ప్రథమస్థానం, బాషా 400మీటర్ల పరుగు పందెంలో 3వ స్థానం, కేవల క్రిష్ణ 100మీ టర్ల పరుగుపందెంలో 3వ స్థానంలో రాణించారన్నారు. ఈ సందర్భంగా వారిని శనివారం కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

1000 ఎకరాల్లో ఎండిన సజ్జ పంట

శంఖవరం వద్ద ఎండిన సజ్జపైరు



కలసపాడు : మండల వ్యాప్తంగా రైతులు సాగు చేసిన సజ్జపంట 1000 ఎకరాల్లో పూర్తిగా ఎండిపోయింది. రెండు నెలల క్రితం వర్షాలు పడుతుండటంతో రైతన్నలు సజ్జపంటను సాగు చేశారు. ముఖ్యంగా పెండ్లిమర్రి, శంఖవరం, లింగారెడ్డిపల్లె, ముద్దిరెడ్డిపల్లె, మహానందిపల్లె, మామిళ్లపల్లె, పిడుగుపల్లె, కర్ణంవారిపల్లె గ్రామాల్లో సజ్జంపటను సాగు చేశారు. అయితే చిరుపొట్టదశలోనే వర్షాలు లేకపోవడంతో పూర్తిగా సజ్జపంట ఎండిపోయింది. సజ్జపంటను రక్షించేందుకు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నీటి తడులను ఇవ్వడానికి కూడా మార్గం లేకపోయింది. కనీసం పశుగ్రామానికి కూడా పనికిరాదని రైతన్నలు వాపోతున్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి రైతన్నలను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అమ్మపాలు అమృతంలాంటివి

గోపవరం : బిడ్డకు అమ్మపాలు అమృతంలాంటివని బెడుసుపల్లె అంగన్వాడీ టీచర్ రాధమ్మ పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని బెడుసుపల్లె లో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సెంటర్ పరిధిలో ఉన్న గర్భిణులు, బాలింతలతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తల్లిపాలు విశిష్ఠతను తెలియజేశారు. ముర్రుపాలలో ఎన్నో పోషకవిలువలు ఉన్నాయని, బిడ్డపుట్టిన వెంటనే పిల్లలకు తాపించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. అంగన్వాడీ సెంటర్ల ద్వారా గర్భవతులకు, బాలింతలకు, చిన్నారులకు ఇచ్చేటువంటి పోషకాహార వివరాలను వారికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సెంటర్ల పరిధిలోని బాలింతలు, గర్భిణులు, కిశోర బాలలు, పాల్గొన్నారు.

బదిలీపై వెళుతున్న టీచర్లకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న స్కూలు కమిటీ సభ్యులు

గోపవరం : మండలంలోని సంగసముద్రం ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులు చాటకొండు సుబ్బారావు, ప్రభుదాసులను పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో కమిటీ చైర్మన్‌ ఈర్లరంగయ్య ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలను ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు ఎంతగానో కృషి చేశారన్నారు. వీరిస్థానంలో వస్తున్న ఉపాధ్యాయులు కూడా పాఠశాల, విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

పోరుమామిళ్ల : మండలంలోని నర్సింగ్‌పల్లె అనాథాశ్రమంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కడప హిమాలయ సూపర్‌స్పెషాలిటీ వైద్యబృం దం కీళ్లనొప్పులు, యూరాలజీకి సంబంధించిన వ్యాధులకు ఉచిత వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సబ్సిడీ రుణాల ఆన్‌లైన్ దరఖాస్తుదారులకు 9న ఇంటర్వ్యూలు

ఎర్రగుంట్ల: ఎర్రగుంట్ల నగరపంచాయతీ పరిధిలోని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ బీసీ, కాపు కార్పొరేషన్ రుణాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 9వ తేదీన బుధవారం ఉదయం 10గంట నుంచి సాయంత్రం 5గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు నగర పంచాయతీ మేనేజర్ జి.రేంద్రప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2017-18 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఈ వ్యక్తి గత లోన్లకోసం దరఖాస్తు చేసుకున్న వారు తమ సర్టిఫికెట్లతో రావాలని ఆయన కోరారు.

అవీ.. ఇవీ

సీమ కరువును పట్టించుకోని ముఖ్యమంత్రి



విద్యార్థులతో మాట్లాడుతున్న దృశ్యం

ఎర్రగుంట్ల: రాయలసీమ కరువును, నిరుద్యోగులను, వలసలను ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టించుకోకుండా కోస్తాంధ్రలో అభివృద్ధిని, అక్కడ నిర్మిస్తున్న రాజధానిపై శ్రద్ధ చూపుతున్నారని ఆర్‌ఎస్ఎఫ్ జిల్లా కమిటీ సభ్యుడు ఎం.జగదీష్ విమర్శించారు. శనివారం ఎర్రగుంట్ల డిగ్రీ కళాశాలలో మాట్లాడుతూ సీఎం సీమలోని ప్రజలను మనుషులుగా గుర్తించడంలేదన్నారు. అమరావతిలోని ఉద్యోగాలన్నీ కోస్తాంధ్ర వారికి కట్టబెట్టి సీమ నిరుద్యోగులకు మొండిచేయు చూపెడుతున్నారన్నారు. అహద్ ఖాన్, శశికుమార్, రెడ్డయ్య, మల్లాకార్జున, సునల్‌కుమార్‌లు తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభల్లో లబ్ధిదారుల గుర్తింపు



వద్దిరాలలో గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం

మైలవరం: మండలంలోని వద్దిరాల పంచాయతీలో శనివారం నిర్వహించిన గ్రామసభలో సర్పంచ్ రామగోవిందు, హౌసింగ్ ఏఈ బ్రహ్మానందరెడ్డి, అధికారులు రమణారెడ్డిలు పాల్గొని లబ్ధిదారుల జాబితాను చదివి వినిపించారు. వద్దిరాలలో స్మార్ట్‌పల్స్ సర్వే, ఇంటింటి సర్వే చేసే సమయంలో 241 మందికి ఇళ్లు లేవని అధికారులకు తెలిపారు. ఏఈ బ్రహ్మానందరెడ్డి తెలిపారు. అర్హులందరికీ ప్రభుత్వం గృహాలను మంజూరు చేస్తుందన్నారు.

ఈనెల 9,11 తేదీల్లో రుణాలకు ఇంటర్వ్యూలు

మైలవరం: ఈనెల 9, 11వ తేదీల్లో మండలంలోని కాపు, బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ వర్గాలకు చెందినవారు సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నవారికి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నారాయణరెడ్డి తెలిపారు. శనివారం తన కార్యాలయంలో ఎంపీడీవో నారాయణరెడ్డి మాట్లాడుతూ 9వ తేదీ కాపు, బీసీలకు, 11వ తేదీన శుక్రవారం ఎస్సీ, ఎస్టీ మైనార్టీలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు కేటాయించిన తేదీల్లో ఎంపీడీవో కార్యాలయ సభాభవనంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలన్నారు.

ఎర్రగుంట్లలో... 2017-2018 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ బీసీ, కాపు కార్పొరేషన్ల రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 11వ తేదీన ఎర్రగుంట్ల ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శివకుమారి తెలిపారు. 11వ తేదీ ఉదయం ఎర్రగుంట్లలోని ఎస్‌బీఐ, పొట్లదుర్తిలోని ఏపీజీబీ బ్యాంకుల్లో రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు, మధ్యాహ్నం 2గంటలకు చిలమకూరులోని ఏపీజీబీ, ఎస్‌బీఐ, సిండికేట్ బ్యాంకుల్లో దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని ఎంపీడీవో శివకుమారి తెలిపారు. అభ్యర్థులు తమ వెంట ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకుని తప్పక హాజరుకావాలని తెలిపారు. 239 బీసీలు, 113కాపు, మైనార్టి 15, ఎస్టీ 10, ఎస్సీ 300 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు వివరించారు.

ఐటీఐ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

జమ్మలమడుగు: జమ్మలమడుగు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో మిగిలిన సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ ఐటీఐ ప్రధాన అధికారి కుమార్ తెలిపారు. దరఖాస్తులు జమ్మలమడుగు ఐటీఐ కళాశాలలో లభిస్తాయని పూర్తి చేసిన దరఖాస్తులు ఈనెల 15న సాయంత్రం 5లోపు అందజేయాలన్నారు.

కార్మికుల పొట్టకొడుతున్న ముఖ్యమంత్రి

కొండాపురం : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కార్మికుల పొట్టకొడుతున్నారని ఏఐటీయూసీ సంఘం సభ్యులు ఆరోపించారు. జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో శనివారం కొండాపురంలో ర్యాలీ నిర్వహించారు. ఇటీవల ముఖ్యమంత్రి భవన నిర్మాణ కార్మిక సంక్షేమ సంఘం నుంచి రూ. 20కోట్లను దారి మళ్లించారన్నారు. దీనివలన కార్మికుల కడుపుకొట్టడానికి ముఖ్యమంత్రి కంకణం కట్టుకున్నారన్నారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ఉండాలంటే రాబోయే ఎన్నికల్లో కార్మికులంతా ఒకటై తమ సత్తా చూపించాలన్నారు. ఇప్పటికైనా కార్మిక సంక్షేమ నిధులను సంక్షేమ నిధికి కేటాయించి కార్మిక సంక్షేమం కోసం ప్రభుత్వం పాటుపడాలని వారు డిమాండ్ చేశారు. జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యదర్శి వెంకటసుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి మనోహర్‌బాబు, వెంకటరమణ, చిన్న, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

అడ్డంగా ఇసుక నిల్వలు



జమ్మలమడుగు రూరల్: జమ్మలమడుగు అర్బన్ పోలీసు స్టేషన్ ఆవరణంలో ఇసుక డంపులు అడ్డంగా మారాయి. అలాగే ప్రమాదాలకు గురైన వాహనాలు, ఇనుప వస్తువులు అడ్డంగా మారి వాహనాలు పెట్టుకోవడానికి కూడా ఇబ్బందికరంగా మారింది. పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లను నిలిపి ఉన్నారు. పోలీసుల వాహనాలు కూడా పెట్టుకోవడానికి సమస్యగా మారిందని వాపోతున్నారు. ఇప్పటికైనా వచ్చిన కొత్త అధికారులు ఇసుక డంపులను, ఇనుప వస్తువులను తొలగించాలని కోరుతున్నారు.

5ఎంజెఎంఎల్5 - అధ్వాన్నంగా ఉన్న రోడ్డు

రోడ్డు వేయండి సారూ...



అధ్వానంగా ఉన్న రోడ్డు

మైలవరం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న వీధిలో సిమెంటు లేక అధ్వాన్నంగా రోడ్డు తయారైందని వీధి ప్రజలు వాపోతున్నారు. పశువైద్యశాల నుంచి వెళ్లే రోడ్డులో కూడారోడ్డుకు ఇరువైపుల కంపచెట్లు పెరిగి రోడ్డు వెంట పారిశుద్ధ్యం అధ్వాన్నంగా తయారైందన్నారు. వర్షం వస్తే వీధిలో అధ్వాన్నంగా ఉండి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు స్పందించి సిమెంటు రోడ్డు వేయాలని కోరుతున్నారు.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు- సీఐ



పట్టుబడిన నాపరాయి ట్రాక్టర్

జమ్మలమడుగు రూరల్: జమ్మలమడుగులో పోలీసు నిబంధనలు ప్రజలు పాటించాలని అర్బన్ సీఐ ప్రవీణ్ కుమార్ సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ అర్బన్ స్టేషన్ పరిధిలో ఉన్న ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వడంలో సహకారం ఇవ్వాలన్నారు. అలాంటివారిపేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే వెంటనే తెలుపాలన్నారు. వాహనాల తనిఖీలు ప్రతి రోజు చేస్తున్నామన్నారు. ప్రమాదాల నివారణకు ఉన్నతాధికారులు ఇలాంటి చర్యలు తీసుకున్నారన్నారు. వారి ఆదేశాల మేరకు పట్టణంలో క్రికెట్ బెట్టింగ్, జూదం, మట్కా తదితర అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వాహనాల తనిఖీలు ముమ్మరంగా చేపడుతున్నామన్నారు. ఇసుక ట్రాక్టర్ల యజమానులు ఉదయం 6 నుంచి సాయంత్రం 5 గంటలలోపు తీసుకెళ్లాలన్నారు. తనిఖీల్లో మొద్దులు తరలించే ట్రాక్టర్, నాపరాళ్లు కలిగిన ట్రాక్టర్, ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని జరిమానాలు విధించామన్నారు. సిబ్బంది కూడా బాగా పనిచేయాలని ఆయన సూచించారు.

నిబంధనలు పాటించని భవనాలపై టాస్క్‌ఫోర్స్ టీం దాడి

జమ్మలమడుగు రూరల్: నగర పంచాయతీ పరిధిలో నిర్మాణంలో నిబంధనలు పాటించని భవనాలపై శనివారం టాస్క్‌ఫోర్స్ టీం దాడి చేసిందని నగర పంచాయతీ ఇన్‌చార్జి కమిషనర్ సువర్ణలక్ష్మి తెలిపారు. ముద్దనూరు రోడ్డు, భాగ్యనగర్ కాలనీ, కన్నెలూరులో కొన్ని భవనాలను కూల్చేసినట్లు తెలిపారు. టాస్క్‌ఫోర్స్‌టీంలో జమ్మలమడుగు పట్టణ టౌన్‌ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్‌సీర్ ఎస్ఎం అంజాద్‌బాష, కడప డీటీసీ టీపీవో రేవోపతి, కడప టౌన్‌ప్లానింగ్ అధికారి ఆసీఫ్, పులివెందుల టౌన్‌ప్లానింగ్ అధికారి కృష్ణసింగ్, ప్రొద్దుటూరు టీపీఎస్ శిరీష, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు.

సుధీర్‌రెడ్డి క్షేమంగా రావాలని పూజలు

పెద్దముడియం: జమ్మలమడుగు వైసీపీ ఇన్‌చార్జి సుధీర్‌రెడ్డి క్షేమంగా ఇంటికి రావాలని పెద్దముడియం మండల వైసీపీ నాయకులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గతనెల 31వ తేదీన కారు ప్రమాదంలో గాయపడిన సుధీర్‌రెడ్డి ఆరోగ్యంగా త్వరగా కోలుకోవాలని పెద్దముడియం నాయకులు పూజలు నిర్వహించారు. మండల కేంద్రమైన పెద్దముడియంలోని కోదండరామస్వామి దేవాలయంలో వెలసిన ఆంజనేయస్వామికి ప్రత్యేకంగా ఆకుపూజ నిర్వహించారు. అనంతరం 108 కొబ్బరికాయలు కొట్టి మొక్కుబడులు చెల్లించారు. పెద్దముడియం మండల వైసీపీ యువనాయకుడు కలిమి వెంకటేశ్వర్‌రెడ్డి, అంజిరెడ్డి, రాజారెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పోలీసులకు టీఎన్ఎస్ఎఫ్ ఫిర్యాదు

జమ్మలమడుగు రూరల్: నంద్యాల బహిరంగ సభలో సీఎం చంద్రబాబును నడిరోడ్డుపై కాల్చి చంపినా పాపంలేదంటూ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మాట్లాడటం శాంతి భద్రతలు భంగం వాటిల్లే విధంగా ప్రజలను రెచ్చగొట్టారన్నారు. ఆ విధంగా మాట్లాడినందుకు జమ్మలమడుగు అర్బన్ పోలీసు స్టేషన్‌లో సీఐ ప్రవీణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేసినట్లు టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గజ్జెల గోవిందు తెలిపారు. ఆయన మాట్లాడుతూ నంద్యాలలో ఎవరెన్ని చెప్పినా టీడీపీ గెలుపు ఖాయమన్నారు.

జీవో 279ని రద్దు చేయాలి

జమ్మలమడుగు రూరల్: మున్సిపల్ కార్మికుల పొట్టకొట్టే జీవోనెం.279ని ప్రభుత్వం వెంటనే రద్దు చేసి టెండర్లు ఆపివేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సిరివెల్ల లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కార్మికుల పనులను ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు ప్రభుత్వం 279 జీవో తెచ్చిందన్నారు. దాని ద్వారా మున్సిపల్ కార్మికులకు ఇబ్బంది కలిగిస్తోందన్నారు.

చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాల ఏర్పాటు



మైలవరం: మండలంలోని 19 పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాలను ఏర్పాటు చేసి పారిశుద్ధ్యానికి ప్రాధాన్యమిస్తున్నట్లు ఎంపీడీవో నారాయణరెడ్డి, ఉపాధి హామీ ఏపీవో వెంకటసుబ్బయ్య తెలిపారు. శనివారం ఎంపీడీవో కార్యాలయ సభాభవనంలో మండలంలోని అధికారులకు, ప్రజాప్రతినిధులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని పంచాయతీల్లో చెత్తనుండి సంపద తయారు చేయు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించిందన్నారు. అందుకోసం అన్ని పంచాయతీల్లో ఒక్కో పంచాయతీలో 15 నుంచి 20 సెంట్ల స్థలాన్ని ఈనెల 7వ తేదీలోపు చూడాలని 8వ తేదీ స్థల సమస్యలు, 9 నుంచి 11వ తేదీ వరకు స్థలానికి సంబంధించిన ప్రతిపాదనలు కేంద్రానికి అయ్యే ఖర్చు అంచనాలు తయారు చేసి మండల ప్లాన్ గ్రామ కార్యాలయాలకు పంపించాలని, 14వ తేదీ పరిపాలన అనుమతులు 16వ తేదీ నుండి చెత్తనుండి సంపద తయారు చేయు పనులు ప్రారంభించాలన్నారు. అందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని త్వరగా పనులు పూర్తయ్యేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఉపాధి హామీ సిబ్బంది, తదితర అధికారులు పాల్గొన్నారు.

ఎంబీఏ నూతన విద్యార్థులకు ఓరియంటేషన్

కడప, అర్బన్: కేఎస్ఆర్ఎం కాలేజీ ఆఫ్‌మేనేజ్‌మెంట్ స్టడీస్‌లో ఎంబీఏ నూతన మేనేజ్‌మెంట్ విద్యార్థులకు శనివారం ఓరియంటేషన్ ప్రోగ్రాం జరిగింది. కార్యక్రమంలో కరస్పాండెంట్ కందుల శివానందరెడ్డి, ప్రిన్సిపాల్ క్రిష్ణమోహన్ , కేఓఆర్ఎం ప్రిన్సిపాల్‌డాక్టర్ శ్రీధర్, కేఎల్ఎం కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఖాజాపీర్ మాట్లాడారు. అన్ని సదుపాయాలు కల్పించి నిష్ణాతులైన ఉపాధ్యాయులతో చక్కటి విద్యాబోధన చేయిస్తున్నామన్నారు. కొత్తగా చేరిన విద్యార్థులు ఉపయోగించుకుని బంగారు భవిష్యత్ కు బాటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వాతావరణ సమతుల్యాన్ని కాపాడాలి

మొక్కలు నాటి పరిరక్షించాలని సూచించిన కలెక్టర్ బాబూరావునాయుడు




మొక్కలు నాటుతున్న కలెక్టర్, చిన్నారితో మాట్లాడుతున్న కలెక్టర్

కడప, ఐటీఐసర్కిల్: భూమి మీద జీవరాశులకు ప్రాణవాయువునిచ్చే మొక్కలను మానవుడు అవసరాల కోసం విచ్చలవిడిగా నరికేస్తున్నాడు. దీంతో భూ వాతావరణం వేడెక్కి వాతావరణంలో పలు మార్పులకు అవకాశం ఏర్పడుతోంది. ఈ పరిస్థితులను నివారించి వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి పరిరక్షించాల్సిన అవసరం ఎంతైనా వుందని కలెక్టర్ బాబూరావు నాయుడు పేర్కొన్నారు. ప్రకాష్‌నగర్‌లోని ప్రభుత్వ కళాశాల బాలుర వసతి గృహ ప్రాంగణంలో శనివారం కొబ్బరిచెట్లు నాటారు. కార్యక్రమంలో కలెక్టర్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ సమతుల్యానికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూతాపాన్ని తగ్గించేందుకు భారీ ఎత్తున మొక్కలు నాటాలన్నారు. అందుకు అనుగుణంగా జిల్లాలోఈ ఏడాది 50లక్షలు మొక్కలు నాటేందుకు ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణలో, స్కూళ్లలో, హాస్టళ్లలో ప్రతి గ్రామ పంచాయతీల్లో కిలోమీటరు మేర రోడ్లకు ఇరువైపులా ప్రభుత్వ ఖాళీస్థలాల్లో భారీగా మొక్కలు నాటాలన్నారు. తాము కూడా పాల్గొంటామని ప్లాంటేషన్ అండ్ ప్రొటెక్షన్ అసోసియేషన్ వారు ముందుకు వచ్చి ప్రారంభ కార్యక్రమంలో భాగంగా బాలుర వసతి గృహంలో కొబ్బరి మొక్కలు నాటడం సంతోషదాయకమన్నారు. హాస్టల్ విద్యార్థులకు ప్రభుత్వం ఉచితం విద్యను అందించడమే కాక మంచి పౌష్టికాహారాన్ని అందిస్తోందన్నారు. ప్రభుత్వం కల్పించిన ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉజ్వల భవిష్యత్ కు పునాదులు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డన్ వెంకటసుబ్బయ్య, ప్లాంటేషన్ అండ్ ప్రొటెక్షన్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలియ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన పాలకొండరాయస్వామి దేవస్థానం

కడప, మారుతీనగర్: శ్రావణమాస ఉత్సవాలను పురస్కరించుకుని రిమ్స్ సమీప పాలకొండరాయస్వామి దేవస్థానం రెండోశనివారం భక్తులతో కిటకిటలాడింది. సుమారు 3వేల మంది భక్తులు స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి అమ్మవార్లకు అభిషేకం గావించి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలతోపాటు అన్నదానం నిర్వహించారు. కడప ప్రభుత్వ బాలికల కళాశాల ఎన్ ఎస్ఎస్ విద్యార్థినులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆరేళ్లుగా ఎన్ ఎస్ఎస్‌ప్రోగ్రామ్ ఆఫీసర్ రామాంజుల రెడ్డి ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమాలు అందిస్తున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీధర్, బీజేపీ నేతలు సాంబశివారెడ్డి, శ్రీనివాసులు, హరినారాయణరావు, ధర్మకర్తలు లక్ష్మీనారాయణరెడ్డి, మురళీమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళాభ్యుదయమే మోదీ అభిమతం



జిల్లా అధ్యక్షునికి రాఖీ కడుతున్న రాష్ట్ర అధ్యక్షురాలు

కడప, మారుతీనగర్: మహిళాభ్యుదయమే ప్రధానమంత్రి మోదీ అభిమతమని భారతీయజనతా మహిళామోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు మాలతీరాణి పేర్కొన్నారు. కులమతాలకు పార్టీలకు అతీతంగా దేశంలోని అన్ని వర్గాల మహిళల అభివృద్ధి కోసం కేంద్రం పలు సంక్షేమపథకాలు ప్రవేశపెట్టిందన్నారు. జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు భవానీరెడ్డి అధ్యక్షతన చిన్నచౌకు అమోఘ హోండా షోరూం సమావేశ భవనంలో భారతీయ జనతా మహిళా మోర్చ జిల్లా కార్యవర్గ సమావేశానికి మాలతిరాణి హాజరై మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో విద్యార్థుల సౌకర్యార్థం మరుగుదొడ్ల ఏర్పాటుకు, ప్రతి ఇంట్లో మరుగుదొడ్డి సౌకర్యం వుండేలా ప్రధాని తీసుకున్న చొరవ ప్రశంసనీయమన్నారు. బాలికలు ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడం కోసం బేటీబచావో బేటీ పడావో పథకం ద్వారా ఆడపిల్లల నిష్పత్తి పెంచేందుకు దోహదపడుతుందన్నారు. బాలికల పట్ల వివక్ష నిర్మూలించేలా భ్రూణహత్యలను అరికట్టేలా ప్రజలను చైతన్యపరుస్తూ బాలికా విద్యను ప్రోత్సహిస్తున్న సంగతి తెలిసిందేనన్నారు. మోదీపాలనలో మహిళాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని ప్రభుత్వ పథకాలు మహిళలు అందిపుచ్చుకోవాలన్నారు.

అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనాథ్ రెడ్డికి రాష్ట్ర, జిల్లా మహిళ నాయకురాలు రాఖీ కట్టి ముందస్తు రాఖీ వేడుక చేసుకున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హేమలత, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వసుంధర, గద్దె సరస్వతి, చేపూరి శారదమ్మ, ఛాయాదేవికి చెందిన పలువురు జిల్లాకు చెందిన మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు.

బదిలీల అక్రమాలపై విచారణ జరిపించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప, ఎర్రముక్కపల్లె: ఉపాధ్యాయ బదిలీల్లో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించాలని యూటీఎఫ్‌రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా డిమాండ్ చేశారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శనివారం యూటీఎఫ్ జిల్లా ఆధ్వర్యంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఉపాధ్యాయుల పదోన్నతులు మెరిట్‌కమ్ రోస్టర్ ఆధారంగా నిర్వహించేవారని ఉద్యోగ నియామకాలు చేపట్టిన జాబితా ఆధారంగా పదోన్నతులు కల్పించేవారన్నారు. అయితే అందుకు భిన్నంగా డీఈఓ కేవలం మెరిట్‌ప్రాతిపదికన పదోన్నతులు చేపడుతున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని ఉపాధ్యాయ సంఘాలు డీఈఓ దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదన్నారు. మరిన్ని సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ స్పందిస్తూ డీఈఓను వివరణ కోరారన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రతినిధులు విజయకుమార్, సుబ్బరాజు, హరిప్రసాద్, రవికుమార్, రామాంజనేయులు, పీఈటీ సంఘ నేతలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శని త్రయోదశి

కడప, మారుతీనగర్: శనిత్రయోదశి రోజున శనేశ్వరస్వామిని పూజిస్తే సకల శని దోషాలు తొలగుతాయని నగర అర్చక పురోహిత సమాక్య ఉపాధ్యక్షులు, శనేశ్వరస్వామి దేవస్థానం అర్చకులు వారణాసి శ్రీధర్‌శర్మ పేర్కొన్నారు. శనేశ్వరస్వామికి అత్యంత ప్రీతిపాత్రమైన శనిత్రయోదశి రోజు తైలాభిషేకంతోపాటు స్వామి వారిని పూజిస్తే మన జాతక చక్రంలోని సమస్త దోషాలు తొలగుతాయన్నారు. శని త్రయోదశి సందర్భంగా చిన్నచౌకు రామక్రిష్ణనగర్‌లో సాయినాథుని మందిర ప్రాంగణలో శనేశ్వర విగ్రహం ప్రత్యేక ఆలయంలో ప్రతిష్ట గావించారు.

నాగార్జున మోడల్ స్కూల్‌లో ఫ్రెండ్‌షిప్ డే

కడప, ఎర్రముక్కపల్లె: అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం పురస్కరించుకుని శనివారం నాగార్జున మోడల్‌స్కూలులో ఘనంగా ఫ్రెండ్‌షిప్‌డే నిర్వహించారు. చిన్నారులకు విద్యాసంస్థల చైర్మన్ శివశంకర్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీదేవి శుభాకాంక్షలు తెలిపారు. ఫ్రెండ్‌షిప్ డే విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.



శుభాకాంక్షలు తెలుపుకొంటున్న చిన్నారులు

వర్షం కోసం గండికి పాదయాత్ర

వేంపల్లె: మండలంలోని రామిరెడ్డిపల్లె నుంచి గండి క్షేత్రం వరకు 25కిలోమీటర్ల పాటు భక్తులు పాదయాత్ర చేశారు. వర్షం సమృద్ధిగా కురిసి ప్రజలంతా సుభిక్షంగా ఉండాలన్న తలంపుతో భజన చేస్తూ సాగిన పాదయాత్రలో పెద్దఎత్తున మహిళా భక్తులు పాల్గొన్నారు.

శనివారం గండి ఆంజనేయస్వామి సన్నిధికి చేరుకుని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

కేఎస్ఆర్ఎంకళాశాలలో ఫ్రెండ్‌షిప్ డే



ఫ్రెండ్‌షిప్ డే నిర్వహిస్తున్న దృశ్యం

కడప అర్బన్: కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్‌కళాశాలలో శనివారం ఫ్రెండ్‌షిప్ డే ఘనంగా నిర్వహించారు. మేనేజ్‌మెంట్ కుటుంబ సభ్యురాలు రాజేశ్వరమ్మ మాట్లాడుతూ జీవితంలో స్నేహితులు ముఖ్యపాత్ర వహిస్తారన్నారు. మంచి స్నేహితులను ఎంచుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీఎస్‌మూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

దోమలను పూర్తిస్థాయిలో నిర్మూలించాలి

వేంపల్లె: దోమలను పూర్తిస్థాయిలో నిర్మూలించాలని ఆమ్ ఆద్మీపార్టీ మండల కన్వీనర్ రంతుల్లా పంచాయతీ అధికారులను డిమాండ్ చేశారు. ఏ వీధిలో చూసినా దోమలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయన్నారు. వాటి నివారణ కోసం పంచాయితీ సిబ్బంది ఫాగింగ్ చేస్తున్నా తగ్గలేదని తెలిపారు. పూర్తిస్థాయిలో నివారణకు ఫాగింగ్, మందు పిచికారీ చేయాలని కోరారు. వెలగని వీధిలైట్లను వెంటనే మార్చాలని పంచాయితీ అధికారులను కోరారు. పులివెందుల కన్వీనర్ దాదా పీర్, బాబ్‌జాన్, షఫి, జిలాన్, షరీఫ్, హైదర్ ప్రకటన విడుదల చేసిన వారిలో ఉన్నారు.

తల్లిపాలతో బిడ్డ ఆరోగ్యం శ్రేయస్కరం



సమావేశంలో మాట్లాడుతున్న ఉపసర్పంచు రామ్మోహన్‌రెడ్డి, చిత్రంలో సీడీపీఓ రమాదేవి

సింహాద్రిపురం: తల్లిపాలతో బిడ్డ ఆరోగ్యం శ్రేయస్కరంగా ఉంటుందని సర్పంచు లక్ష్మీపద్మజ, ఉపసర్పంచు రామ్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం సింహాద్రిపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలకు తల్లిపాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు ముర్రుపాలు ఇవ్వడంతో పోషక విలువలు పెరిగి ఆ బిడ్డ ఆరోగ్యంగా ఉండే అవకాశం ఉంటుందన్నారు. తల్లిపాలలో పోషక విలువలు పెరిగేందుకు ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాల్సి ఉంటుందన్నారు. సీడీపీఓ రమాదేవి మాట్లాడుతూ తల్లిపాలలో పోషక విలువలు పెంచుకునేందుకు గర్భిణులు, బాలింతలు అంగన్వాడీ కేంద్రాల్లో ఇస్తున్న పోషక పదార్థాలు తీసుకోవడం మంచిదన్నారు. బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే పిల్లలకు తప్పనిసరిగా తల్లిపాలు ఇవ్వాలన్నారు. కోతపాలు ఇస్తే వారికి ఆరోగ్యరీత్యా ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. పిల్లలకు పాలు ఇవ్వడంలో వచ్చే అపోహ వీడాలన్నారు. తల్లులు ఎండలో బయటకు పోయినప్పుడు వచ్చిన వెంటనే బిడ్డకు పాలు ఇవ్వకూడదన్నారు. పదినిమిషాలైన తర్వాత పాలు ఇవ్వవచ్చన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అంగన్వాడీ కార్యకర్తలు, వైద్యసిబ్బంది, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

తొండూరులో...

తొండూరు: ముర్రుపాలు బిడ్డకు శ్రేష్టమని హెల్త్‌ఎడ్యుకేటర్ రమణమ్మ వివరించారు. మల్లేల అంగన్వాడీ సెంటర్‌లో హెల్త్‌ఎడ్యుకేటర్ రమణమ్మ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించారు. హెచ్ఈ మాట్లాడుతూ బిడ్డపుట్టిన వెంటనే తల్లి ముర్రుపాలు తాగించాలన్నారు. పౌష్టికాహారంతో కలిగే లాభాలను వివరించారు. గర్భిణులకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ జయప్రద, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ, ఏఎన్ఎం చంద్రకళ, చిన్నమ్మ, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

అంజన్నకు బంగారు నామాలు సమర్పణ



బంగారు నామాలు ఏసి, ఛైర్మన్‌కు అందిస్తున్న వెంకటరామిరెడ్డి

చక్రాయపేట: గండి వీరాంజనేయస్వామికి శనివారం పులివెందుల వాసి టెంకాయల వెంకటరామిరెడ్డి బంగారు నామాలను సమర్పించారు. వెంకటరామిరెడ్డి, ఆయన సతీమణి పూజారి కేసరి, సహాయ కమిషనర్ గురుప్రసాద్, ఛైర్మన్ రాజారావుకు అందించారు. గతంలో కూడా ఈయన దేవాలయ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అంతేకాకుండా దేవాలయ అభివృద్ధికి లక్ష రూపాలయ సమర్పించుకుంటానని హామీ ఇచ్చారు. దేవుని కృపతో ఒక స్థాయిలో ఉన్నామన్నారు. పాలక మండలి సభ్యులు వెంకటస్వామి, సుబ్బరాయుడు, అంజనరెడ్డి, బాబు, కుళాయప్ప తదితర సిబ్బంది పాల్గొన్నారు.

అంజన్నకు ప్రత్యేక పూజలు

తొండూరు: శ్రావణమాసం రెండవ శనివారం తొండూరు పాటిమీద ఆంజనేయ స్వామి ఆలయంలో స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ఉదయాన్నే ఆలయ అర్చకుడు నాగరాజశర్మ స్వామివారికి అభిషేక పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులు ఆకుపూజ తదితర పూజాకార్యక్రమాలు నిర్వహించారు. శ్రావణ శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.



పూజలందుకుంటున్న పాటిమీద ఆంజనేయస్వామి

30 మందికి జింక్, జిప్సం పంపిణీ

తొండూరు: మండలంలోని పలు గ్రామాల్లో 30 మంది రైతులకు జింక్, జిప్సం పంపిణీ చేసినట్లు ఏఓ కిషోర్‌నాయక్ తెలిపారు. ప్రభుత్వం ఉచితంగా అందించే జిప్సం, జింక్‌ను 2017లో మట్టి పరీక్షలు చేయించుకున్న రైతులకే పంపిణీ చేస్తారన్నారు. డెల్టాట్రాప్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, కేవలం రూ. 100 చెల్లించి డెల్టాట్రాప్‌ను తీసుకోవాలన్నారు. దీని వలన పత్తిని ఆశించే గులాబి రంగు పురుగు నివారించవచ్చన్నారు. పచ్చదోమ, తెల్లదోమలను కూడా నివారించవచ్చన్నారు.

జగన్ కలలో కూడా సీఎం కాలేడు : టీడీపీ

పులివెందుల టౌన్: ప్రతిపక్షనేత వైఎస్ జగన్ కలలో కూడా సీఎం కాలేరని టీడీపీ పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాష అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో నేనే సీఎం అవుతానని కలలు కంటూ మతిభ్రమించి మాట్లాడుతున్నారన్నారు. దీనికి ఉదాహరణగా నంద్యాల ఉప ఎన్నికల ప్రచారంలో జగన్ మాటతీరు గుర్తుచేశారు. గౌరవ పదవిలో ఉన్న ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. ఈయన ముఖ్యమంత్రి అయితే ప్రజల పరిస్థితి ఏమిటో అని అనిపిస్తోందన్నారు. దీనికి ఉదాహరణగా వైజాగ్ ఎయిపోర్టులో పోలీస్ అధికారులను నేనే సీఎం అంటూ దౌర్జన్యం చేయడం రాష్ట్ర ప్రజలంతా తన అరాచకాన్ని చూశారన్నారు. ఈయనతో పాటు ఆయన ఎమ్మెల్యేల తీరు కూడా ఇలాగే ఉందన్నారు. నంద్యాల ఉప ఎన్నికల్లో వైసీపీ ఎన్నికుతంత్రాలు చేసినా టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి భారీ మెజార్టీతో గెలవడం ఖాయమన్నారు. మూడేళ్లగా ప్రభుత్వం ప్రజల కోసం పించన్లు, రైతు రుణమాఫీ, డ్వాక్రా మహిళల రుణాలు, గ్యాస్ కనెక్షన్లు, ముఖ్యంగా అన్ని వర్గాల వారికి ఉచితంగా సంక్రాంతి, రంజాన్, క్రిస్మస్ పండుగలకు సరుకులు, దుల్హన్ పథకం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు ప్రజలకు సబ్సిడీ రుణాలు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అందిస్తున్నారన్నారు. ఏ ముఖ్యమంత్రీ చేయని విధంగా చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి పరుస్తోంటే ఓర్వలేక వైఎస్ జగన్ ఇష్టమొచ్చినట్లు మాట్లాడడం సమంజసం కాదన్నారు. రాబోయే రోజుల్లో పులివెందులలో కూడా వైఎస్ జగన్ గెలవలేరన్నారు. కార్యక్రమంలో ఆకుల ప్రసాద్, భాస్కర్, నాగిన్ బాష, నజీర్ పాల్గొన్నారు.



విలేకరులతో పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాష

వర్షం కోసం గండికి పాదయాత్ర

వేంపల్లె: మండలంలోని రామిరెడ్డిపల్లె నుంచి గండి క్షేత్రం వరకు 25కిలోమీటర్ల పాటు భక్తులు పాదయాత్ర చేశారు. వర్షం సమృద్ధిగా కురిసి ప్రజలంతా సుభిక్షంగా ఉండాలన్న తలంపుతో భజన చేస్తూ సాగిన పాదయాత్రలో పెద్దఎత్తున మహిళా భక్తులు పాల్గొన్నారు. శనివారం గండి ఆంజనేయస్వామి సన్నిధికి చేరుకుని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

సినిమా గైడ్

పులివెందుల	
మారుతి	: ఫిదా
లక్ష్మీ	: నక్షత్రం
రాఘవేంద్ర	: వైశాఖం
శ్రీనివాస	: గౌతంనంద
సుజాత	: దర్శకుడు
వేంపల్లె	
తిరుమల	: నిన్నుకోరి
వెంకటేశ్వర	: ఫిదా
నూర్జహాన్	: గౌతంనంద

ఉపాధ్యాయుల చేతుల్లోనే విద్యార్థుల భవిష్యత్తు

బదిలీ ఉపాధ్యాయులను సన్మానించిన ఎంపీపీ



బదిలీ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంపీపీ రవికుమార్‌రెడ్డి, గ్రామస్థులు

వేంపల్లె: భావిభారత పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర అని ఎంపీపీ రవికుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బదిలీ అయి ఉపాధ్యాయులు ఇతర ప్రాంతాలకు వెళ్తుంటే గ్రామస్థులు, పిల్లలు కన్నీటిపర్యంతం కావడం ఉపాధ్యాయుల పనితీరుకు నిదర్శనమన్నారు. వేంపల్లె మండలం ఇడుపులపాయ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ బదిలీ అయిన మురళీకృష్ణ, సరస్వతిని గ్రామస్థులు శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఎక్కడ పనిచేసినా విద్యార్థులకు ఉచితంగా నోటుపుస్తకాలు, పలకలు, విద్యాసామగ్రి అందిస్తానని మురళీకృష్ణ తెలిపారు. గండి దేవస్థాన మాజీ ఛైర్మన్ విజయకుమార్, ఉపసర్పంచు శంకరయ్య, మాజీ ఉపసర్పంచు చలపతి, సాయినాథ్ పాల్గొన్నారు.

గండి అంజన్న సేవలో హనుమత్ సేవకులు



హనుమత్ సేవలో పాల్గొన్న సేవకులు

వేంపల్లె: గండి శ్రావణమాస ఉత్సవాలు పురస్కరించుకుని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు సేవలు చేసేందుకు 40 మంది హనుమత్ సేవకులు తమ సహకారాన్ని అందించారు. వేంపల్లెకు చెందిన సీనియర్ హనుమత్ సేవకుడు వడ్లకుంట అంజన్ కుమార్ ఆధ్వర్యంలో వేంపల్లె, చక్రాయపేట, వేముల, పెండ్లిమర్రి మండలాలకు చెందిన 40 మంది హనుమత్ సేవకులు శనివారం గండి ఆంజనేయస్వామి సన్నిధిలో సేవలు అందించారు. భక్తులకు వివిధ రకాల సహాయ సహకారాలు అందించారు. సేవకులను ఛైర్మన్ రాజారావు, సహాయ కమిషనర్ గురుప్రసాద్ తదితరులు అభినందించారు.

గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలి

చాపాడు : మండలంలోని అన్ని గ్రామాలు వంద శాతం పరిశుభ్రంగా ఉండేలా చూడాలని జమ్మలమడుగు డీఎల్‌పీవో దివాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన చాపాడు గ్రామాన్ని పరిశీలించారు. సర్పంచ్ షేక్ ఫర్వీన్ ఆధ్వర్యంలో గ్రామంలో డ్రైనేజీల్లోని పూడికను ఎక్స్‌క వేటర్‌తో తొలగించారు. కాలువల్లోని మురికిని ఎప్పటికప్పుడు తొలగించాలని గ్రామ కార్యదర్శి భాగ్యలక్ష్మి ఆదేశించారు. ఈవోపీఆర్‌డీ వెంకటసుబ్బారెడ్డి, గ్రామకార్యదర్శులు పాల్గొన్నారు.



మురికిని తొలగిస్తున్న దృశ్యం

లబ్ధిదారుల ఎంపికకు గ్రామసభలు

దువ్వూరు: గృహ నిర్మాణ శాఖ ద్వారా ఇళ్లు నిర్మించుకునే దరఖాస్తుదారులను గుర్తించేందుకే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఏవీ రమణారెడ్డి తెలిపారు. శనివారం మండల పరిధిలోని మాచనపల్లె, యర్రబల్లె, బుక్కాయపల్లె, అన్నపుశాస్త్రులపల్లె గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం, ప్రధానమంత్రి ఆవాస్‌యోజన పథకం ద్వారా ఇళ్లు మంజూరు చేసేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైన లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్లు నిర్మించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇ వీరన్న, ఆర్‌ఐ బాలనారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

వర్షం కోసం పూజలు



ఆంజనేయస్వామికి నీళ్ళతో అభిషేకం చేస్తున్న యువకులు... నీటి బిందెలతో బారులు తీరిన మహిళలు

మైదుకూరు : వరుణదేవుడు కరుణించాలంటూ పట్టణంలోని శ్రీనగరం మహిళలు పంచముఖ ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణ శనివారం సందర్భంగా గ్రామంలోని మహిళలు 101 బిందెలతో నీళ్లు పట్టుకొని మేళ తాళాల మధ్య అక్కడ ఉన్న పంచముఖ ఆంజనేయస్వామి వద్దకు ఊరేగింపుగా వచ్చారు. వేద పండితుల మంత్రోచ్ఛారణలతో వివాహమాడని యువకులచే 101 బిందెల నీటితో ఆంజనేయస్వామికి అభిషేకం నిర్వహించారు. ఒక్కో బిందెకు ఒక్కో టెంకాయ చొప్పున కొట్టి స్వామివారికి సమర్పించారు. అధిక వర్షాలు కురిసి భూములను తడిపి కేసీ కాలువలో నీళ్లు పారాలంటూ వేడుకున్నారు. హనుమాన్‌కు జై అంటూ నినాదాలతో హోరెత్తించారు.

10న ఎస్సీ, ఎస్టీ, బీసీ రుణాలకు ఇంటర్వ్యూలు.

మైదుకూరు రూరల్ : 2017-18 సంవత్సరానికి ఈనెల 10వ తేదీ ఎస్సీ, ఎస్టీ, బీసీ రుణాలకు సంబంధించి స్థానిక మండల అభివృద్ధి కార్యాలయం వద్ద నున్న స్త్రీ శక్తి భవనంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో రామానుజం పేర్కొన్నారు. దీని కోసం ఆన్‌లైన్‌లో దరకాస్తు చేసుకున్న ప్రతి అభ్యర్థి ఉదయం 10 గంటలకు హాజరు కావాలని, అభ్యర్థులను అధికారులు, బ్యాంకు సిబ్బంది ఇంటర్వ్యూలు చేస్తారని తెలిపారు.

కక్కయ్యస్వామి పోస్టర్ల విడుదల

చాపాడు: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం శ్రీఆదిజాంబవ ధర్మ రక్షా సమితి ఆధ్వర్యంలోకక్కయ్యస్వామి పోస్టర్లను కమిటీవారు విడుదల చేశారు. ఈనెల 17 నుంచి 19 వరకు బ్రహ్మంగారి మఠంలో ఉన్న కక్కయ్యస్వామి దేవాలయంలో ఆరాధన మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కమిటీ అధ్యక్షుడు నాగభూషణం, కార్యదర్శి కర్ల చెప్పారు. కార్యక్రమంలో కార్యకర్తలు కొండయ్య, ప్రసాద్ రావు, లక్షుమయ్య పాల్గొన్నారు.

వనాలను దేవతలుగా పూజిద్దాం

మైదుకూరు రూరల్ : వనాలను దేవతలుగా పూజిద్దాం.. ప్రపంచాన్ని పది కాలాలు కాపాడుకుందాం అంటూ వనిపెంట ఫారెస్ట్ డిప్యూటీ రేంజర్ ఎల్.త్యాగరాజు పేర్కొన్నారు. మండలంలోని వనిపెంట ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం అటవీశాఖ అధికారులు, పాఠశాల విద్యార్థులు ఆసుపత్రి సిబ్బందితో కలిసి వనం మనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. మొదట పర్యావరణాన్ని పరిరక్షేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలంటూ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం త్యాగరాజు, ఎఫ్.బీ.ఓ బాలచెన్నయ్యలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం వలన వారికే కాకుండా భావితరాల వారికి కూడా మంచి భవిష్యత్ ఇచ్చినవారు అవుతారని తెలిపారు. కార్యక్రమంలో మణి సుచరిత, మనోజ్ శామ్యేల్, శివరామిరెడ్డి, షరీఫ్, రెడెమ్మ, రవికుమార్, యశోద, వెంకోజిరావు, లిఖిల్, తిరుమలేష్, రాహుల్, షారుక్, చిన్నఓబులేసు తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఆసుపత్రి, ఫారెస్ట్ సిబ్బంది

సోలార్ పంపుసెట్లు ఉపయోగకరం

దువ్వూరు: ఎన్టీఆర్ జలసిరి పథకం ద్వారా బోరు వేయించుకున్న రైతులకు సోలార్ పంపుసెట్లు ఎంతో ఉపయోగకరమని ఏపీడీ రాఘవేంద్రనాథ్ పేర్కొన్నారు. శనివారం ఎంపీడీవో సభాభవనంలో ఎన్టీఆర్ జలసిరి పథకం ద్వారా బోర్లు వేసుకున్న 50 మంది లబ్ధిదారులతో సమావేశాన్ని నిర్వహించారు. రైతులకు విద్యుత్తు కనెక్షన్లు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని, ఇందులో భాగంగా సోలార్ పంపుసెట్లను అందజేసేందుకు నివేదికలు తయారు అయ్యాయన్నారు. రైతు వాటా రూ.25 వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రతి రైతుకు 5 హెచ్‌పీ మోటా రు, పంపు, వంద అడుగుల పైపు, వైర్, సోలార్ ప్యానల్స్ అందిస్తారని, దీని ద్వారా నిరంతరం మోటారుకు నీళ్లు వస్తాయన్నారు. త్వరగా డీడీలు చెల్లించి సోలార్ పంపుసెట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఏవీ రమణారెడ్డి, ఏపీవో లక్ష్మినారాయణ, ఈసీ విజయకుమార్, ఉపాధి హామీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీడీ రావేంద్రనాథ్

కరెంటు స్తంభాలకు జియోట్యాగింగ్

చాపాడు: మండలంలోని మొత్తం 22 గ్రామ పంచాయతీల్లో ఉన్న కరెంటు స్తంభాలకు జియో ట్యాగింగ్ చేస్తున్నట్లు ఈవోపీఆర్‌డీ వెంకటసుబ్బారెడ్డి చెప్పారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన ఫీల్డ్ అసిస్టెంట్ల ద్వారా జియోట్యాగింగ్ చేయిస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో కరెంటు స్తంభాలు, వీధి లైట్లు ఎన్ని ఉన్నాయో అనే విషయం తెలుస్తుందన్నారు. నాలుగు రోజుల్లో జియోట్యాగింగ్ పూర్తి చేస్తామన్నారు.

వెంకటలక్ష్మి సేవలు మరువలేనివి



ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న దృశ్యం

దువ్వూరు: ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా విద్యార్థులకు మెరుగైన విద్యను అందించి పాఠశాలలకు మెరుగైన సేవలు అందించిందని చిన్నసింగనపల్లె సర్పంచ్ జయచక్రధర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని చిన్నసింగనపల్లె ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న వెంకటలక్ష్మి బదిలీ కావడంతో ఉపాధ్యాయ బృందం, గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు మురళీకృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రన్న బీమా చెక్కులు పంపిణీ

చాపాడు : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం జడ్పీటీసీ బాలనరసింహారెడ్డి, ఉపమండలాధ్యక్షుడు సానా నరసింహారెడ్డి ఐదుగురు బాధితులకు చంద్రన్న బీమా చెక్కులను పంపిణీ చేశారు. బాధితులు వేమన చిన్నక్క, రవి కుమార్‌స్వామి, వెంకటసుబ్బయ్య, గ్రేసమ్మలకు రూ.35 వేలు చొప్పున చియ్యపాడు గ్రామానికి చెందిన ప్రసాద్‌కు రూ.4.20 లక్షల చెక్కును పంపిణీ చేశారు. సాధారణంగా, ప్రమాదాలతో వారి కుటుంబ యజమానులు చనిపోయినందున చంద్రన్నబీమాను ఇచ్చినట్లు బీమా మిత్రులు లక్ష్మీదేవి, అరుణ చెప్పారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ సైదున్నీసా, వైసీపీ నాయకుడు లక్షుమయ్య పాల్గొన్నారు.



బాధితులకు చెక్కులు పంపిణీ చేస్తున్న బాలనరసింహారెడ్డి

ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ధర్నాలు చేయడం తగదు

చాపాడు: జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల యజమానులు ధర్నాలు చేయడం తగదని జనతాదళ్ యూ జిల్లా మహిళా అధ్యక్షులు బండి అరుణ అన్నారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా విద్యార్థుల నుంచి అదనంగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఉపాధ్యాయులకు జీతాలు తక్కువగా యాజమాన్యాలు ఇస్తున్నాయన్నారు. ప్రైవేటు పాఠశాలల దోపిడీపై విద్యార్థి సంఘాలు స్పందించాలని ఆమె కోరారు.

సినిమాగైడ్

మైదుకూరు	
విజయ్	: నిన్నుకోరి
భారత్	: శమంతకమణి
వెంకటేశ్వర	: డీజే (దువ్వాడ జగన్నాథం)
ఖాజీపేట	
రాజ్	: నక్షత్రం
దువ్వూరు	
రాయల్	: శతమానం భవతి

తాగునీటి పైపు లీకేజీ...



పైపు లీకేజీతో వృథాగా పోతున్న తాగునీరు

మైదుకూరు : పట్టణ శివారులోని శ్రీనగరం వాసులకు తాగునీరు సరఫరా చేసే పైపు లైను దెబ్బతిని లీకేజీ అయ్యి నీళ్లన్నీ కేసీ కాలువలోకి వృథాగా పోతున్నాయి. కాలువ కట్టకు అవతల వైపున బోరు ఉండటంతో అక్కడి నుంచి కర్నూలు-కడప ప్రధాన రహదారిపై ఉన్న శ్రీనగరానికి పైపు లైను వేశారు. ఆపైపు లైను ద్వారా శ్రీనగరానికి తాగునీరు వెళ్లాల్సి వుంది. అయితే కాలుక కట్టపై నుంచి వెళుతున్న పైపు లీకేజీ అయ్యింది. దీంతో శ్రీనగరానికి నీరు సరఫరా కాక కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

ఆలయ సహాయకురాలి మృతి

మైదుకూరు : పట్టణంలోని అతి పురాతన ఆలయం లక్ష్మీమాధవరాయస్వామి ఆలయంలో సహాయకురాలిగా విధులు నిర్వహిస్తున్న పెద్దపుల్లయ్య గారి సుబ్బమ్మ (60) అనారోగ్యంతో మృతి చెందింది. దాదాపు 30 ఏళ్ళుగా ఆలయంలో ఉంటూ స్వామి వారి దుస్తులు స్వయంగా శుభ్రం చేస్తూ పూజా సామగ్రిని సమకూర్చుతూ ఉండేదని స్థానికులు పేర్కొన్నారు.
ఆలయ చైర్మన్ ఆకుల కృష్ణయ్య ఆమె నివాసానికి చేరుకొని కుటుంబ సభ్యులకు రూ.10వేలు అందచేశారు. అంత్యక్రియల్లో పాల్గొని కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

చదువుల బాబు రచనకు పురస్కారం



ప్రొద్దుటూరు టౌన్: విశాఖ సంస్కృతి మాసపత్రిక నిర్వహించిన జాతీయస్థాయి కథల పోటీల్లో డి.కె.చదువుబాబుకు పురస్కారం లభించింది. బహుమతుల కోసం ఆరు కథలను ఎంపిక చేయగా ఆయన ర చించిన ఒక్కసారి ఆలోచించండి కథ పురస్కారానికి ఎంపికైనట్లు ఆ పత్రిక సంపాదకుడు ఎస్ఎస్‌రావు తెలిపారు. ఈ నెల 12న విశాఖలో నిర్వహించే పత్రిక 5వ వార్షికోత్సవంలో పురస్కారాలను, బహుమతిని అందించనున్నారన్నారు. కాగా చదువులబాబు దువ్వూరు ప్రభుత్వ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్నారు.

జగన్‌కు రాజకీయ భవిష్యత్తు లేదు

● టీడీపీ నేతలు వరదరాజులరెడ్డి, పుల్లయ్య ధ్వజం

ప్రొద్దుటూరు పుట్టపర్తి సర్కిల్: వైసీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాజకీయ భవిష్యత్తు అనేది లేదని ప్రొద్దుటూరు తెలుగుదేశం పార్టీ నేతలు స్థానిక మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్యలు తెలిపారు. వారు శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జగన్‌కు 2019లో జరిగే ఎన్నికలే చివరి ఎన్నికలన్నారు. ఆయన ఎప్పటికి సీఎం కాలేడన్నారు. రాజీయాల్లోని, ప్రజాజీవితంలోని వారికి ఓపిక, సహనం ఉండాలన్నారు. తోటివారిని గౌరవించాలన్నారు. గౌరవం పొందాలన్నారు. ఫ్యాక్షన్ కుటుంబం నుంచి వచ్చిన జగన్ తన ప్రత్యర్థులందరిని చంపాలనుకుంటున్నాడన్నారు. సీఎం చంద్రబాబునాయుడును చంపాలని పిలుపునివ్వడం ద్వా రా జగన్ హత్యా రాజకీయాలకు పాల్పడుతున్నాడన్నారు. ఆయనకు నైతిక విలువల్లేవన్నారు. రాష్ట్రాభివృద్ధి పట్టడంలేదన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ నేతలు వరదరాజులరెడ్డి, పుల్లయ్య తదితరులు

రాచమల్లుకు ప్రజలే బుద్ధి చెప్తారు

ప్రొద్దుటూరు నియోజకవర్గ అభివృద్ధికి అడుగడుగునా అడ్డుపడుతున్న స్థానిక వైపీపీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డికి ప్రజలే బుద్ధిచెబుతారని ప్రొద్దుటూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి నంద్యాల వరదరాజులరనెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పుల్లయ్యలు పేర్కొన్నారు. నిరంతరం ప్రొద్దుటూరు ప్రజల తాగునీటికి అడ్డుపడడాన్ని ప్రజలు క్షమించరన్నారు. ఆయన ప్రమేయంతోనే ఆయన అనుచరులైన వారు వరద కాల్వకు భూములివ్వకుండా కోర్టుకు వెళ్లారన్నారు. వరద కాల్వ పనులు 12.5 శాతం లెస్‌తో వచ్చామన్నారు. నామినేషన్‌పై రాలేదన్నారు. పనులు త్వరగా పూర్తయితే ప్రొద్దుటూరు ప్రజలకు తాగునీరు అందుతుందన్నారు. ప్రొద్దుటూరు ప్రజల శాశ్వత దాహార్తిని తీర్చడమే తన ధ్యేయమన్నారు. టీడీపీ జిల్లా కార్యదర్శి గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు కోనేటి సునంద, శివాలయం చైర్మన్ పల్లా శంకర్, బద్రిపల్లె స్వామి, గోపవరం శంకర్ పాల్గొన్నారు.

చదువుతోపాటు నైపుణ్యం పెంచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ సూర్యనారాయణరెడ్డి

జమ్మలమడుగు రూరల్: ప్రతి విద్యార్థి చదువుతోపాటు నైపుణ్యం పెంచుకోవాలని మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ తాతిరెడ్డి సూర్యనారాయణరెడ్డి సూచించారు. శనివారం జమ్మలమడుగు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీనియర్లు జూనియర్లకు (ప్రెషర్స్‌డే) ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ జి.శ్రీనివాసరెడ్డి సభకు అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ మంత్రి ఆదినారాయణరెడ్డి కృషితో జమ్మలమడుగులో విద్యాసంస్థల అభివృద్ధికి తదితర కార్యక్రమాలకు సంబంధించి నిధులు మంజూరు చేయించారన్నారు. కళాశాలలో మంచి అనుభవజ్ఞులు ఉండటంతో ప్రత్యేక ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. సాయంత్రం కళాశాల ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డి.హనుమంతు, అధ్యాపకులు బండారు శ్రీనివాసులు, శేషఫణి, చంద్రహాసరెడ్డి పాల్గొన్నారు.

జోనల్ పద్ధతిలో జీవో విడుదల చేయండి

జమ్మలమడుగు రూరల్: టీటీడీ నియామకాల్లో జోనల్ పద్ధతి అమలు చేస్తూ జీవో విడుదల చేయాలని ఆర్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కె.సి.పాములేటి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక వివేకానంద జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగులు ఉపాధి లేక అల్లాడుతున్నారన్నారు. టీటీడీ నియామకాల్లో జోనల్ పద్ధతి పాటించేచలా చర్యలు తీసుకోవాలన్నారు.

వ్యాధి నిరోధక శక్తికి తల్లిపాలు ఎంతో శ్రేయస్కరం

రాజుపాళెం: తల్లిపాలు బిడ్డకు శ్రేయష్కరమని, వ్యాధి నిరోధకతను పెంచుతుందని టీచర్ రమాదేవి, నిర్మలాదేవి తెలిపారు. శనివారం తొండలదిన్నె పంచాయతీలోని ఏరువపాళెం గ్రామంలో అంగన్వాడీ సెంటర్‌లో తల్లిపాల వారోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులతో మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలు ఇవ్వడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరగడంతోపాటు బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని వారు తెలిపారు. తల్లులు బిడ్డ సంరక్షణకు తల్లి ఆరోగ్యానికి తగిన పోషకాలు తీసుకోవాలని, ఆకు కూరలు కూడా ఎక్కువ తీసుకోవాలని తెలిపారు. పౌష్టికాహారం తీసుకోకపోతే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

హలో.. ఆంధ్రజ్యోతి (Hello Andhra Jyothi)

● మీ సమస్యలుంటే ఈ కింది నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వగలరు.

- ఎర్రగుంట్ల - 9441112349
- ముద్దనూరు - 8099575259
- జమ్మలమడుగుటౌన్ - 9948300003
- జమ్మలమడుగురూరల్ - 9848855313
- మైలవరం - 9912265711
- పెద్దముడియం - 9494835608
- కొండాపురం - 9440941345

తల్లిపాలు బిడ్డకు దేవుడిచ్చిన వరం

జమ్మలమడుగు రూరల్: తల్లిపాలు బిడ్డకు దేవుడిచ్చిన వరమని అంగన్వాడీ కార్యకర్త, జమ్మలమడుగు సీఐటీయూ నాయకురాలు వి.భాగ్యలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని బీఆర్ కొట్టాల గ్రామంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గర్భవతులు , తల్లులు, పిల్లలు, ఆశా వర్కర్లు ర్యాలీ నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. ముర్రుపాలు బిడ్డకు రోగనిరోధక శక్తిని పెంచుతుందన్నారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. కావున ఈ విషయాన్ని గమనించి ప్రతి తల్లి పౌష్టికాహారం తీసుకుని తనతో పాటు తన బిడ్డ ఆరోగ్యాన్ని కాపాడాలని కోరారు. ఏఎన్ఎం సుజాత, ప్రభావతి, ఆదినారాయణమ్మ, పిల్లలు, గర్భవతులు, తల్లులు పాల్గొన్నారు.

‘ప్రభుత్వ వ్యతిరేక విధానాలే వైసీపీకి బలం’

జమ్మలమడుగు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలే వైసీపీకి బలం అని వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దన్నవాడ మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం సాయంత్రం జమ్మలమడుగులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నంద్యాలలో జగన్ బహిరంగ సభ సక్సెస్ అయిందని, అలాగే గెలుపు కూడా తథ్యమన్నారు. నంద్యాలలో ప్రజల అభిమానం చూసి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రులు ఓర్వలేక తమ నేతపై అనవసరంగా బురద చల్లుతున్నారన్నారు. సీఎం ఎన్నికల హామీలను అమలు చేయాలన్నారు. నంద్యాలలో వైసీపీ నాయకులను, అభిమానులకు ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా ప్రజల అభిమానాన్ని ఎవరూ ఆపలేరన్నారు. నంద్యాలో సిల్పా చక్రపాణిరెడ్డి నైతిక విలువలు కలిగిన వ్యక్తి కావడం వలన జగన్ పిలుపు మేరకు ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి వైసీపీలో చేరారన్నారు.



మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి

సినిమా గైడ్

జమ్మలమడుగు

టీపీఆర్:	దండుపాళ్యం
టీఎన్ఆర్:	ఫిదా
సాయిరాం :	దువ్వాడ జగన్నాథమ్

సంగాలపల్లెలో తీవ్ర నీటి ఎద్దడి

వీరపునాయునిపల్లె: మండల పరిధిలోని సంగాలపల్లెలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. సంగాలపల్లె గ్రామస్తులకు తాగునీటి సమస్యను తీర్చేందుకు పాపాగ్నినది నుంచి అనిమెల మీదుగా సంగాలపల్లె, గంగిరెడ్డిపల్లె గ్రామాలకు దాదాపు రూ.20 లక్షల వ్యయంతో పైప్‌లైన్‌ వేశారని, మూన్నాళ్ల ముచ్చటగా తాగునీటిని సరఫరా చేశారన్నారు. కానీ రాజకీయ ప్రమేయంతో నీటి సమస్య నెలకొందని, నీటి కొరతను తీర్చాలని పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నీటి ఎద్దడిని పరిష్కరించి మంచినీటిని అందించాలని కోరుతున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు

పెండ్లిమర్రి: మద్యం తాగి వాహనం నడుపుతున్న లారీ డ్రైవర్‌పై కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ రోషన్‌ తెలిపారు. శనివారం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా నీకేదిన్నె మండలం లక్కిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన దొడ్డి మల్లికార్జున మద్యం తాగి వాహనం నడుపుతుండగా గుర్తించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గాయపడిన విజయసారథిరెడ్డిని పరామర్శించిన పుత్తా

పెండ్లిమర్రి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన టీడీపీ మండల నాయకుడు విజయసారథిరెడ్డిని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి పరామర్శించారు. మద్దుసిద్దుపల్లెకు చెందిన విజయసారథిరెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం తెలుసుకొని శనివారం పుత్తా పరామర్శించారు. ఈయన వెంట టీడీపీ మండల ఇన్‌చార్జి గంగిరెడ్డి, బాలక్రిష్ణారెడ్డి, ఓబులరెడ్డి, నారాయణరెడ్డి ఉన్నారు.

పీహెచ్‌సీలో స్త్రీ వైద్యురాలి నియామకం

చెన్నూరు: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో శనివారం స్త్రీ వైద్యురాలిగా కె.మాధవి నియమితులయ్యారు. చాలాకాలంగా స్త్రీ వైద్యురాలు లేకపోవడంతో గర్భిణులు, బాలింతలు కడప నగరంలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో, రిమ్స్‌కు వెళ్లేవారని, దీంతో ఖర్చుతో పాటు సమయం వృథా అయ్యేదని పలువురు పేర్కొన్నారు. ప్రస్తుతం వైద్యురాలు రావడంతో మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు

సికేదిన్నె: మండలంలోని పొలతల క్రాస్‌ వద్ద ఉన్న వీరాంజనేయస్వామి ఆలయం వద్ద జరిగిన బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. రెండో శ్రావణ శనివారం సందర్భంగా నిర్వాహకులు బండలాగుడు పోటీలు ఏర్పాటు చేశారు. ఈ పోటీలో పది జతల ఎద్దు పాల్గొన్నాయి. పోటీలో గెలుపొందిన ఎద్దుల యజమానులకు నిర్వాహకులు బహుమతులుఅందించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కమ్మవారిపల్లె, ఓబులంపల్లె, బాకరాపేట, శ్రీరంగరాజుపల్లె, గార్లపల్లె గ్రామస్తులు సంయుక్తంగా ఈ కార్యక్రమాలు నిర్వహించారు.


బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

సమస్యల వలయంలో తాడిగొట్ల

● రోడ్లపై పారుతున్న మురుగు ● పట్టించుకోని అధికారులు


జాంబవంతుని వీధిలో రోడ్డుపై పారుతున్న మురుగు

సికెదిన్నె: మండలంలోని తాడిగొట్ల పంచాయతీ కేంద్రంమైన తాడిగొట్ల సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. ప్రజలు ప్రతి రోజు సమస్యలు ఎదుర్కొంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. దీంతో గ్రామంలో దుర్గంధం తాండవిస్తుంది. గ్రామంలోని జాంబవంతుని వీధిలో ప్రతి రోజు రోడ్డుపై మురుగు నిలిచిపోతుంది. మురుగు పోయేందుకు దారి లేకపోవడంతో గ్రామంలో దుర్గంధంతో పాటు దోమలకు నిలయాలుగా మారాయి. దీంతో ప్రజలు అనారోగ్యంతో బాధపడుతున్నారు. మరోవైపు గ్రామంలో ఒక్క బోరు కూడా పనిచేయక పోవడంతో మంచినీటి కష్టాలు సైతం ఉన్నట్లు స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు కాలువలు ఏర్పాటు చేసి ప్రజల ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.



దోమల నియలంగా ఉంది...



మురుగు నీరు రోడ్డుపైకి వచ్చి చేరడంతో దోమలు అధికమయ్యాయి. దీంతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. అధికారులు స్పందించి మురుగునీరు రోడ్డుపైకి రాకుండా చూడాలి. -లక్ష్మీదేవి, తాడిగొట్ల

మురుగు కాలువలు ఏర్పాటు చేయాలి...



గ్రామంలోని జాంబవంతుని వీధిలో రోడ్డుపైకి మురుగు వస్తోంది. దీంతో ప్రతి రోజు మురుగు నీటిలో నడవాల్సి వస్తోంది. కాలువలు ఏర్పాటు చేసి ఇబ్బందులను తొలగించాలి. - సత్యవతి

కాలినడకన అంజన్న భక్తులు

వీరపునాయునిపల్లె: మండలంలోని పలు గ్రామాల నుంచి అంజన్న భక్తులు రెండో శనివారం సందర్భంగా గండి క్షేత్రానికి కాలినడకన బయలుదేరి వెళ్లారు. వీరపునాయునిపల్లె మీదుగా తిమ్మాయపల్లె, మర్రిపల్లె, వేంపల్లె మీదుగా కాలినడకన గండిక్షేత్రానికి చేరుకుని అంజన్నను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

కాలినడకన వెళ్లే భక్తులకు మర్రిపల్లె సమీపంలో ఉన్న గంగమ్మ దేవాలయం వద్ద ఎస్సీ బాలుర వసతి గృహం-2 వార్డన్‌ కేశవులు సహకారంతో ఉచితంగా టీ, బిస్కెట్లను అందజేశారు. పలు ఆలయాల్లో శ్రావణ శనివారం సందర్భంగా ఆంజనేయస్వామికి ఘనంగా పూజలు నిర్వహించారు.

ప్రాణాంతక వ్యాధులను పూర్తిగా నిర్మూలించడమే ధ్యేయం


మాట్లాడుతున్న డాక్టర్‌ షఫీ

చెన్నూరు: ప్రాణాంతక వ్యాధులైన తట్టు, రూబెల్లాలను పూర్తిగా నిర్మూలించడమే ప్రభుత్వ ధ్యేయమని, అందుకే ప్రభుత్వం ఉచితంగా ఎంఆర్‌ టీకాను అందిస్తున్నదని సీహెచ్‌సీ చిన్నపిల్లల వైద్యుడు షఫీ అన్నారు. శనివారం స్థానిక సీహెచ్‌సీలో ఆయన మాట్లాడుతూ ఎంఆర్‌ టీకా చిన్నారులకు ఇవ్వన్న విషయంలో వస్తున్న పుకార్లు నమ్మవద్దన్నారు. పోలియో వ్యాధిని సమాజం నుంచి ఎలా పూర్తిగా నిర్మూలించామో అలాగే తట్టు, రూబెల్లాలను లేకుండా చేయాలన్నారు. ఎంఆర్‌ టీకా కొత్తదేమి కాదన్నారు. ఇప్పటివరకు ఇస్తున్న ఎంఎంఆర్‌ టీకానే ఎంఆర్‌ టీకా అన్నారు. దీని విలువ రూ.2వేలు అన్నారు. పేదలు అంత ఖర్చుపెట్టి కొనలేరని, అందుకే ప్రభుత్వమే ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. ఈ టీకా ఆగస్టు 1 నుంచి ప్రారంభమైందని, ఈనెల చివరి వరకు అన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే సెప్టెంబరు 1నుంచి 8వతేదీ వరకు ఏఎన్‌ఎంలు, ఆశకార్యకర్తలు ఇంటింటికీ తిరిగి ఎంఆర్‌ టీకా అందని వారిని గుర్తించి వేయడం జరుగుతుందన్నారు. చిన్నారుల విషయంలో 24 గంటలు తాను అందుబాటులో వుంటానని తెలిపారు.

ప్రసన్న వేంకటేశ్వరస్వామికి శ్రావణ మాస పూజలు

చెన్నూరు: శ్రావణమాసం రెండో శనివారం సందర్భంగా స్థానిక ప్రసన్నవెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయానికి తెల్లవారిజామునుంచే ప్రజలు అధికసంఖ్యలో అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. మూలవిరాట్‌ మూర్తికి ప్రత్యేక అలంకరణ గావించారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో ప్రసాదవితరణ చేశారు. మండల వ్యాప్తంగా గ్రామాలన్నింటిలోను శ్రావణ మాస పూజలు జరిగాయి.

వరదాంజనేయస్వామి ఆలయంలో...

బుడ్డాయపల్లె వద్ద వెలసిన వరదాంజనేయస్వామి ఆలయంలో ఉదయం, సాయంత్రం ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. స్థానిక సీతారామానామ సంకీర్తన క్షేత్రంలో హనుమాన్‌ చాలీసా పారాయణంతో పాటు సీతారాములకు ప్రత్యేక పూజలు జరిగాయి. మధ్యాహ్నం అన్న ప్రసాదవితరణ చేశారు.

అన్నిదానాల కన్నా అన్నదానం గొప్పది

సికేదిన్నె: అన్నిదానాల కన్నా అన్నదానం గొప్పదని ప్రముఖ న్యాయవాది వేణుగోపాల్‌ అన్నారు. శివారుప్రాంతంలోని పాలకొండరాయ పాదాల చెంత శ్రీబాలాజీ చారిటబుల్‌ ట్రస్టు అధినేత ఏటూరి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో రెండో శనివారం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటూరి రామచంద్రారెడ్డి ప్రతి ఏడాది శ్రావణమాసంలో అన్నదానం చేయడం విశేషమన్నారు. ఈయన కులమతాలకు అతీతంగా మసీదులు, చర్చిల నిర్మాణాలతోపాటు అనేక రామాలయాలు కట్టించారని ప్రశంసించారు. కార్యక్రమంలోట్రస్టు సభ్యులు బొగ్గిడి సుబ్బారెడ్డి, జాఫర్, నరసింహులు పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న ఏటూరి

క్రికెట్‌బుకీలకు జైలుశిక్ష, జరిమానా

పెండ్లిమర్రి: క్రికెట్‌బెట్టింగ్‌కు పాల్పడిన బత్తల వీరారెడ్డికి నెలరోజుల జైలు శిక్షతో పాటు రూ.1500 జరిమానా విధిస్తూ జిల్లా రెండో అదనపు న్యాయమూర్తి భానుసాయి తీర్పు ఇచ్చినట్లు ఎస్‌ఐ రోషన్‌ తెలిపారు. పెండ్లిమర్రికి చెందిన వీరారెడ్డి, నవమోహన్‌ రెడ్డి మరో ఏడుగురిని జూన్‌ 6న బెట్టింగ్‌ నిర్వహిస్తుండగా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరిపై నేరం రుజువుకావడంతో వీరారెడ్డికి జైలుశిక్ష మరో 8 మందికి రూ.500 జరిమానా విధించినట్లు తెలిపారు.

ఇంటింటా సర్వే చేసి పక్కాగృహాలు అందిస్తాం

చెన్నూరు: అర్హులైన వారికి పక్కాగృహాలు అందించేందుకు ప్రతి ఇంటిని సర్వే చేస్తామని ఎంపీడీవో మహబూబ్‌బీ అన్నారు. మండలంలోని కొండపేట గ్రామంలో శనివారం జరిగిన గ్రామసభలో మాట్లాడారు. స్మార్ట్‌పల్స్‌ సర్వేలో పలువురు తమకు ఇల్లు లేవని చెప్పారన్నారు. ఆ మేరకు సేకరించిన వివరాలతో కొండపేటలో 360 మందికి పక్కాగృహాలు లేవని తెలిసిందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న గ్రామసభలో వారి పేర్లను చదవడంతో పాటు గతంలో ప్రస్తుతం ఎన్టీఆర్‌ గృహనిర్మాణ పథకంలో గానీ పక్కాగృహాలు మంజూరయ్యాయా లేదా అన్న విషయం తెలుసుకోవడంతో పాటు వారికి మంజూరుకాకపోతే ఆరు నెలల్లో మంజూరు చేయడం జరుగుతుందన్నారు. గ్రామసభలో సర్పంచ్‌ బాషు, ఈవోఆర్‌డీ పరమేశ్వర్‌రెడ్డి, కార్యదర్శి జయరామిరెడ్డి, హౌసింగ్‌ ఏఈ గోపాలకృష్ణ, ఆర్‌ఐ రవి, వీఆర్‌వో రెడ్డిశంకర్‌ పాల్గొన్నారు.

శిక్షణ ద్వారా ఉపాధి పొందాలి

సికేదిన్నె: శిక్షణ ద్వారా ప్రతి ఒక్కరూ ఉపాధి పొందాలని కేవీకే సమన్వయకర్త డాక్టర్‌ వీరయ్య తెలిపారు. రాయచోటిరోడ్డులోని కృషి విజ్ఞాన కేంద్రంలో రెండురోజుల పుట్టగొడుగుల శిక్షణలో పాల్గొన్న యువతకు శనివారం సర్టిఫికెట్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణ జీవితంలో స్థిరపడేందుకు ఉపయోగపడుతుందన్నారు. శాస్త్రవేత్త రంజిత మాట్లాడుతూ శిక్షణలో పుట్టగొడుగుల లక్షణాలు, ఉపయోగాలు తెలిపామన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.


సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న శాస్త్రవేత్త రంజిత

వైఎస్ కుటుంబాన్ని 'ఆది' విమర్శించడమా !

వేంపల్లె: లెక్చరర్‌గా ఉన్న ఆదినారాయణరెడ్డిని ఎమ్మెల్యేగా చేసిన వైఎస్ కుటుంబాన్ని విమర్శించడం శోచనీయమని వైసీపీ ఎస్సీ, ఎస్టీ సెల్ పులివెందుల కన్వీనర్ రమేష్‌నాయక్, బక్కన్నగారిపల్లె ఎంపీటీసీ శ్రీరాములునాయక్ ఎద్దేవా చేశారు. అవినీతి, అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు చంద్రబాబునాయుడు డైరెక్షన్ లో వైఎస్ కుటుంబాన్ని విమర్శించడం తగదన్నారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా ఎన్నికయ్యావంటే వైఎస్ కుటుంబ సలవేనని, వైఎస్ కుటుంబాన్ని విమర్శించడమంటే తల్లిదండ్రులను విమర్శించడమేనన్నారు. ఇప్పటికైనా స్థాయికి తగ్గట్లు మాట్లాడాలని సంయుక్త ప్రకటనలో సూచించారు.

పులివెందులలో మెరుగైన వైద్యం


విలేకరులతో మాట్లాడుతున్న హేమాద్రిరెడ్డి

పులివెందుల టౌన్: పులివెందుల ఏరియా ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్యం అందుతుందని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ హేమాద్రిరెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గానికి సంబంధించి ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్యం అందేందుకు కృషిచేస్తామన్నారు. జిల్లాలో రిమ్స్ తర్వాత ప్రొద్దుటూరు, పులివెందులలో వందపడకలతో నిర్మించిన ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందుతోందన్నారు. ఇక్కడ ప్రైవేటు ఆస్పత్రుల కంటే అన్ని విధాలా మెరుగైన వైద్యం లభిస్తోందన్నారు. ఇక్కడ డాక్టర్లు అన్ని వైద్యసేవలు అందుబాటులోకి తీసుకొస్తున్నారన్నారు. ఇక్కడ డాక్టర్ల కొరత ఉన్నా భర్తీచేసేందుకు కృషిచేస్తామన్నారు. ప్రస్తుతం పులివెందుల ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రోజూ 400 నుంచి 500 మధ్య ఓపీలు జరుగుతున్నాయన్నారు. ఇక్కడ ఎముకల డాక్టర్ కూడా అందుబాటులో ఉన్నారన్నారు. ప్రజలు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లడం వలన వేలల్లో డబ్బు పోగొట్టుకుని అప్పులపాలవుతున్నారన్నారు. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో అన్ని వసతులను ముఖ్యమంత్రి చంద్రబాబు కల్పించారన్నారు. గరినులకు స్కానింగ్‌కు, ప్రసవాలకు అన్ని విధాలా వసతులు ఉన్నాయన్నారు. పేద ధనిక తేడా లేకుండా ఇక్కడ ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందించేందుకు ఛైర్మన్‌గా బాధ్యతను నిర్వర్తిస్తానన్నారు. మూడేళ్లలో ఆస్పత్రిలో శానిటేషన్ పై ప్రత్యేక దృష్టిసారిస్తానన్నారు. పులివెందులలో పోలీసుల అధికారుల సతీమణులు కూడా ఇక్కడే ప్రసవాలు అయ్యారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఆకుల ప్రసాద్, ఉలిమెల్ల బాబు, రమణారెడ్డి తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల స్కిల్స్‌ను మెరుగుపరచాలి


శిక్షణ పొందిన అధ్యాపకులతో డైరెక్టర్ భగవన్నారాయణ తదితరులు

వేంపల్లె: ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులకు స్కిల్స్‌ను మెరుగుపరిచేలా, ఉద్యోగ అవకాశాలు పెంపొందేలా బోధన చేయాలని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ భగవన్నారాయణ అధ్యాపకులకు సూచించారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో ఉన్నతవిద్యాశాఖ మండలి, బ్రిటీష్ కౌన్సిల్ ఆధ్వర్యంలో మాస్టర్ ట్రైనర్ల ఆధ్వర్యంలో అధ్యాపకులకు శిక్షణ ఇచ్చారు. ముగింపు కార్యక్రమంలో డైరెక్టర్ భగవన్నారాయణ మాట్లాడుతూ కొత్తపద్దతుల్లో విద్యాబోధన ఎలా చేయాలనే అంశాలను ఈ శిక్షణ ద్వారా అధ్యాపకులకు తెలియజేసినట్లు పేర్కొన్నారు. శిక్షణ పొందిన అధ్యాపకులు విద్యార్థుల్లో కమ్యూనికేషన్ , సాఫ్ట్‌స్కిల్స్‌ను పెంపొందించేందుకు కృషిచేయాలన్నారు. ప్రస్తుతం పైలట్ ప్రాజెక్టుగా నిర్వహించిన శిక్షణ నిరంతరం కొనసాగించేందుకు చర్యలు చేపడతామన్నారు. ఇంజనీరింగ్ చదువుతున్న తృతీయ సంవత్సరం విద్యార్థులు శిక్షణ కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఓ అమరేంద్రకుమార్, ప్రాజెక్టు నోడల్ అధికారులు వెంకటరమణ, బ్రిటీష్ కౌన్సిల్ ట్రైనర్ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అంజన్న ఆలయాలు కిటకిట


ప్రత్యేక అలంకరణలో...

పులివెందుల టౌన్: శ్రావణ మాసం రెండోవారం పురస్కరించుకుని పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పాతమార్కెట్ ఆంజనేయస్వామి, రోటరీపురంలోని తూర్పు ఆంజనేయస్వామి ఆలయం, కోతి సమాధి వద్ద, పీడబ్ల్యూడీ కాలనీలోని ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా వీడ్కోలు సమావేశం


ఘనంగా వీడ్కోలు పలుకుతున్న విద్యార్థులు

పులివెందుల టౌన్: కనంపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీధర్‌రావును ప్రజలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా వీడ్కోలు పలికారు. బదిలీపై వెళ్తున్న సందర్భంగా ఉపాధ్యాయురాలు పద్మజ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ హెచ్ ఎం శ్రీధర్‌రావు బదిలీపై వెళ్లడం బాధను కలిగిస్తోందన్నారు. ఎంపీపీ కుళాయమ్మ, సర్పంచు దేవదాసు, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, విద్యాకమిటీ ఛైర్మన్ రత్నమ్మ, విద్యార్థులు, గ్రామ ప్రజలు ఆయనను ఘనంగా సన్మానించారు. విద్యార్థులు పాట రూపంలో తమ బాధను వ్యక్తం చేశారు. అనంతరం ఊరి చివరి వరకు ర్యాలీ వచ్చి ఆయనకు వీడ్కోలు పలికారు.

విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్

వేంపల్లె: వేంపల్లె ఉషాకిరణ్ హైస్కూల్లో విద్యార్థులకు మీజిల్లా, రుబెల్లా వ్యాక్సిన్ వైద్యసిబ్బంది వేశారు. కరస్పాండెంట్ బీఎస్ రమణారెడ్డి దగ్గరుండి పిల్లలందరికీ ఈ వ్యాక్సిన్ ను వేయించారు.

అవెన్యూ ప్లాంటేషన్ ను సంరక్షించాలి


మంజూరు పత్రాన్ని పంపిణీ చేస్తున్న సర్పంచు శ్రీరామిరెడ్డి

వేంపల్లె: ప్రభుత్వం పచ్చదనం పెంచేందుకు అవెన్యూ ప్లాంటేషన్ పనులను మంజూరు చేస్తోందని, రోడ్డుకు ఇరువైపులా నాటే చెట్లను బాధ్యతగా సంరక్షించాలని రామిరెడ్డిపల్లె సర్పంచు శ్రీరామిరెడ్డి పేర్కొన్నారు. రామిరెడ్డిపల్లె నుంచి ముతుకూరు వరకు కిలోమీటర్ పాటు రోడ్డుకిరువైపులా 400 మొక్కలు నాటే పని మంజూరు పత్రాన్ని డ్వాక్రా సభ్యురాలుకు శనివారం పంపిణీ చేశారు. నాటిన తర్వాత చెట్లను సంరక్షిస్తే పచ్చదనం పెంపొందుతుందన్నారు. ప్రభుత్వం రోడ్డుకిరువైపుల చెట్లు నాటే కార్యక్రమం చేపట్టడం శుభపరిణామమన్నారు. సీసీలు రామలింగయ్య, సదాశివుడు తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ వైద్యాధికారిని నియమించండి

సింహాద్రిపురం: సింహాద్రిపురం పశువైద్యశాలలో రెగ్యులర్ వైద్యాధికారిని నియమించాలని మండల రైతులు కోరుతున్నారు. సింహాద్రిపురం పశువైద్యశాలలో ఏడీ క్యాడర్ వైద్యధికారి ఉండాల్సి ఉండగా ఇక్కడ కేవలం మహిళ అటెండర్‌తోనే వైద్యశాల నడుస్తోంది. అంకాళమ్మగూడూరులో పశువైద్యశాల నుంచి సింహాద్రిపురానికి ఇన్ చార్జిగా నియమించారు. ఆ రెండుచోట్ల పశువైద్యసేవలు అందించలేకపోవడంతో మండల హెడ్‌క్వార్టర్‌లో కేవలం అటెండర్‌తో వైద్యసేవలు నిర్వహించుకోవాల్సి వస్తోంది. సిం హాద్రిపురం, బిదినంచెర్లలో ఇప్పటికి వైద్యం కోసం పశువులను తీసుకొస్తుంటారు. కేవలం పాడిపరిశ్రమే ఆధారంగా జీవిస్తున్న రైతులకు వైద్యసేవలే కరువయ్యాయని చెప్పవచ్చు. ఇప్పటికైనా పశువైద్యజిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని పశువైద్యాధికారిని నియమించాల్సిన అవసరం ఉంది.



లబ్ధిదారులను గుర్తించేందుకే గ్రామసభలు


పాలూరులో గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

సింహాద్రిపురం: హౌసింగ్‌లో నిజమైన లబ్ధిదారులను గుర్తించేందుకు ఆయా గ్రామాలకు వెళ్లి గ్రామసభలు నిర్వహించేలా ప్రభుత్వం చేసిందని తహసీల్దార్ సుబ్బరామయ్య, ఎంపీడీఓ సోమశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం రావులకొలను, సుంకేసుల, తెలికి, నంద్యాలంపల్లెల్లో హౌసింగ్ గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హుల జాబితాను గ్రామసభలో అధికారులు సేకరించారు. కార్యక్రమంలో ఏఈ రమణారెడ్డి, వర్క్‌ఇన్‌స్పెక్టర్, వీఆర్వోలు, ప్రజలు పాల్గొన్నారు.

పాలూరులో...

తొండూరు: పాలూరులో హౌసింగ్ ఏఈ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ సాధికార సర్వేలో వచ్చిన జాబితాలో 141 మందిలో 79 మందికే ఇళ్లు మంజూరవుతాయన్నారు. వీటిలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద లబ్ధిదారుల జాబితా పంపుతారన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ పునరుద్ధరణ

పులివెందుల టౌన్: ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కార్యాలయానికి విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. వారం రోజుల పాటు ఈఈ కార్యాలయంలో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ పరిధిలోని పార్నపల్లె తాగునీటి పథకానికి సంబంధించి దాదాపు రూ. 7కోట్లు బకాయిలు ఉండడంతో విద్యుత్ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈఈ చిన్నవీరన్న కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ స్పందించి విద్యుత్ అధికారులకు సరఫరా పునరుద్ధరణ చేయాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

10న రుణాలకు ఇంటర్వ్యూలు

పులివెందుల టౌన్: వివిధ కార్పొరేషన్ల కింద రుణాలకు దరఖాస్తులు చేసుకున్న వారికి 10వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అక్రమ్‌బాష పేర్కొన్నారు. మండలంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, మైనార్టీ రుణాలకు సంబంధించి ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు. 10వ తేదీ గురువారం స్థానిక ఎంపీడీఓ సభాభవనంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు తమ సర్టిఫికెట్లు, ఆధార్, రేషన్ కార్డులు, దరఖాస్తుతో హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.